www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 223 | శుక్రవారం | 2 ఫిబ్రవరి, 2018


...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ఓటు బోటు

ఎన్నికలవల



ఖరీఫ్ మద్దతు పెంపు

వైద్య బీమాతో ఆరోగ్య ధీమా

ఎన్నెన్నో ఆశలు కల్పించి కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ గురువారంనాడు ప్రవేశపెట్టిన 2018-19 వార్షిక బడ్జెట్ ఊహల ఉయ్యాలలను, ఆశల పల్లకీలను ప్రజల ముందు ఉంచింది. ఖరీఫ్ సీజన్‌కు పంటల మద్దతు ధరను ఉత్పాదక వ్యయంపైన 50 శాతం కలిపి ప్రకటించా లనే నిర్ణయంతో వ్యవసాయరంగాన్ని సంతృప్తి పరిచే ప్రయత్నం చేసింది. అయితే సాగులో రెక్కలు ముక్కలు చేసుకొని పాటుపడే కూలీలకు ప్రాణ ప్రదంగా ఉన్న గ్రామీణ ఉపాధిహామీ పథకం కేటాయింపులను పెంచకపోగా, దానిని వ్యవసాయరంగంలో అంతర్భాగం చేస్తారన్న ఆశలను అడియాసలు చేసింది. రూ.330 అతితక్కువ ప్రీమియంకు రూ.5 లక్షల మేరకు వైద్య సేవలు అందించే బీమాను పది కోట్ల కుటుంబాలకు వర్తింపజేసే నూతన ఆరోగ్య రక్షణ పథకాన్ని ప్రకటించి సామాన్య ప్రజలకు అభయహస్తం చాచింది. పన్ను వర్తించే వ్యక్తిగత ఆదాయ పరిమితిని పెంచుతారనే ముంద స్తు ఊహాగానాలకు ఊతమిచ్చిన జైట్లీ అటువంటి చర్య అణు మాత్రమైనా తీసుకోకుండా వేతన జీవులకు నిరాశనే మిగిల్చారు. అదే సమయంలో రూ.250 కోట్ల టర్నోవర్‌గల సంస్థలపై కార్పొరేట్ సుంకాన్ని 30 నుంచి 25 శాతానికి తగ్గించారు. మొత్తం మీద చూసినప్పుడు ప్రధాని మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్‌ను రాబోయే కీలక ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రూపొందించినట్లు బోధపడుతున్నది.

మరిన్ని బడ్జెట్ వార్తలు లోపలి పేజీల్లో

సుఖజీవన బడ్జెట్

గ్రామాలను అభివృద్ధి చేయడం, గ్రామీణులకు కొత్త అవకాశాలను తెచ్చి పెట్టడం మా లక్ష్యం. పంటపొలాలు కళకళలాడాలి. రైతు ముఖంలో చిరునవ్వులు చిందించేలా చేయాలని అనుకుంటున్నాం. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి కూడా చక్కటి జీవితాన్ని అందించేందుకే 'ఈజ్ ఆఫ్ లివింగ్' నినాదంతో బడ్జెట్ తీసుకొచ్చాం.

\- ప్రధాని మోడీ

ఊరటలేని యాతన జీవులు

గ్రామీణ ఆశలు గల్లంతు

వైద్యం అరచేతి వైకుంఠం

మొబైల్ ఫోన్లు..టివిలు పిరం..






మొబైల్ ఫోన్లు కొనబోయే వారికి, తరుచూ మార్చేవారికి, టివిలను కొనేవారికి తీవ్ర నిరాశే ఎదురైంది. సెల్‌ఫోన్లు, టివిల దిగుమతులపై కస్టమ్స్ డ్యూటీ 15 నుంచి 20 శాతానికి పెంచినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. మేకిన్ ఇండియాను ప్రోత్సహించేందుకు తీసుకున్న ఈ నిర్ణయంతో ప్రజలపై భారం పడనుంది. విదేశాల్లో తయారు చేస్తున్న సెల్‌ఫోన్లు, టివిలను ఇక్కడే తయారు చేయడం వల్ల.. ఇక్కడి యువతకు ఉపాధి కూడా దొరికే అవకాశం ఉందనే కోణంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. టివిల విడిభాగాలపై కూడా కస్టమ్స్ డ్యూటీ 15 శాతం పెరగనుంది.

ధరలు

పెరిగేవి



కార్లు, మోటారు సైకిళ్లు, మొబైల్ ఫోన్లు, వెండి, బంగారం, కూరగాయలు, పళ్ల రసాలు, సన్ గ్లాసెస్, సోయా ప్రొటీన్ కాకుండా ఇతర ఆహారాలు, పరిమళ ద్రవ్యాలు, టాయిలెట్ వాటర్స్, సూర్యరశ్మి నుంచి రక్షణ కోసం వినియోగించే క్రీమ్‌లు, పాదాల చికిత్సకు ఉపయోగించే ఔషధాలు, దంతాల పరిశుభ్రత, కట్టుడు పళ్లకు ఉపయోగించే పదార్థాలు, షేవింగ్, ప్రీషేవ్, ఆఫ్టర్ షేవ్ లోషన్లు, డీయోడరెంట్లు, ఫెర్‌ఫ్యూమ్‌లు, స్నానానికి వినియోగించే వస్తువులు, సెంట్, టాయిలెట్ స్ప్రేలు, ట్రక్, బస్సు రేడియల్ టైర్లు, సిల్క్ దుస్తులు, రంగుల రాళ్లు, వజ్రాలు, ఇమిటేషన్ జ్యూయలరీ, స్మార్ట్ వాచ్‌లు, ధరించేందుకు వీలైన డివైస్‌లు, ఎల్‌సిడి, ఎల్ఇడి టివి ప్యానెల్స్, ఫర్నీచర్, దుప్పట్లు, దీపాలు, చేతి, పాకెట్ గడియారాలు, క్లాక్‌లు, ట్రైసైకిళ్లు, స్కూటర్లు, పెడల్ కార్లు, చక్రాలు కలిగిన బొమ్మలు, బొమ్మలు కలిగిన కారేజీలు, పజిల్స్ సహా అన్ని రకాల బొమ్మలు. వీడియో గేమ్ పరికరాలు, స్పోర్ట్స్, ఔట్‌డోర్ గేమ్స్ వస్తువులు, పరికరాలు, స్విమ్మింగ్ పూల్స్, పాడింగ్ పూల్స్, సిగరెట్, ఇతర లైటర్ల కొవ్వొత్తులు, గాలిపటాలు, ఆలివ్, వేరుశెనగ వంటి ఇడిబుల్/ వెజిటబుల్ ఆయిల్స్.



తగ్గేవి

దిగుమతి చేసుకునే ముడి జీడిపప్పు, సోలార్ ప్యానెల్స్/మాడ్యూల్స్ తయారీకి వినియోగించే సోలార్ టాంపర్డ్ గ్లాస్‌లు, చెవుడు మిషన్ల తయారీకి వినియోగించే పరికరాలు, విడి భాగాలు, బాల్ స్క్రూలు, లైనియర్ మోషన్ గైడ్‌లు వంటి ఎంపిక చేసిన సరుకులు, ఎలక్ట్రానిక్స్.

ఆయుష్మాన్ భారత్

ప్రపంచంలోనే అతిపెద్ద ఆరోగ్య పథకం

ప్రతి కుటుంబానికి ఏడాదిలో రూ. 5 లక్షల వైద్య ఖర్చుల చెల్లింపు

టిబి రోగులకు నెలకు రూ.500

3 పార్లమెంటు నియోజకవర్గాలకు ఒకటి చొప్పున 24 కొత్త వైద్య కళాశాలలు



న్యూఢిల్లీ: అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం ప్రకటించింది. ఆరోగ్య సంరక్షణ కోసం వినూత్నమైన పథకాలను తీసుకొచ్చినట్లు కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ తెలిపారు. తన 2018 –19 బడ్జెట్‌లో జైట్లీ ప్రకటించిన జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం దాదాపు 50 కోట్ల మంది ప్రజలకు లబ్ధి కలిగించనున్నది. జాతీయ ఆరోగ్య విధానం కోసం రూ. 1200 కోట్లు కేటాయించడానికి కట్టుబడి తరువాయి 6లో

రైల్వేకు రూ.1.48 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: బడ్జెట్ (2018–19)లో భారతీయ రైల్వేకు రూ. 1.48 లక్షల కోట్ల మూలధన వ్యయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. దేశ ప్రధాన రవాణా అయిన రైల్వే సామర్థ్యం పెంపునకు ఈ ధనాన్ని వెచ్చిస్తామన్నారు. 18000 కి.మీ. మేర రైల్వేలైన్ డబ్లింగ్, గేజ్ మార్పిడి ప్రతిపాదనలను చేశారు. వచ్చే ఏడాది 36,000 కి.మీ. రైలు పట్టాల రిన్యూవల్, బ్రాడ్ గేజ్ రూట్లో ఉన్న 4267 మానవ రహిత (అన్‌మ్యాన్డ్) రైల్వే క్రాసింగ్స్ రెండేళ్లలో ఎత్తివేసే లక్ష్యం పెట్టుకున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి కొత్త రైళ్లను నిర్మిస్తున్నట్లు, ఫ్రైట్ కారిడార్లు రాబోతున్నట్లు, రైల్వేల విద్యుదీకరణ వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్లు ఆర్థిక మంత్రి తెలిపారు. అన్ని రైళ్లలో వైఫై, సిసిటివి క్రమంగా ఏర్పాటు చేస్తామని, 25000కు మించి ప్రయాణికులుండే స్టేషన్లలో ఎస్కలేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు జైట్లీ చెప్పారు. ఆధునీకరణకు 600 స్టేషన్లను గుర్తించినట్లు పేర్కొన్నారు. ముంబయి, తరువాయి 6లో

తెలంగాణ వాటా రూ.19, 207 కోట్లు

న్యూఢిల్లీ : బడ్జెట్ 2018–19లో భాగంగా కేంద్ర పన్నుల్లో వాటాగా తెలంగాణకు రూ. 19,207.43 కోట్లు కేంద్రం ఇవ్వనుంది. ఇందులో కేంద్ర పన్నుల రాబడిలో కార్పొరేట్ పన్ను మొత్తం రూ. 5381 కోట్లు కాగా, ఆదాయపన్ను మొత్తం రూ. 4772 కోట్లు, కేంద్ర జిఎస్‌టి మొత్తం రూ. 6181 కోట్లు, సుంకాల మొత్తం 946 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ పన్నులు 946 కోట్లు. 2016–17 సంవత్సరం అంచనాలతో పోలిస్తే రూ. 481 కోట్లు లోటు కనిపిస్తున్నది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 2018–19వ తరువాయి 6లో

కమలానికి ఉపషాక్

రాజస్థాన్, బెంగాల్ ఉప ఎన్నికల్లో పరాజయం

కాంగ్రెస్, తృణమూల్ జయకేతనం



న్యూఢిల్లీ : లోక్‌సభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన రోజే అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. రాజస్థాన్, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ పార్టీలు విజయకేతనం ఎగురవేశాయి. రాజస్థాన్‌లో అధికారంలో వున్న బిజెపి ప్రభుత్వానికి కీలక ప్రాంతాలైన మండల్‌గఢ్, అజ్మేర్, అల్వార్‌లో ఆ పార్టీ ఓటమి చవిచూసింది. కొద్ది మాసాల్లో రాష్ట్ర ఎన్నికలు జరుగనున్న తరుణంలో ఈ ఫలితాలు బిజెపిని షాక్‌కు గురి చేశాయి. ఇటీవల ఆయా లోకసభ స్థానాల్లో జరిగిన ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు గురువారం జరిగింది. ఈ ఫలితాల్లో బిజెపి రెండు లోకసభ స్థానాలను, ఒక అసెంబ్లీ స్థానాన్ని తరువాయి 6లో

కుంచెపోటు



బడ్జెట్ ప్రభావం రిక్టర్ స్కేల్ మీద ఎంత నమోదయింది సార్..!

డాబాపై శిశువు తల

హైదరాబాద్‌లోని ఉప్పల్ చిల్కానగర్‌లో ఒక ఇంటి పైకప్పమీద ప్రత్యక్షమైన మూడు నెలల పసిపాప శిరస్సు



మన తెలంగాణ/ ఉప్పల్: గుర్తు తెలియని మూడు నెలల పసిపాప తలభాగం ఓ ఇంటి డాబాపై ప్రత్యక్షమైన ఘటన హైదరాబాద్ నగరం ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చిల్కానగర్ మైసమ్మ గుడి ప్రాంతంలో కలకలం రేపింది. క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్న రాజశేఖర్ భార్య బట్టలు ఆరేసేందుకు డాబా పైకి వెళ్లగా, మూడు నెలల పసికందు తల కనిపించింది. వెంటనే తరువాయి 6లో

ఫీ దాహానికి విద్యార్థిని బలి

11

స్కూల్ యాజమాన్యం పరీక్ష రాయనివ్వలేదని ఉరి వేసుకున్న 9వ తరగతి బాలిక

గద్దెపై సమ్మక్క

11



మన తెలంగాణ
2
హైదరాబాద్
శుక్రవారం
2, ఫిబ్రవరి 2018
www.manatelangana.news

నిమ్స్ సేవల విస్తరణకు చర్యలు : మంత్రి లక్ష్మారెడ్డి



మన తెలంగాణ/ హైదరాబాద్ : నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలను మరింత విస్తరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి లక్ష్మారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా సెంట్రల్ ల్యాబరేటరీ సిస్టమ్, స్టెమ్ సెల్ విభాగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటి వల్ల వైద్య సేవలు మరింత మెరుగయ్యే అవకాశముందన్నారు. గురువారం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి నిర్మాణంలో ఉన్న స్టెమ్ సెల్ రిసెర్చ్ ఫెసిలిటీ, బోన్ మారో ట్రాన్స్ ప్లాంటేషన్ గదులతో పాటు సెంట్రల్ ల్యాబటరేటరీ విభాగాలను పరిశీలించారు. వీటిని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ నిమ్స్‌లో ఇప్పటికే అనేక వసతులు కల్పించామని, మరిన్ని సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎమర్జన్సీ విభాగంలో చికిత్స పొందుతున్న పలువురిని కలిసిన మంత్రి వారికి అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. పీజీ హాస్టల్ పనులను కూడా త్వరలో చేపట్టనున్నట్లు నిమ్స్ డైరెక్టర్ మనోహర్ తెలిపారు. నిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ సత్యనారాయణ, డీన్ సుభాష్ కౌర్ పాల్గొన్నారు.

సౌరవిద్యుత్‌కు కేంద్రం ప్రోత్సాహం

మన తెలంగాణ/హైదరాబాద్ : సౌరవిద్యుత్ వినియోగం, గ్రీన్ కారిడార్‌కు ఏర్పాటుపై కేంద్రం ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. సౌరవిద్యుత్ ఉత్పత్తిలో దేశంలోనే మొదటి రాష్ట్రంగాఉన్న తెలంగాణ ఇందులో భాగస్వామి అవుతోంది. సుమారు 11 వేల మెగావాట్ల సౌరవిద్యుత్‌ను జాతీయ గ్రిడ్‌కు అనుసంధానం చేయాలని కేంద్రం భావిస్తుండగా, ఇందులో 1000 మెగావాట్లు రూఫ్‌టాఫ్‌కే కేటాయించింది. సౌర విద్యుత్‌తో పాటు రూఫ్ టాప్ వినియోగం పెంచేందుకు కేంద్రం రూ.2,045.25 కోట్లు తాజా బడ్జెట్‌లో కేటాయించింది. వీటితో గ్రీన్ ఎనర్జీ కారిడార్ కోసం కేంద్రం రూ.600 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో 8 రాష్ట్రాల్లో 3000 సర్క్యూట్ కిలోమీటర్ల మేర ప్రత్యేక లైను నిర్మాణం జరుగుతుంది. ఇందులో గణనీయమైన వాటా తెలంగాణకు దక్కుతుంది.

అమ్ముకోవచ్చు : సోలార్ పంపుసెట్లు వినియోగిస్తున్న రైతులకు కేంద్రం శుభవార్త మోసుకొచ్చింది. స్వంతంగా ప్యానెళ్ళు పెట్టుకుని ఉత్పత్తి చేస్తున్న సౌర విద్యుత్‌ను మోటారు పంపులకు వినియోగించుకున్న తర్వాత మిగిలితే దాన్ని డిస్కంలకు అమ్ముకునేందుకు అవకాశం ఇచ్చింది. సహేతుకమైన ధరకు ఆ విద్యుత్‌ను డిస్కంలు కొనాలని ఆదేశించింది. ఇంటిపై సోలార్ ప్యానళ్లు పెట్టుకొని అవసరమైనంత వాడుకోగా మిగిలిన దాన్ని గ్రిడ్‌కు అనుసంధానించే పద్ధతి గత ఆరేళ్లుగా రాష్ట్రంలో అమలులో ఉంది. దీన్ని నెట్ మీటరింగ్ పేరుతో ప్రత్యేక బిల్లింగ్ చేస్తారు. ఇదే తరహాలో రైతులు కూడా తమ అవసరాలకు వాడుకోగా మిగిలిన సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి డిస్కంలకు అమ్ముకోవచ్చు.

కెటిఆర్ సవాల్‌కు సై

కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే మా కుటుంబం రాజకీయ సన్యాసం : ఉత్తమ్



మన తెలంగాణ/హైదరాబాద్: 2019ఎన్నికల్లో టిఆర్ఎస్ అధికారంలోకి రాకపోతే రాజకీయ సన్యాసం చేస్తానని, మీరు ఆ పని చేస్తారా? అని మంత్రి కె.తారకరామారావు విసిరిన సవాలుకు పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి సై అన్నారు. ''నేను కెటిఆర్ సవాలును బేషరతుగా స్వీకరిస్తున్నా. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రాకపోతే నేను, నా భార్య, నా కుటుంబసభ్యులంతా రాజకీయాల నుంచి తప్పుకుంటాం. కాం గ్రెస్ అధికారంలోనికి వస్తే నువ్వు(కెటిఆర్), మీ నాయన, మీ చెల్లె, మీ బావ రాజకీయాల నుండి తప్పుకుంటారా?' అని ప్రతి సవాల్ విసిరారు. పదే పదే టిఆర్ఎస్‌కు వంద సీట్లు గెలుస్తామంటున్న కెసిఆర్, అన్ని సీట్లు రాకపోతే ఏమి చేస్తారో స్పష్టం చేయాలన్నారు. గద్వాలలో మంత్రి కెటిఆర్ విసిరిన సవాలుపై గాంధీభవన్‌లో గురువారం జరిగిన మీడియా సమావేశంలో ఉత్తమ్ స్పందించారు. ఎన్నికలు 2018 లేదా 2019లో ఎప్పుడు వచ్చినా తాము సిద్ధంగా నే ఉన్నామని, కాంగ్రెస్ పార్టీ 70 పైచీలుకు సీట్లు గెలిచి అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోనికి రాగానే సిఎం కెసిఆర్, కెటిఆర్, హరీశ్‌రావు, కవిత రిటైర్‌మెంట్ తీసుకోవల్సిందేనన్నారు. రాష్ట్రంలో నిశ్శబ్ధ విప్లవం వీస్తోందని, వచ్చే ఎన్నికల్లో కెసిఆర్ కుటుంబాన్ని తరిమికొట్టేందుకు అన్ని వర్గాలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ఒక పక్క ప్రజలు అనేక సమస్యలు, ఇబ్బందుల్లో ఉంటే, మరో వైపు మంత్రి కెటిఆర్ అవకాశవాద రాజకీయ నేతలతో కలిసి ప్రజా ధనంతో విలాసవంతమైన జీవితాన్ని గడుపుతున్నారని, మంత్రి విదేశీ పర్యటనతో రాష్ట్రానికిపెట్టుబడి, ఉద్యోగాలు వచ్చే అవకాశాలే లేవని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కూడా కెసిఆర్ పాలన కొనసాగితే ప్రజా స్వామ్యం మరింత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. ఐపిసి 506,507 చట్ట సవరణ పేరుతో అడ్డగోలుగా పౌరహక్కులను అణచివేస్తున్నారని, పౌరహక్కులను కాపాడేందుకు కాంగ్రెస్ నిత్యం పౌరులకు అండగా ఉంటుందన్నారు. చట్టాల సవరణ పేరుతో సిఎం కెసిఆర్ తెలంగాణ సమాజాన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని విమర్శించారు. తమ పాలన ఎంతో అద్భుతమని గొప్పలు చెప్పుకుంటున్న సిఎం కెసిఆర్ ప్రతిపక్షాల విమర్శలు, వ్యాఖ్యలకు ఎందుకు భయపడుతున్నారని, అద్భుత పాలకులు తమను చూసి ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. ప్రతి కాంట్రాక్ట్ పనుల్లో సిఎం కెసిఆర్ కుటుంబానికి 6 శాతం కమీషన్లు అప్పజెప్పాల్సిందేనని అన్నారు.''ప్రజాస్వామ్య, మానవ హక్కులను అణచివేస్తున్నరు...మంత్రి కెటిఆర్ గుర్తుంచుకో.. ఇదంతా తాత్కాలికమే..అడ్డగోలుగా మాట్లాడితే ప్రజలు సహించర''ని హెచ్చరించారు.

రాజకీయాల్లో కెటిఆర్ బచ్చా...

రాజకీయాల్లో మంత్రి కెటిఆర్ ఒక బచ్చా అని, దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై ఆయన ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉన్నదని ఉత్తమ్‌కుమార్ రెడ్డి మండిపడ్డారు. రాహుల్‌గాంధీ మూడు పర్యాయాలుగా ఎంపిగా ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా లబ్ధిపొందలేదని, ప్రజల కోసం ఉన్న ఆస్తులను వదులుకున్న కుటుంబంపై కమీషన్ ఏజెంట్లుగా పనిచేస్తున్న మంత్రి కెటిఆర్ కుటుంబం ఆరోపణలు చేయడం అన్యాయమన్నారు. కెసిఆర్ కుటంబం ఏం చేసినా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడేదే కాదని, తెలంగాణలో అమరవీరుల త్యాగాలను గుర్తించిన సోనియా గాంధీ ధృడసంకల్పంతో తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రం ఏర్పడితే తమకు మేలు జరుగుతోందని ఎంతో ఆశతో ప్రజలు ఎదురుచూస్తే, అలాంటి తెలంగాణ రాష్ట్రాన్ని కెసిఆర్ కుటుంబం అడ్డగోలుగా అవినీతికి పాల్పడుతోందని, కండ్లు నెత్తికెక్కి ఆహంకారంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

దేశ సేవ చేసిన యుద్ధపైలెట్‌ని : కెసిఆర్ కుటుంబంలాగా తమ కుటుంబం రాష్ట్రం మీద పడి దోచుకోలేదని ఉత్తమ్ అన్నారు. తాను చైనా-పాకిస్తాన్ సరిహద్దులో పనిచేశానని, యుద్ధవిమాన పైలెట్‌గా ప్రాణాలను పణంగా పెట్టి పోరాడానని, దేశానికి సేవ చేసానన్నారు. నిస్వార్థ సేవ చేయాలనే ఉద్దేశ్యంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, తనకు పిల్లలు కూడా లేరని, భార్య భర్తలిద్దరమే ఉన్నామని, అధికారంలోకి రాకపోతే రాజకీయాల నుండి తప్పుకుంటామని వివరించారు. ఎంఎల్‌ఎలు వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, ఎంఎల్‌సి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఆకుల లలిత, నేతలు మల్లురవి, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

5న టెన్త్ విద్యార్థులకు నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే



మనతెలంగాణ/హైదరాబాద్: 10వ తరగతి విద్యార్థుల అభ్యాసన ఫలితాలను అంచనా వేసేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు కేంద్ర పాలిత ప్రాంతాలలో ఈ నెల 5న నేషనల్ అచీవ్ మెంట్ సర్వే జరగనుంది. రాష్ట్రంలోని ప్రతీ జిల్లా నుంచి ఎంపిక చేసిన 80 స్కూళ్ళలో 10వ తరగతి విద్యార్థులకు ఆంగ్లం, గణితం, సామాన్య శాస్త్రం, సాంఘిక శాస్త్రంతో పాటు ఒక ఆధునిక భారతీయ భాషలో పరీక్ష ఉంటుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పరీక్షతో పాటు పాఠశాల వివరాలు,ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం, గ్రామీణ పట్టణ ప్రాంతాలలో చదువుతున్న విద్యార్థులు, వారి సామాజికవర్గాల ఆధారంగా అభ్యసన ఫలితాలు సర్వే సిబ్బంది అంచనా వేస్తారని పేర్కొన్నారు. ఈ సర్వేలో క్షేత్ర స్థాయి పరిశోధకులుగా ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను నియమించినట్లు తెలిపారు. 10వ తరగతిని బోధించే ఉపాధ్యాయులు ఈ సర్వేలో పాల్గొనరని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని మొత్తం 2,484 పాఠశాలల్లో సుమారు 92, 978 మంది 10వ తరగతి విద్యార్థులు ఈ సర్వేలో పాల్గొనబోతున్నారని పేర్కొన్నారు. సర్వే ఫలితాల ఆధారంగా ఒక జిల్లా ను యూనిట్‌గా తీసుకుని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హజ్ కమిటీ చైర్ పర్సన్‌గా మసి ఉల్లా ఖాన్ ఎన్నిక

మన తెలంగాణ / హైదరాబాద్ : కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటి చైర్ పర్సన్‌గా మసిఉల్లా ఖాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి దాన కిషోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల జరిగిన సమావేశంలో హజ్ కమిటి సభ్యులు చైర్‌పర్సన్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్ పర్సన్ మూడేళ్ళు పదవిలో కొనసాగుతారు.

కిటికి గ్రిల్స్ తొలగించి ఇంట్లో చోరీ



మన తెలంగాణ/హైదరాబాద్/బోడుప్పల్ : ఇంటి బెడ్ రూమ్ లోని కిటికి గ్రిల్స్ తొలగించి బంగారు అభరణాలు, వెండి వస్తువులతో పాటు రూ.లక్ష నగదును దొంగలించిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం మేడిపల్లి సుమారెసిడెన్సీ కాలనీలో నివాసం ఉంటున్న పూల సత్తయ్య స్థానికంగా మగ్గం వర్క్ పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి నగరంలోని చిలుకానగర్‌లో ఉంటున్న తన బంధువు చనిపోవడం తో కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. తిరిగి గురు వారం రాత్రి వచ్చి చూసే సరికి ఇంటి బెడ్ రూమ్‌లోని కిటికి గ్రిల్స్ తొలగించి ఉండడం తో అందోళనకు గురైన సత్తయ్య లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉన్నాయి బీరువాలోని 14 తులాల బంగారు అభరణాలు, 5 తులాల వెండి వస్తు వులు, రూ.లక్ష నగదు కనిపించక పోవడంతో చోరీకి గురైనట్లు గ్రహించి మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రికార్డుస్థాయిలో పన్ను వసూళ్లు

- **జనవరిలో రూ. 1,656.14 కోట్లు రాబడి**
- **అమల్లోకి వచ్చిన ఈ వేబిల్లు విధానం**
- **సరుకు 50వేలకు మించితే బిల్లు తప్పనిసరి**



మన తెలంగాణ/ హైదరాబాద్: తెలంగాణలో వాణిజ్య పన్నుల వసూళ్ళు సంతృప్తికరంగా ఉన్నాయని, డిసెంబర్ నెల పన్నులు జనవరిలో రికార్డు స్థాయిలో వసూలయ్యాయని రెవిన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సోమేష్‌కుమార్ తెలిపారు. డిసెంబర్ మాసంలో రూ. 1,493.50 కోట్ల మేర పన్ను ఆదాయం ఉంటే జనవరిలో రూ. 1,656.14 కోట్లు వసూలైందని, అందుకే జిఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రానికి జనవరి చాలా మంచి నెల అని అన్నారు. సచివాలయంలో గురువారం సాయంత్రం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఎస్‌టి అమలులోకి వచ్చిన మొదటి నెల (ఆగస్టు)లో రూ. 1,258.79 కోట్లు ఆదాయం వస్తే జనవరినాటికి అది 1,656.14 కోట్లకు చేరుకుందన్నారు. రానున్న రెండు నెలల్లోనూ ఇదే తరహాలో ఆదాయం పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పన్నుల రిటర్న్స్ సమర్పించకపోవడం, సమర్పించినా ఆ మొత్తన్ని చెల్లించకపోవడంతో సుమారు 14000 మంది వ్యాపారులకు నోటీసులు జారీ చేశామని, రెండువారాల్లోనే 20% మేర వసూలయ్యాయని తెలిపారు. ప్రతి 200 మంది వ్యాపారులకు ఒక సిబ్బందిని ప్రత్యేకంగా పన్ను వ్యవహారాల పర్యవేక్షణకు కేటాయించామని, మొబైల్ టీంల ద్వారా తనిఖీలు చేపడుతున్నామని, ఒకే రోజు పలు ప్రాంతాల్లో 'మహా తనిఖీ' నిర్వహించామని, 786 వాహనాలను తనిఖీ చేసి నిబంధనలను ఉల్లంఘించినందుకు 90 వాహనాలను జప్తుచేసి సుమారు రూ. 1.20 కోట్లను జరిమానాగా వసూలు చేశామని తెలిపారు. జిఎస్‌టి విధానంలో రెండవ అతి పెద్ద సవాలుగా భావిస్తున్న 'ఇ వే బిల్' ఫిబ్రవరి 1 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని, దీంతో సరుకు రవాణా సరళ తరం కావడం మాత్రమే కాకుండా పారదర్శకత చోటుచేసుకుంటుందని సోమేశ్‌కుమార్ వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు ఒక్కో రాష్ట్రానికి ఒక విధంగా ఉన్నప్పటికీ ఇక నుంచి దేశవ్యాప్తంగా ఒకే తరహా 'ఇ వే బిల్లు' విధానం ఉంటుం దన్నారు. సరుకు రవాణా కదలికలు అన్ని రాష్ట్రాలకూ తెలిసిపోతాయని వివరించారు. రూ. 50వేల కంటే ఎక్కువ విలువ కలిగిన సరుకు రవాణాకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని స్పష్టం చేశారు.

ఇంటర్ ఆన్‌లైన్ అడ్మిషన్లు అటకెక్కినట్లేనా..?

- **ప్రవేశాలపై పడని ముందడుగు**
- **అఫిలియేషన్‌తో సహా అన్నీ సర్వీసులు ఆన్‌లైన్‌లోనే...**

మనతెలంగాణ/హైదరాబాద్ : ఇంటర్ ఆన్‌లైన్ ప్రవేశాలు అటకెక్కినట్లే కనిపిస్తోంది. జూనియర్ కళాశాలల్లో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం గత రెండేళ్లుగా చెబుతున్నా ఏదో ఒక సాకు చూపుతూ వాయిదా వేస్తూ వస్తోంది. ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియ మొదలు అనేక సర్వీసులను ఇంటర్ బోర్డ్ ఆన్‌లైన్‌లోనే నిర్వహిస్తున్నా అడ్మిషన్ విషయంలో మాత్రం స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. డిగ్రీ తరహాలో ఇంటర్‌లో కూడా ఆన్‌లైన్ ప్రవేశాలు చేపడితే కళాశాలల ఫీజుల్ని వెబ్‌సైట్‌లో పొందుపరచాల్సి ఉంటుం ది. కళాశాలల ఆదాయ, వ్యయాలకు అనుగుణంగా ఫీజులు నిర్ణయించబడతాయి. జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్యకు తగినట్లు మౌలిక సదుపాయాలు, ఫీజులు వసూళ్ళు, బోధనా సిబ్బంది అర్హతలు తదితరాలపై ప్రభుత్వ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలు అందుకు తగినట్లుగా సౌకర్యాలను కూడా కల్పించాలి. కానీ 'బ్రాండ్ నేమ్' పేరుతో ఇష్టానుసారంగా ఫీజులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫీజుల నియంత్రణకు స్పష్టమైన విధానం లేకపోవడంతో యాజమాన్యాలే ఖరారు చేసుకుంటున్నాయి. డే స్కాలర్ విద్యార్థులకు ఏటా రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నాయి. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఫీజుల నియంత్రణకు రెండేళ్ల క్రితం ప్రభుత్వం నిపుణులతో కమిటీని నియమించింది. కానీ ఇప్పటివరకు ఆ కమిటీ నివేదిక బహిర్గతం కాలేదు.

శ్రీచైతన్య విద్యాసంస్థలకు అవార్డు

మనతెలంగాణ/హైదరాబాద్: శ్రీచైతన్య విద్యాసంస్థలకు ప్రతిష్టాత్మక 'ఏషియాస్ గ్రేటెస్ట్ బ్రాండ్స్–2017' అవార్డు లభించింది. ఇటీవల సింగపూర్‌లో ఏషియా వన్ మేగజైన్ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.ఎస్.రావు తరపున ఆ సంస్థ అకడమిక్ డైరెక్టర్ సుష్మ ఈ అవార్డును స్వీకరించారు. డాక్టర్ బి.ఎస్.రావు మాట్లాడుతూ, ఈ అవార్డు తమ విద్యాసంస్థ అత్యుత్తమ ప్రతిభకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వ్యవస్థాపకులుగా తాము నెలకొల్పిన విలువలు, క్రమశిక్షణను తమ పిల్లలు కొనసాగిస్తూ ప్రతిక్షణం ఎంతో అప్రమత్తతతో శిక్షణను అందించడం వల్లనే శ్రీచైతన్య ఇంతటి ఘన విజయాలు సాధిస్తోందన్నారు. వారు డైరెక్టర్లుగా ఎంతో స్ఫూర్తివంతంగా విద్యారంగానికి సేవలందిస్తున్నందుకు గర్వకారణంగా ఉందని కొనియాడారు. ఈ పరంపరం



ఇదే మాదిరిగా భవిష్యత్తులోనూ కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇందుకు సహకరిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులకు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



కేంద్ర బడ్జెట్ పేదలకు కొత్త రెక్కలనిచ్చింది: అమిత్ షా

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ పేద ప్రజలకు కొత్త రెక్కలనిచ్చిందని బిజెపి అధ్యక్షుడు అమిత్ షా అన్నారు. రైతులు, మౌలిక సౌకర్యాలు, గ్రామీణ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహిస్తుందన్నారు. ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం ముగిసిన వెంటనే అమిత్ షా అనేక ట్వీట్లు చేశారు. రికార్డు స్థాయిలో నిధులు కేటాయించడంతో గ్రామీణ, వ్యవసాయ రంగాలు అసాధారణ రీతిలో అభివృద్ధి చెందుతాయన్నారు. ఈ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందన్నారు. కనీస మద్దతు ధరను 1.5 రెట్లు పెంచాలనే చారిత్రాత్మక నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీని ఆయన ప్రశంసించారు. ఇది రైతుల పట్ల బిజెపికి ఉన్న నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్ పేద ప్రజలు, రైతులు, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలకు కొత్త రెక్కలనిచ్చిందని, ఈ బడ్జెట్ నిజంగా అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తుందన్నారు. ఆరోగ్య బీమా, ఆరోగ్య హామీనిచ్చే 'ఆయుష్మాన్ భారత్' అసాధారణ నిర్ణయమని అమిత్ షా పేర్కొన్నారు. సౌభాగ్యయోజన, ఏకలవ్య స్కూళ్లు, ముద్రా యోజన వంటి అనేక పథకాలను ప్రభుత్వం ప్రవేశ పెట్టిందన్నారు.

రైతులకు రూ.11 లక్షల కోట్ల రుణాలు

ఖరీఫ్ సీజను నుంచే కనీస మద్దతు ధర
మత్స్య, పశు పెంపకందార్లకూ కిసాన్ క్రెడిట్ కార్డులు
వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి ప్రోత్సాహం




న్యూఢిల్లీ: బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేశారు. పాడి వంటి ఖరీఫ్ పంటలకు ఉత్పత్తి ధరకన్నా కనీసం 50 శాతం ఎక్కువ ఉండేలా మద్దతు ధరను కల్పిస్తామని అరుణ్ జైట్లీ తెలిపారు. వ్యవసాయ రుణాలను వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి 10 శాతం మేరకు పెంచి రూ. 11 లక్షల కోట్లు కేటాయించబోతున్నామన్నారు. ప్రధాని అభిలాష మేరకు 2022 నాటికి రైతుల ఆదాయం రెండింతలు పెంచాలన్నదే ఆశయంగా పెట్టుకున్నామని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజను నుంచే కనీస మద్దతు ధరను(ఎంఎస్‌పి) ప్రభుత్వం నిర్ణయించనుందన్నారు. రబీ(శీతాకాలం నాటిన) పంటలకు ఇప్పటికే కనీస మద్దతు ధర పెంచినట్లు ఆయన తెలిపారు. ఒకవేళ ధరలు పతనమైనా కూడా రైతులకు ప్రభుత్వం మద్దతు ధరను కల్పిస్తుందన్నారు. అందుకు కావాలసిన సంస్థాగత యంత్రాగం గురించి రాష్ట్రప్రభుత్వాలతో నీతి ఆయోగ్ చర్చించనుందని తెలిపారు. వ్యవసాయ రుణ లక్ష్యాన్ని వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 1 లక్ష కోట్ల నుంచి రూ. 11 లక్షల కోట్లకు పెంచనున్నట్లు జైట్లీ ప్రతిపాదించారు. రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇస్తామని, ఇక నుంచి చేపలు, పశు పెంపకందారులకూ కిసాన్ క్రెడిట్ కార్డులను విస్తరిస్తామని అన్నారు. వ్యవసాయ మార్కెటింగ్‌ను మెరుగుపరిచేందుకు రూ. 2000 కోట్ల 'అగ్రి-మార్కెట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్'ను జైట్లీ ప్రకటించారు. 22,000 గ్రామీణ వ్యవసాయ మార్కెట్లు(జిఆర్ఎంఎస్), 585 ఎపిఎంసి టోకుధరల మండీలలో మౌలిక వసతుల కోసం ఈ మొత్తాన్ని కేటాయించారు.

మౌలిక వసతులకు ప్రత్యేక నిధి...

మత్స్య, పశు సంవర్ధక శాఖలకు రూ. 10 వేల కోట్లతో మౌలిక వసతుల నిధిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎలక్ట్రానికల్లీ లింక్డ్ నేషనల్ అగ్రికల్సర్ మార్కెట్ (ఇ-నామ్) కార్యక్రమం కింద 585 మార్కెట్లలో 470 మార్కెట్లను అనుసంధానం చేశారు. 2018 మార్చి నాటికి మిగతా వాటిని కూడా అనుసంధానం చేయనున్నట్లు అరుణ్ జైట్లీ వెల్లడిం వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిని ప్రోత్సాహించడానికి ప్రభుత్వం చర్చలు చేపట్టిందని, వ్యవసాయోత్పత్తుల ఎగుమతి 100 బిలియన్ డాలర్ల మేరకు చేరుకునే అవకాశం ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. 42 మెగా ఫుడ్‌పార్క్‌లలో స్టేట్-ఆఫ్-ఆర్ట్ ఫెసిలిటీ ఏర్పాటు ప్రతిపాదనను కూడా ఆయన చేశారు. మన దేశ ఎగుమతుల్లో వ్యవసాయోత్పత్తులు 10 శాతం కన్నా ఎక్కువే. ఎగుమతులకు అవకాశం ఉన్న దేశాలను గుర్తించే పనిని వాణిజ్య మంత్రిత్వ శాఖ చేపట్టిందన్నారు. తేయాకు, కాఫీ, పండ్లు, కూరగాయలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతికి సంబంధించిన సరుకు రవాణా వంటి సమస్యలను పరిష్కరించడానికి సమగ్ర విధానాన్ని కూడా వాణిజ్య మంత్రిత్వ శాఖ రూపొందించే పనిలో ఉందని జైట్లీ ప్రకటించారు. భారత్ ప్రధానంగా తేయాకు, కాఫీ, బియ్యం, గింజధాన్యాలు, పొగాకు, సుగంధద్రవ్యాలు, జీడి, నూనె పదార్థాలు, పండ్లు, కాయగూరలు, సముద్ర ఉత్పత్తులు ఎగుమతి చేస్తోంది. 2017 డిసెంబర్‌లో వాణిజ్య మంత్రిత్వ శాఖ 13 వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతి తీరును పరిశీలించింది. వాటిలో గింజధాన్యాలు, నూనె పదార్థాలు, నూనె గింజలు, పండ్లు, కాయగూరల ఎగుమతులు తగ్గిపోయాయని గుర్తించింది. టమాట, ఉల్లి, ఆలుగడ్డ వంటి ఉత్పత్తుల అత్యంత ధరల ఒడిదుడుకులను నియంత్రించడానికి 'ఆపరేషన్ ఫ్లడ్' తరహాలో 'ఆపరేషన్ గ్రీన్స్' ఆవిష్కరించే ప్రతిపాదనను అరుణ్ జైట్లీ చేశారు. దీనికి రూ. 500 కోట్లు కేటాయించే ప్రతిపాదన చేశారు. వెదురు(బాంబు) 'పచ్చ బంగారం' అని, వెదురు రంగాన్ని ఆచరణాత్మకంగా ప్రోత్సాహించేందుకు రూ. 1290 కోట్లను కేటాయిస్తున్నట్లు జైట్లీ ప్రకటించారు.

రాష్ట్రపతి జీతం రూ.5లక్షలు




న్యూఢిల్లీ : రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి జీతాలు భారీ మొత్తంలో పెరిగాయి. రాష్ట్రపతికి నెలకు రూ.5 లక్షలు, ఉప రాష్ట్రపతికి రూ.4 లక్షల మేరకు వేతనాలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగంలో ఈ విషయాన్ని ప్రకటించారు. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, గవర్నర్‌ల జీతాలు 2006 జనవరి 1న చివరిసారిగా పెరిగాయని, అప్పటి నుంచి ఇదే మొదటి పెరుగుదల అని తెలిపారు. ' రాష్ట్రపతికి రూ.5లక్షలు, ఉప రాష్ట్రపతికి రూ.4 లక్షలు, గవర్నర్‌కు 3.5 లక్షలు నెలసరి జీతాలుగా సవరించాం' అని జైట్లీ తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రపతి నెలకు రూ.1.50 లక్షలు, ఉప రాష్ట్రపతి 1.25 లక్షలు, గవర్నర్ రూ.1.10 లక్షలు జీతాలు పొందుతున్నారు. ఏడవ వేతన సవరణ సంఘం 2016 జనవరి 1న చేసిన సిఫార్సుల అనంతరం దేశంలో పెద్ద అధికార హోదాలో ఉన్న కేబినెట్ కార్యదర్శి రూ.2.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రూ.2.25 లక్షల జీతాలను పొందుతుండగా, ఇప్పటి వరకు త్రివిధ దళాలకు అధినేత అయిన రాష్ట్రపతి ఆ మూడు విభాగాల అధిపతుల కంటే తక్కువ జీతాన్ని పొందుతుండడం గమనార్హం. వీరు ముగ్గురూ కేబినెట్ కార్యదర్శికి సమానంగా జీతాలు పొందుతున్నారు.

వాళ్లు కూడా విమానాల్లో...



న్యూఢిల్లీ: రబ్బరు(హవాయ్) చెప్పులు వేసుకునేవారు సైతం విమానంలో ప్రయాణించగలగాలి అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం అన్నారు. సామాన్యుడు కూడా నింగిలో ప్రయాణించ గలిగే స్థాయికి విమానాశ్రయాల సామర్థ్యం పెరగాలి. 2018 బడ్జెట్ సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పారు. 'ఉడే దేశ్‌కా ఆమ్ నాగరిక్' (ఉడాన్) కింద ప్రభుత్వం సామాన్యులు కూడా విమానంలో ప్రయాణించగలిగేలా చేస్తోందన్నారు. చాలామంది భారతీయులు విశ్రాంతి సమయంలో కాక అన్ని వేళలా రబ్బరు చెప్పులు వేసుకుంటుంటారని ఆయన చెప్పారు. 'మేము ఇప్పటి వరకు నడవని 56 విమానాశ్రయాలు, 31 హెలిపాడ్లకు అనుసంధానం చేస్తున్నాం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఉడాన్ పథకం కింద తొలి ప్రాంతీయ విమానాలకు గత ఏప్రిల్‌లో జెండా ఊపారని ఆయన ప్రస్తావించారు. ఆరంభంలో సిమ్లా నుంచి ఢిల్లీకి, కడప నుంచి హైదరాబాద్‌కు, నాందేడ్ నుంచి హైదరాబాద్‌కు ఈ మూడు ప్రాంతీయ విమానాలు నడిపారు. ప్రాంతీయ అనుసంధానానికి ఉద్దేశించిన తొలి విమాన పథకం ఉడాన్.

ఆంగ్లం..హిందీ భాషల్లో

ఈసారి బడ్జెట్ ప్రసంగ పాఠం చదవడం విషయంలో ఆర్థిక మంత్రి అరుణ జైట్లీ కొత్త పంథాను అనుసరించారు. రెండు భాషల్లో ప్రసంగాన్ని చదివారు. హిందీలో బడ్జెట్ విషయాలను ప్రసంగిస్తారని, తద్వారా గ్రామీణ ప్రజలు, రైతులకు అర్థమయ్యే రీతిలో హిందీలో మాట్లాడుతారని కొన్ని వర్గాలు వెల్లడించాయి. కానీ జైట్లీ మాత్రం అటు పూర్తిగా ఆంగ్లంలో కాకుండా.. ఇటు పూర్తిగా హిందీలో కాకుండా రెండు భాషల్లో అనర్గళంగా ప్రసంగించారు. సంప్రదాయానికి భిన్నంగా బడ్జెట్‌ను రెండు భాషల్లో ప్రవేశపెట్టడం ఇదే తొలిసారి కావడం విశేషం. మరోవైపు మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ ప్రవేశపెడుతూ వస్తున్న ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ కూర్చుని తన బడ్జెట్ ప్రసంగాన్ని చదివే సంప్రదాయాన్ని పాటిస్తూ వస్తున్నారు. ఎప్పటిలాగానే తొలుత నిల్చుని బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన ఆయన తొలి 30 నిమిషాల అనంతరం కూర్చుని బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు.


ఎక్సైజ్ సుంకం తగ్గించినా...



దినదినం పెరుగుతున్న పెట్రో ధరలతో కుదేలవుతున్న వాహనదారులకు బడ్జెట్ స్వల్ప ఊరట ఇచ్చింది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను ప్రభుత్వం రెండు రూపాయల మేర తగ్గించింది. అన్‌బ్రాండెడ్ పెట్రోల్‌పై ఎక్సైజ్ డ్యూటీని లీటర్‌కు రూ 6.48 నుంచి రూ 4.48కి తగ్గించింది. బ్రాండెడ్ పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ 7.66 నుంచి రూ 5.66కు తగ్గించింది. ఇక బ్రాండెడ్ డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటర్‌కు రూ 8.69కు తగ్గిం చింది. పెట్రో ఉత్పత్తుల ధరలు ఇటీవల పెరుగుతూ దేశవ్యాప్తంగా రికార్డు స్థాయిలో లీటర్‌కు రూ 80కి చేరిన విషయం తెలిసిందే. ప్రభుత్వం తాజాగా ఎక్సైజ్ డ్యూటీలను తగ్గించడంతో ఆ మేరకు వీటి ధరలు కొద్దిగా దిగివచ్చే అవకాశం ఉంది. పెట్రోల్, డీజిల్‌పై రెండు రూపాయల మేర ఎక్సైజ్ డ్యూటీ తగ్గించినప్పటికీ మొత్తాన్ని సెస్‌కు మళ్లించినట్లు ఆర్థిక శాఖ కార్యదర్శి హస్ముఖ్ అధియా తెలిపారు. దీంతో వాటి రేట్లలో ఎలాంటి మార్పు ఉండబోదని ఆయన స్పష్టంచేశారు. బడ్జెట్‌లో విద్య, ఆరోగ్యంపై ఉన్న సెస్‌ను మూడు నుంచి నాలుగు శాతానికి పెంచిన విషయం తెలిసిందే. దీంతో ఈ తగ్గిన ఎక్సైజ్ డ్యూటీ అటు పెరిగిన సెస్‌తో సమానమైంది.


బడ్జెట్ 2018-19

బడ్జెట్ : కీలక అంకెలు



రూ. కోట్లలో	2016-17 వాస్తవికం	2017-18 బడ్జెట్ అంచనాలు	2017-18 సవరించిన అంచనాలు	2018-19 బడ్జెట్ అంచనాలు
ఆదాయం వసూళ్లు	13,74,203	15,15,771	15,05,428	17,25,738
మూలధన వసూళ్లు	6,00,991	6,30,964	7,12,322	7,16,475
మొత్తం వసూళ్లు	19,75,194	21,46,735	22,17,750	24,42,213
మొత్తం వ్యయం	19,75,194	21,46,735	22,17,750	24,42,213
ఆదాయ లోటు	3,16,381	3,21,163	4,38,877	4,16,034
వాస్తవిక ఆదాయ లోటు	1,50,648	1,25,813	2,49,632	2,20,689
ద్రవ్యలోటు	5,35,618	5,46,531	5,94,849	6,24,276
ఆర్థిక లోటు	54,904	23,453	64,006	48,481

PIB/KBK



జౌళి రంగానికి ప్యాకేజీతో ఊపు

వస్త్ర ఉత్పత్తి, ఎగుమతుల రంగానికి ప్రోత్సాహం
బడ్జెట్‌లో రూ.7,148 కోట్లు కేటాయించిన ప్రభుత్వం




న్యూఢిల్లీ : వస్త్ర ఉత్పత్తి, ఎగుమతుల రంగానికి రూ.7,148 కోట్ల ప్రత్యేక ప్యాకేజీతో బడ్జెట్ కేటాయింపుల పట్ల హర్షం వ్యక్తమవుతోంది. గత ఏడాది బడ్జెట్‌లో చేసిన కేటాయింపు వస్త్ర ఉత్పత్తి, ఎగుమతుల రంగానికి ఎంతో ప్రోత్సాహాన్ని ఇవ్వనుంది. 'ఈ బడ్జెట్ కార్యసాధకమైంది. ప్రగతిదాయకమైంది, అన్నింటి సమ్మిళితమైంది' అని కాటన్ టెక్స్‌టైల్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ (టెక్స్‌ప్రోసిల్) చైర్మన్ ఉజ్వల్ లాహోటి పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.6 వేల కోట్లతో సమగ్ర వస్త్ర రంగ ప్యాకేజీని ఆమోదించిందని, బడ్జెట్‌లో రూ.7,148 కోట్ల కేటాయించిందని, అదనంగా కేటాయించిన ఈ నిధుల వల్ల వస్త్రాలు కూడా రిబేట్ ఆన్ స్టేట్ లెవీస్ (ఆర్ఓఎస్ఎల్) స్కీం కిందకు వస్తాయని, ఫలితంగా ఈ రంగానికి ప్రోత్సాహం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. అన్ని రంగాల్లోని కొత్త ఉద్యోగులకు ప్రభుత్వం వేతనాల్లో 12 శాతం ఇపిఎఫ్‌కు కంట్రిబ్యూషన్ అందిస్తోందని, ఇది ఇప్పుడు వస్త్ర రంగానికి దోహదపడనుందని అన్నారు. దీంతో పాటు నిర్ణీత కాల ఉపాధి కూడా అన్ని రంగాలకు విస్తరించనుందని, టియుఎఫ్ పథకం కింద 2017- 18లో రూ.2,013 కోట్లు కేటాయించగా, 2018-19లో దీన్ని రూ.2300 కోట్లకు పెంచారని, దీన్ని ఆశావహ చర్యగా అభివర్ణించవచ్చని అన్నారు.

తెలుగు రాష్ట్రాలకు నిరాశే..!

న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌పై తెలంగాణ పెట్టుకున్న ఆశలూ నెరవేరలేదు. ప్రాణహిత చేవెళ్లను జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, బయ్యారం ఉక్కు కర్మాగారం, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎయిమ్స్ హామీలు ఆచరణకు నోచుకుంటాయన్న ఆశలు ఫలించలేదు. ఇక మిషన్ భగీరథ, మిషన్ కాకతీయకు నిధుల కేటాయింపుపైనా చాలా కాలంగా తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్నికోరుతూ వస్తున్నా బడ్జెట్‌లో ఆ దిశగా ఎలాంటి చర్యలూ లేకపోవడంతో నిరాశ ఎదురైంది. మరోవైపు విభజన హామీలు, రాజధానికి నిధుల వంటి అంశాలపై మాటమాత్రంగానైనా ప్రస్తావించకపోవడం ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అసంతృప్తి మిగిల్చింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు చిట్టచివరి పూర్తిస్థాయి బడ్జెట్ కావడంతో విభజన సమస్యలకు పరిష్కారంగా కేంద్రం ఈ బడ్జెట్‌లో చొరవ చూపుతుందన్న అంచనాలు గల్లంతయ్యాయి. ఏపీ విషయానికి వస్తే రాజధాని నిర్మాణానికి నిధులు, ఆర్థిక సంఘం నిధులు, ద్రవ్యలోటును భర్తీ చేసేందుకు సాయం, పారిశ్రామిక ప్రోత్సహకాలు, రైల్వేజోన్ ప్రకటన.. ఇలా పలు హామీలపై బడ్జెట్ సాయాన్ని ఆశించగా వాటి ఊసే లేకపోవడం గమనార్హం. విభజన హామీలకు బడ్జెట్‌లో మోక్షం లభిస్తుందన్న ఆశలకూ గండిపడింది. పోలవరం ప్రాజెక్టు స్థితిగతులు.. నిర్మాణానికి నిధుల ఊతంపై బడ్జెట్‌లో భరోసా కల్పిస్తారన్న అంచనాలనూ కేంద్రం విస్మరించింది.

చదువులకు 85 వేల కోట్లు



ఎస్‌టిలకు ఏకలవ్య పాఠశాలలు

న్యూఢిల్లీ : కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విద్యా రంగానికి అనుకూలంగా పలు చర్యలు తీసుకున్నారు. ఈసారి బడ్జెట్‌లో రూ.85,010 కోట్లు కేటాయించారు. ఇందులో ఉన్నత విద్యకు రూ.35,010 కోట్లు, పాఠశాల విద్యకు రూ.50వేల కోట్లు కేటాయించారు. దేశ వ్యాప్తంగా వెయ్యి మంది ప్రతిభ గల బిటెక్ విద్యార్థులకు ఫెలోషిప్‌లు అందజేయనున్నారు. వచ్చే నాలుగేళ్లలో దేశ వ్యాప్తంగా ప్రస్తుత విద్యా వ్యవస్థ మౌలిక వసతులు, సాంకేతికతను మెరుగుపర్చేందుకు లక్ష కోట్లను కేటాయించారు. దేశంలో కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులు ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ వెల్లడించారు. గురువారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రసంగంలో ఈ మేరకు ప్రకటించారు. 2022 నాటికి 'రైజ్'ను తిరిగి ప్రారంభించనున్నట్లు, మౌలిక వసతులను, వ్యవస్థను మరింత మెరుగుపర్చనున్నట్లు ఆయన వెల్లడించారు. గిరిజన విద్యార్థుల కోసం మరిన్ని పాఠశాలలను పెంచడంతో పాటు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టిని సారిస్తుందని చెప్పారు. 50 శాతానికి మించి ఎస్‌టి జనాభా ఉన్న ప్రాంతాల్లోనూ, కనీసం 20వేల మంది గిరిజనులు ఉన్న చోట నవోదయ విద్యాలయాలతో సమానంగా 'ఏకలవ్య' పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. విద్యారంగంలో ప్రమాణాలను పెంపుదలకు టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతుందని, అందువల్లనే విద్యా వ్యవస్థలో టెక్నాలజీకి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్ రూపకల్పనలో వ్యవసాయం, విద్య, ఆరోగ్య పరిరక్షణ ప్రయోజనాలను మరింత మెరుగుపర్చేలా, మౌలిక వసతులను మరింత బలపర్చేలా ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపారు. ఐఐటి, ఎన్ఐటిల కింద రెండు పూర్తిస్థాయి ప్లానింగ్, ఆర్చిటెక్చర్ స్కూల్స్‌ను, 18 ప్లానింగ్, ఆర్చిటెక్చర్ స్కూల్స్‌ను అటానమస్ హోదాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్థిక సంస్కరణలు అమలవుతున్న నేపథ్యంలో నిజాయితీ, పారదర్శకతను చాటేలా కేంద్ర ప్రభుత్వం ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని జైట్లీ వివరించారు. 2.5 ట్రిలియన్ డాలర్ల భారత ఆర్థిక వ్యవస్థ 8 శాతం ప్రగతిని సాధించబోతోందని, 2018-19 ఆర్థిక సంవత్సరం ద్వితీయ భాగంలో 7.2-7.5 శాతం ప్రగతిని సాధించిందని చెప్పారు.

ఫ్యాన్సీ పథకాలనే తెచ్చారు



గత నాలుగు సంవత్సరాలుగా ఉత్తుత్తి శుష్క వాగ్దానాలే చేస్తూ గడిపేశారు. చేసిందంటూ ఏమీ లేదు. ఇక వారు తమ హామీలు నెరవేర్చడానికి మిగిలింది కేవలం ఒకే ఒక సంవత్సరం. ఇప్పటికీ పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని రైతులకు బిజెపి ఉత్తుత్తి వాగ్దానాలే చేస్తోంది. దేశ యువతకు ఉద్యోగాలు కల్పించలేని ఫ్యాన్సీ పథకాలనే ప్రభుత్వం తెచ్చింది.

— రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షులు.

ఉద్యోగాల సృష్టి ప్రహసనం

కేంద్ర ప్రభుత్వం తన ఆర్థిక సర్వే ద్వారా వ్యవసాయం, విద్య, ఉపాధి రంగాల్లో ఏదో ఒరగబెడుతుందన్న ఆశలు మొదట రేకెత్తించింది. కానీ ఈ రంగాల్లో నిరాశకు గురైన వారి సమస్యలను తగ్గించే ప్రయత్నమేది బడ్జెట్‌లో చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో 7లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టిస్తామని చేసిన వాగ్దానం కేవలం ఓ ప్రహసనమనే చెప్పాలి. చదువుకున్న నిరుద్యోగుల కష్టాలు తీర్చే చర్యలేమి చేపట్టలేదు. ఇక వ్యవసాయ రంగంలో మౌలికవసతులకు నిధులు ఇవ్వడం ద్వారా సంక్షోభంలో కూరుకున్న రైతులకు ఒరిగిందంటూ ఏమి ఉండబోదు. వారి పంటలకు సమంజసమైన ధర లభించక కష్టాలు పడుతూనే ఉన్నారు.



మరోపక్క ఉత్పాదకాల ధరలు పెరిగిపోతున్నాయి. విద్యార్థుల ఉపకారవేతనాలు, ఉన్నత విద్యాసంస్థల్లో సీట్లను పద్ధతి ప్రకారం తగ్గించేశారు. ప్రాథమిక విద్యాసంస్థల్లో కూడా నమోదు గత మూడేళ్లలో తగ్గుతూ వస్తోంది. రైల్వే సహా వివిధ రంగాలకు ఆర్థిక మంత్రి చేసిన ప్రతిపాదనలు సామాన్యుడిపై భారాన్ని పెంచేదిగా ఉన్నాయి. అన్ని వస్తువుల ధరలు పెరగడం కొనసాగుతూనే ఉంది. ఇక సామాన్యుడికి 'అచ్చేదిన్' ఎక్కడా?


— సురవరం సుధాకర్ రెడ్డి, సిపిఐ ప్రధానకార్యదర్శి

తప్పదారి పట్టించే హామీలు



కేంద్ర బడ్జెట్ పేదలకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ చేసిన 'అచ్చేదిన్' వాగ్దానం ఏమైంది? ప్రధాని తప్పుదారి పట్టించే ప్రసంగాలు, హామీలే చేస్తున్నారు. పేదలు, శ్రామికులు కష్టాలపాలవుతున్నారు. నిరుద్యోగం పెరుగుతోంది. ధనికులు, పేదల మధ్య అగాధం పెరిగిపోతోంది.

— మాయావతి, బిఎస్‌పి చీఫ్



"ఉన్నతాశయంతో ఉద్యమిస్తే.... అపజయం కూడా దిగ్విజయం అవుతుంది.
– నేతాజీ"

ఆశల పల్లకి బడ్జెట్

సంపాదకీయం

ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ గురువారం పార్లమెంటుకు సమర్పించిన 2018–19 సంవత్సర బడ్జెట్ వ్యవసాయం, గ్రామీణ భారత్, వైద్యం, విద్య, మౌలిక వసతుల కల్పనపై కేంద్రీకరించింది. ఇది సార్వత్రిక ఎన్నికలకు ముందు చివరి పూర్తిస్థాయి బడ్జెట్ గనుక ఎన్నికల లబ్ధి దృష్టితోనే బడ్జెట్ రూపకల్పన జరిగింది. పెద్దపెద్ద సంఖ్యలతో గ్రామీణ ప్రజల్లో భ్రమలు కల్పించటం ప్రధానోద్దేశంగా కనిపిస్తున్నది. బడ్జెట్ ప్రతిపాదనలు సంబంధిత ప్రజలకు చేకూర్చగల మేలుకన్నా పాలకపార్టీ ఎన్నికల ప్రచారానికి ఉపకరించేవిగా ఉన్నాయి. గత బడ్జెట్లలో ప్రకటనలకు–ఆచరణకు మధ్య అగాథాన్ని గమనించినపుడు, ఈ తాజా ప్రతిపాదనలు చాలా మేరకు ఊహాలోక విహారం అనక తప్పదు. బడ్జెట్ దిశలో ఎట్టి మార్పు లేదు. కార్పొరేట్లు పొందుతున్న రాయితీలు, ప్రయోజనాల్లో ఏ ఒక్కటీ కోత పెట్టలేదు. ప్రభుత్వ ఆదాయ అంచనా నెరవేరే సూచన లేనందున ద్రవ్యలోటు పరిమితిని పెంచుకున్నారు. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. వ్యక్తిగత ఆదాయపుపన్ను కనీస పరిమితిని పెంచుతారనుకున్న మధ్యతరగతి ఉద్యోగుల ఆశలను అడియాస చేశారు.

వ్యవసాయానికి సంబంధించి, వచ్చే ఖరీఫ్ పంటలకు(వరి, మొక్కజొన్న, సోయా చిక్కుడు, పప్పుధాన్యాలు) ఉత్పత్తి వ్యయంకన్నా 50శాతం అదనంగా కనీస మద్దతు ధర నిర్ణయించటం, వ్యవసాయ రుణాల లక్ష్యాన్ని రూ.11లక్షల కోట్లకు పెంచటం, భూమిపై యజమాని హక్కుకు భంగం రాకుండా కౌలు రైతులకు సంస్థాగత రుణం ఇచ్చే ఏర్పాటు చేయటం ప్రధానమైన ప్రకటనలు. ధరలు పడిపోయినప్పుడు సైతం రైతుకు మద్దతు ధర లభించేటట్లు చేయటానికి నీతి ఆయోగ్ రాష్ట్రాలతో చర్చించి ఒక యంత్రాంగం ఏర్పాటు చేస్తుందని మంత్రి చెప్పారు. ఉత్పత్తి వ్యయం కన్నా 50శాతం అదనపు ధర నిర్ణయించటంలో ఉత్పత్తి వ్యయం అంచనాకు స్వామినాథన్ కమిషన్ సిఫారసు ప్రాతిపదిక అవునో కాదో చెప్పలేదు. కుటుంబసభ్యుల శ్రమ విలువను కూడా కలపాలన్నది ఆ కమిషన్ ముఖ్యమైన సిఫారసు. వ్యవసాయానికి సంస్థాగత రుణం సంఖ్య భారీగా కనిపిస్తున్నా అది ఈ సంవత్సరం కన్నా రూ.1లక్ష కోట్లు మాత్రమే ఎక్కువ. కౌలు రైతులకు సంస్థాగత రుణం విషయంలో ఎపి, తెలంగాణ పనితీరును పరిశీలిస్తే బహుతక్కువ శాతానికే అది అందుతుంది. మార్కెట్లో వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోయినపుడు కేంద్ర ఏజన్సీలు మార్కెట్‌లో ప్రవేశించి మద్దతు ధరకు కొనుగోలు చేయటం నామమాత్రంగా మారిన పరిస్థితిలో, నీతి ఆయోగ్ ప్రయత్నంపై ఆశలు నిష్ప్రయోజనం. రైతాంగాన్ని నేటి ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించే మార్గాల్లో ప్రధానమైన 'రైతు రుణమాఫీ' డిమాండ్‌ను మోడీ ప్రభుత్వం పట్టించుకోలేదు.

10 కోట్ల పేద కుటుంబాలకు ఏడాదిలో ప్రతి కుటుంబానికి రు.5లక్షల మేరకు ఉచిత ఆరోగ్య రక్షణ కల్పిస్తూ జైట్లీ ప్రకటించిన 'జాతీయ ఆరోగ్య రక్షణ పథకం' ఆహ్వానించదగ్గ అతిపెద్ద పథకం. దాదాపు 50కోట్లమంది లబ్ధిపొందుతారని, ప్రపంచంలోనే ఇది అతిపెద్ద ప్రభుత్వ ఆరోగ్య పథకమని, సార్వజనీన ఆరోగ్య సంరక్షణ దిశగా ఇది పెద్ద ముందడుగు అని ఆర్థికమంత్రి ఘనంగా ప్రకటించారు. దీన్ని పేదలకు కార్పొరేట్ వైద్యం సమకూర్చటంగా బిజెపి ప్రతినిధులు వ్యాఖ్యానిస్తున్నారు. జాతీయ ఆరోగ్య విధానం కింద కేటాయింపు రూ.1200కోట్లు. ఆరోగ్య, శుశ్రూష(వెల్‌నెస్)సెంటర్లు ప్రాతిపదిక. కార్పొరేట్ వైద్యం అందించగలిగితే సంతోషం. అయితే అది వైద్య పరీక్షలకు చెల్లించుకోవాల్సిన డబ్బు పేదలకు మహా భారం, భీమా కంపెనీలకు, కార్పొరేట్ ఆసుపత్రులకు వరప్రసాదం. గ్రామీణ పేదల్లో ఎందరు అన్ని అంతరాలను దాటుకుని నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు రాగలరు. జిల్లా ఆసుపత్రికి చేరుకుంటేనే గొప్ప. అందువల్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అభివృద్ధి చేయటం, జిల్లా ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యవసతులు కల్పించటం ఎక్కువ మేలు చేస్తుంది. కాని ప్రైవేటీకరణ బాటపట్టిన ప్రభుత్వాలకు ఆ శ్రద్ధ లేదు.

ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రతకు కేటాయించిన బడ్జెట్ ఈ సంవత్సరంతో పోల్చితే రూ.1.22లక్షకోట్ల నుంచి రూ.1.38కోట్లకు మాత్రమే పెంచటం గమనార్హం. అందువల్ల ప్రభుత్వ ప్రకటనలకు, కేటాయింపులకు, ఆచరణకు పెద్ద వ్యత్యాసం ఉంది. ప్రపంచ ఆర్థిక ఫోరం నివేదిక చెప్పినట్లు దేశ సంపదలో 73శాతం 1శాతం మంది చేతిలోకి వెళ్లటాన్ని తిరోముఖం పట్టించే విధానాలు లేని ఏ బడ్జెట్ అయినా కన్నీటి తుడుపే.

బాబ్రీ 'తీర్పు': కాంగ్రెస్ వ్యూహం

చూపు

భారత ప్రధాన న్యాయమూర్తి అభిశంసన ప్రమాదాన్ని ఎదుర్కోవడం వల్ల పరిస్థితులు తనకు అనుకూలంగా తిరుగుతాయని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. గత నెల నలుగురు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయమూర్తులు విలేకరుల గోష్టిని ఏర్పాటు చేసి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. కీలకమైన కేసులను ఆయన ఎంపిక చేసిన కొన్ని బెంచ్‌లకే కేటాయిస్తున్నారని వారు ఆరోపించారు. వెంటనే సోహ్రాబుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో న్యాయమూర్తి బ్రిజ్ గోపాల్ హరికిషన్ లోయా మృతిపై స్వతంత్ర ప్రత్యేక బృందం చేత దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పది రోజుల తర్వాత తన పార్టీ ఇతర ప్రతిపక్షాలతో కలిసి ప్రధాన న్యాయమూర్తిపై అభిశంసన తీర్మానాన్ని ప్రతిపాదించే అంశం చర్చిస్తున్నట్టు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విలేకరులకు తెలిపారు. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలు ఇంకా పరిష్కారం కానందున పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే ఈ అభిశంసన ప్రక్రియ సాగనున్నట్లు కూడా తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మరి కొద్ది రోజులకు పార్టీ అగ్రశ్రేణి న్యాయ నిపుణులను రంగంలోకి దించింది. వారి చేత జస్టిస్ లోయా మృతిపై స్వతంత్ర ప్రత్యేక బృందం దర్యాప్తుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ను మళ్లీ తెర మీదికి తెచ్చింది. విజిల్ బ్లోయర్లు, సామాజిక కార్యకర్తలు అందించిన సమాచారం ప్రకారం సోహ్రాబుద్దీన ఎన్ కౌంటర్ మృతి కేసులో ఒక కీలక నిందితునికి అనుకూలంగా తీర్పు చెప్పాలని జస్టిస్ లోయాపై ఒత్తిడి వచ్చినట్లు తెలిసింది.

కపిల్ సహచరులు సల్మాన్ ఖుర్షీద్, పార్టీ న్యాయ విభాగం సారథి వివేక్ తన్‌ఖా వెంట ఉండగా సిబాల్ ఈ విషయం ఆరోపించారు. ఒక ముసాయిదా ఉత్తర్వును చూపించి దానిపై సంతకం పెట్టాలని ఒత్తిడి కూడా చేసినట్లు ఆయన వివరించారు. 2014 అక్టోబర్‌లో ఇది జరిగింది. న్యాయమూర్తి లోయా మరణానికి సంబంధించి ఇంత క్రిందటి పోస్టుమార్టమ్ నివేదికలో, ఇతర ఆసుపత్రి పత్రాల్లో తేడాపాడాలను ఆయన ఉదహరించారు. ఈ స్వతంత్ర దర్యాప్తు బృందానికి కేసును అప్పగిస్తేనే ఈ అంతుబట్టనివిషయాలు విడిపోగలవని ఆయన అన్నారు. ఆ బృందంలో కేంద్ర దర్యాప్తు బ్యూరో (సిబిఐ)కు చెందిన అధికారులు ఎవరూ ఉండరాదని కూడా షరతు పెట్టారు. అలాగే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఎ) అధికార్లు కూడా ఉండకూడదన్నారు. జస్టిస్ లోయా మృతి కేసును ప్రస్తుతం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా సారథ్యంలోని సుప్రీంకోర్టు బెంచ్ విచారిస్తోంది.

సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్‌కౌంటర్ కేసు జస్టిస్ లోయా విచారిస్తుండగా మరణించారు. భారతీయ జనతా పార్టీ (బిజెపి) జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ఆ కేసు నిందితులలో ఒకరు. ఈ కేసులో ప్రధాన న్యాయమూర్తి పై ఒత్తిడి తీసుకురావడమే ప్రతిపక్షాల ధ్యేయమని గత కొన్ని వారాలుగా ఏర్పడిన పరిణామాలు సూచిస్తున్నాయి. సిపిఐ (ఎం) జస్టిస్ దీపక్ మిశ్రా అభిశంసనకు ప్రతిపాదించింది. మరోపక్క కాంగ్రెస్ పార్టీ ఆయనపై వ్యతిరేకతను ముమ్మరం చేయదలచింది. పద్ధతి ప్రకారం ఈ వైఖరిని అనుసరిస్తున్నారు. రానున్న రోజుల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా అ కేసులో మరింత సమాచారాన్ని వెబ్‌సైట్‌లలో పెడతామని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. లోయా కేసులో ప్రతిపక్షానికి నిర్దిష్టమైన ప్రయోజనం ఉంది. రాజకీయంగా ఇతర కీలకమైన కేసులలో ప్రధాన న్యాయమూర్తి విచారణ జరుపుతున్నారని కాంగ్రెస్‌కు తెలుసు. ఆ కేసులలో రామజన్మ భూమి – బాబ్రీ మసీద్ కేసు కూడా ఉంది. ఈ నెల 8న ఈ కేసులో తుది విచారణ మొదలు కానుంది. న్యాయ వ్యవహారాలపై పార్టీ వ్యూహాన్ని రూపొందించే కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రైవేటు చర్చల్లో జస్టిస్ లోయా, ఆధార్ కేసుల ప్రాముఖ్యతను అంగీకరించారు. అయితే వారి దృష్టి ప్రధానంగా బాబ్రీ మసీద్ వివాదం కేసుపైనే ఉందని అర్థమవులోంది. ఈ అక్టోబర్‌లో రిటైర్ కానున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మిశ్రా పదవి నుంచి దిగిపోయే ముందే ఈ అత్యంత కీలక కేసులో తీర్పు వెల్లడించాలని ఉత్సాహంగా ఉన్నారు. అయోధ్య వివాదాస్పద ప్రదేశంలో రామ మందిరం నిర్మాణానికి మార్గాన్ని సుగమం చేసే విధంగానే జస్టిస్ మిశ్రా సారథ్యంలోని బెంచ్ తీర్పు ఇస్తుందని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు ఒక నిశ్చయానికి వచ్చాయి. మందిర నిర్మాణానికి అనుకూలంగా తీర్పు వస్తే భావోద్వేగాలతో కూడిన రామ మందిర అంశాన్ని మోడీ ప్రభుత్వంపై పెరుగుతున్న అసమ్మతి నేపథ్యంలో బిజెపి తనకు అనుకూలంగా మలుచుకొంటుంది. అటువంటి పరిస్థితిలో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో 2018 లో జరగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ముందుగానే రాజకీయ సెగ తగులుతుంది. ఆ రాష్ట్రాల్లో ప్రస్తుతం కాంగ్రెస్ పరిస్థితి బిజెపిపై మెరుగ్గానే ఉన్నప్పటికీ, రామజన్మ భూమి వివాదంపై రామాలయ నిర్మాణానికి అనుకూలంగా తీర్పు వెలువడితే దాని పరిస్థితి కుడితిలో పడ్డ ఎలకవుతుంది.

ఈ నేపథ్యంలో మరింత స్వతంత్రంగా వ్యవహరించాల్సిందిగా ప్రధాన న్యాయమూర్తిని ఒత్తిడి చేయదలచామని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఒకరు చెప్పారు. జస్టిస్‌మిశ్రా నిష్పాక్షికంగా ఈ కేసులో తీర్పు చెప్పే పరిస్థితి ఉంటే మేము మా ఒత్తిడి నుంచి వెనక్కిమళ్లుతామని కూడా ఆ నాయకుడు చెప్పాడు. ప్రధాన న్యాయమూర్తిపై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికి ఈ వాదననే ముందుకు తెస్తున్నారు. కాంగ్రెస్ న్యాయ నిపుణులు పార్టీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి ఈ విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని హెచ్చరిక చేస్తున్నారు. అభిశంసన తీర్మానాన్ని సమర్థిస్తే ఆ వాదనని గెలిపించుకునే బలగం పార్టీకి లేదని గుర్తు చేస్తున్నారు. పైగా అభిశంసనపై పట్టుబడితే జస్టిస్ మిశ్రా బాబ్రీ మసీదు కేసులో నిష్పాక్షిక ధోరణిలో కాకుండా తోచిన విధంగా తీర్పు చెప్పే ప్రమాదం ఉందని కూడా వారు రాహుల్‌కు చెబుతున్నారు. కపిల్ సిబాల్ విలేకరుల గోష్టిలో ఒక కీలక ప్రశ్నకు స్పష్టమైన జవాబు ఇవ్వకుండా దాటవేశారు. వామపక్షాల ప్రతిపాదనకు మీరు అనుకూలురా అన్న ప్రశ్నను ఆయన దాటవేశారు. ఎందుకంటే సిపిఐ(ఎం) పార్టీ కాంగ్రెస్‌తో ఈ విషయం చర్చించినా, ఆ పార్టీ మరి కొన్ని ఇతర పార్టీలను సంప్రదిస్తోంది. అందుచేత అభిశంసన తీర్మానంపై కాంగ్రెస్ స్పష్టమైన వైఖరిని ఇంకా ఎంచుకోలేదని స్పష్టమవుతోంది.



తాము రామ జన్మభూమి కేసులో జస్టిస్ మిశ్రాపై ఒత్తిడి తేలేము గాని, జస్టిస్ లోయా మృతి కేసులో తేగలమని కాంగ్రెస్ నాయకులు చెప్పారు. లోయా కేసులో జస్టిస్ మిశ్రాకు అసౌకర్యం కల్పించడం ద్వారా, రామజన్మభూమి విషయంలో ఆయన నెమ్మదిగా కదిలేలా చేయగలమని కాంగ్రెస్ వారి ధీమా. అయితే ఇంతవరకూ రామజన్మ భూమి కేసులో జస్టిస్ మిశ్రా తగిన వేగంతోనే కదులుతున్నారు తప్ప మందకొడిగా కాదు. గత డిసెంబర్‌లో ఈ కేసుపై విచారణ సాగినప్పుడు ఘాటుగా ప్రకటనల యుద్ధం చోటు చేసుకుంది. 2010 నుంచి ఈ కేసు విచారణలో ఉన్నందున త్వరగా ముగించేయాలని హిందూ సంస్థల తరఫున వాదిస్తున్న న్యాయమూర్తులు పట్టుబడుతున్నారు.

✻ అనిత కత్యాల్

కర్ణిసేనకు ప్రేక్షకుల జవాబు



బి.నర్సన్
9440128169

పద్మావత్ సినిమానే కావచ్చు. గొడవ కర్ణిసేన బన్సాలీల మధ్యనే జరగవచ్చు. పైపైకి ఇలా కనిపిస్తున్న ఈ సమస్యను మత ఛాందస భావాలుగల ప్రభుత్వ పెద్దలకు దేశంలోని ప్రజాస్వామ్యవాదులకు మధ్య జరిగిన పోరుగానే భావించాలి. సినిమాలో ప్రతి నాయకుడి రాజ్య కాంక్ష తీరవచ్చు. బయట మాత్రం సినిమా నిర్మాణాన్ని, విడుదలను అడ్డుకున్న వర్గం ఓడిపోయింది. 25 జనవరిన విడుదలైన పద్మావత్‌ను ప్రేక్షకులు ఆదరించిన తీరుకు అన్ని వ్యతిరేక వర్గాల నోళ్లు మూతబడ్డాయి. వ్యతిరేక ఆందోళన తోక ముడిచింది. ఇది సనాతన వాదులపై రాజ్యాంగ ప్రేమికుల విజయం. గొంతుకను తొక్కేయాలనుకుంటున్న వారిపై భావ ప్రకటన స్వేచ్ఛ దిగ్విజయం.

ఇన్ని ప్రతికూల పరిస్థితుల మధ్య పద్మావత్ విడుదల కావడం ఈ పాలనలో ఎదురీతగానే భావించాలి. వ్యతిరేక ఆందోళనకు మూగభాషతో వత్తాసు పలికిన ప్రభుత్వానికి చెంపదెబ్బలా ఫిలిం సెన్సార్ బోర్డు ఎయు సర్టిఫికేటు ఇచ్చి ప్రదర్శనకు అనుమతినిచ్చింది. సుప్రీంకోర్టు కూడా సినిమా విడుదల, నిరాకరణలు సెన్సార్ బోర్డు పరిధిలో ఉంటాయని వెళ్ళగొట్టింది. ఈ రెండు వ్యవస్థలలో ఏది ప్రభుత్వాలకు లొంగిపోయినా చిత్రం విడుదల మరింత ఇబ్బందుల పాలయ్యేది. ఇలా సినిమాకు న్యాయం చేసి ఇవి తమ గౌరవాన్ని నిలబెట్టుకున్నాయి.

మోడీ పాలనలో హిందూ మత ఛాందసుల ఆగడా లు మితిమీరి పోయాయనడానికి ఎన్నో ఉదాహరణలున్నాయి. అజ్ఞానులు వ్యక్తులుగా, ముఠాలుగా ఏర్పడి దేశంలోని చట్టాన్ని, రాజ్యాంగాన్ని బేఖాతరు చేస్తున్నా ప్రభుత్వం పన్నెత్తి మాటన్లేదు. పైగా రేసుకుక్కలను ఉసిగొల్పుతూ పైకి శాంతి ప్రవచనాలు వల్లిస్తోంది. తెరచాటు ఆమోదాలతో జరుగుతున్న ఈ అకృత్యాల్లో ప్రజాస్వామ్యం బలవుతోంది.

ఇలాంటి దుస్సంఘటనలతో పెచ్చరిల్లుతున్న వాటి లో శ్రీ రాజస్థాన్ రాజ్‌పుత్ కర్ణిసేన ఒకటి. లోకేంద్ర సింగ్ కల్వి నేతగా 2005లో పుట్టిన ఈ సేన తొలుత రాజపుత్రుల హక్కుగా చదువు, ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కొరకు ఆందోళన చేపట్టింది. క్రమంగా రూటు మార్చి రాజపుత్రుల ఆత్మగౌరవం పేరిట రాజకీయ ప్రయోజనం పొందే బాటపట్టింది. కర్ణిసేన ఇదివరలో జోధా అక్బర్‌ను కూడా అడ్డుకుంది. 2008లో విడుదలైన ఈ సినిమాలో రాజపుత్రులను అగౌరవ పరచే దృశ్యాలున్నాయని ఆందోళన చేసింది. ఆ తర్వాత 2010లో వీర్ అనే సినిమా కూడా ఈ సేనతో ఇబ్బందులపాలైంది.

ప్రముఖ హిందీ సినిమా దర్శకుడు అయిన సంజయ్ లీలా బన్సాలీ ఇప్పటికే హమ్ దిల్ దే చుకే సనం, దేవదాస్, రామ్ లీలా, బాజీరావ్ మస్తానీ లాంటి భారీ బడ్జెట్ సినిమాలు తీసి భారతీయ సినిమా రంగంలో ప్రముఖుడిగా గుర్తింపు పొందాడు. చారిత్రక సినిమాలపై మక్కువగల బన్సాలీ 1540లో మలిక్ మహ్మద్ జాయిసీ రాసిన పద్యకావ్యం పద్మావత్‌ను సినిమాగా రూపొందించాలని సంకల్పించాడు. తమ రాణీపద్మినిపై సినిమా నిర్మాణాన్ని మొదటినుంచి వ్యతిరేకిస్తున్న కర్ణిసేన ఈ సినిమాను నిర్మాణ దశనుంచే అడ్డుకుంది. జైపూర్‌లోని జైఘడ్ కోటలో షూటింగ్ జరుగుతుండగా బన్సాలీపై దాడికి పాల్పడింది. ఆ తర్వాత షూటింగ్ మహారాష్ట్రకు మారింది. అప్పుడు కూడా మహారాష్ట్రలోని చారిత్రక పట్టణమైన కొల్హాపూర్‌లో మార్చి 2017లో ఆందోళనకారులు దాడిచేసి సినిమా సెట్లను, నటీనటుల దుస్తులను, ఆభరణాలను దగ్ధం చేశారు. పోలీసు రక్షణ కూడా నిష్ప్రయోజనమైంది.

రాజపుత్రుల ఆత్మగౌరవాన్ని కించపరచే విధంగా రాణి పద్మిని, అల్లావుద్దీన్ ఖిల్జీల మధ్య స్వప్న సన్నివేశం ఉందని కర్ణిసేన అభియోగం. సినిమాలో పద్మిని పాత్ర పోషించిన దీపికా పదుకొనె ముక్కు కోస్తామని బెదిరించారు. బన్సాలీ తల తెచ్చిన వారికి పదికోట్ల బహుమతిని ప్రకటించారు.

సినిమా విడుదల ఆపమని ముంబయి సెన్సార్ ఆఫీసు ముందు గొడవ చేశారు. నిర్మాతల వైపు కోర్టు లో వాదించిన అడ్వకేట్ హరీష్ సాల్వేకు కూడా బెదిరింపులు వెళ్లాయి. సెన్సార్ సర్టిఫికేట్ వచ్చినాక కర్ణిసేన నాయకులను సినిమా చూడడానికి బన్సాలీ ఆహ్వానించాడు. అయితే సెన్సార్ వచ్చినాక చూపించడం రిలీజ్‌కు మార్గం సుగమం చేసుకోవడమే అని వారు ఆయన ఆహ్వానాన్ని తిరస్కరించారు.

1, డిసెంబర్ 2017న విడుదల కావలసిన పద్మావత్ జనవరి 25న రిలీజైంది. ప్రపంచ వ్యాప్తంగా 4000 వెండి తెరలపై ప్రదర్శింపబడుతోంది.

250కోట్ల పెట్టుబడితో నిర్మించిన పద్మావత్ ఆరు రోజుల్లో 260 కోట్లు వసూలు చేసింది. మన దేశంలో 140కోట్లు, విదేశీ సినిమా హాళ్ల ద్వారా 120కోట్లు కూడబెట్టింది. అయితే సిగ్గుపడవలసిన విషయమేమిటంటే స్వీయ నిర్ణయాలతో కొన్ని రాష్ట్రాలు ఈ చిత్రాన్ని విడుదల చేయకపోవడమే. దేశవ్యాప్త ప్రదర్శనకు సెన్సార్ సర్టిఫికేట్ ఉండగా రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య పేరిట బిజెపి పాలిత కొన్ని రాష్ట్రాలు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాయి.

గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ ఆ తర్వాత ఈ వరుసలో చేరిన బీహార్ పద్మావత్ ప్రదర్శనకు నిరాకరించాయి.

బ్రిటన్ ప్రభుత్వం సెన్సార్ సర్టిఫికేట్ ముందే ఇచ్చి మన దేశంలో విడుదలైనాక విడుదల చేయమని కోరింది.

ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా సన్నివేశాలున్నాయని మలేషియా ప్రభుత్వం ప్రదర్శనకు అనుమతినీయలేదు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో పద్మావత్ విడుదలకోసం నిర్మాతలు 2018, జనవరి 17న రాష్ట్రాల చర్య కోర్టు ధిక్కార చర్యగా ఆరోపిస్తూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

చివరకు సినిమాలో ఎలాంటి అవాంఛనీయ దృశ్యాలు ఏవీ లేవని పైగా రాజపుత్రుల ఆత్మగౌరవం, ధైర్యసాహసాలకు పెద్ద పీట వేశారని బయటపడింది. అనవసరంగా ఇంత రాద్ధాంతం జరిగిందనే విషయం కేంద్రం, నిషేధించిన రాష్ట్రప్రభుత్వాలు గ్రహించాలి.

ఇప్పటికైనా సినిమా ప్రదర్శనను నిషేధించిన రాష్ట్రాలు తమ తప్పును సవరించుకొని, భేషజాలకు పోకుండా సినిమా విడుదలకు ఉపక్రమించాలి. వాస్తవానికి సినిమా హాళ్ల వద్ద రక్షణ కల్పించి సినిమాను విడుదల చేయించే సత్తా రాష్ట్ర ప్రభుత్వాలకుంది. అయితే వాటికి సినిమాపై సదుద్దేశం లేకపోవడం వల్ల శాంతి భద్రతల పేరిట ముఖం చాటేశాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న స్పందనను గుర్తించి ఆ సినిమా చూసే అవకాశం తమ రాష్ట్ర ప్రజలకు కల్పిస్తే తమ పాలనపై పడ్డ మచ్చ తొలగిపోవచ్చు.

దేశంలో ఛాందసవాదులకు, ప్రజాస్వామ్య ప్రియులకు గత నాలుగేళ్లుగా జరుగుతున్న సమరంలో పద్మావత్ విడుదల, ప్రజాదరణ గొప్ప విజయం. ప్రజలందరికీ తమ మాటే శిరోధార్యమని భావిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి ప్రభుత్వాలు, నేతలు ఇకనైనా దేశ ప్రజల మనోభావాలను గౌరవించాలి.

సినిమాలో ఏమున్నదో తెలియకుండానే సినిమా యూనిట్‌ని అష్టకష్టాలపాలు చేసిన కర్ణిసేనను రాజస్థాన్ ప్రభుత్వం కట్టడి చేయకుండా చోద్యం చూసింది. సేనను తొలి అడుగు స్థాయిలోనే ప్రభుత్వం నియంత్రించి సినిమా నిర్మాణానికి సహకరిస్తే గౌరవం దక్కేది.

ప్రభుత్వం అలసత్వం, దుష్టులకు అనుకూలత ఎందరినో మనోవేదనకు గురిచేసింది.చివరగా బిజెపి పరమత అసహనం మరోసారి నిరూపితమైంది. ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ కేవలం సినిమా వద్దే ఆగిపోకూడదు.



దేశంలో ఛాందసవాదులకు,ప్రజాస్వామ్య ప్రియులకు గత నాలుగేళ్లుగా జరుగుతున్న సమరంలో పద్మావత్ విడుదల, ప్రజాదరణ గొప్ప విజయం. ప్రజలందరికీ తమ మాటే శిరోధార్యమని భావిస్తున్న ప్రధాని నరేంద్రమోడీ, బిజెపి ప్రభుత్వాలు, నేతలు ఇకనైనా దేశ ప్రజల మనోభావాలను గౌరవించాలి. సినిమాలో ఏమున్నదో తెలియకుండానే సినిమా యూనిట్‌ని అష్టకష్టాలపాలు చేసిన కర్ణిసేనను రాజస్థాన్ ప్రభుత్వం కట్టడి చేయకుండా చోద్యం చూసింది. సేనను తొలి అడుగు స్థాయిలోనే ప్రభుత్వం నియంత్రించి సిని మా నిర్మాణానికి సహకరిస్తే గౌరవం దక్కేది. ప్రభుత్వం అలసత్వం, దుష్టులకు అనుకూలత ఎందరినో మనోవేదనకు గురిచేసింది.చివరగా బిజెపి పరమత అసహనం మరోసారి నిరూపితమైంది. ఈ ప్రజాస్వామ్య పరిరక్షణ కేవలం సినిమా వద్దే ఆగిపోకూడదు.

ఎడిటర్‌కు లేఖలు

మాతృభాషతోనే పరాయిభాషల నేర్పు సులువు

నిరుద్యోగ సమస్యకు కారకులయిన పాలకులే, దాన్ని ఇంగిలీషు భాష ద్వారా అధిగమించవచ్చునని విద్యార్థుల తల్లిదండ్రులను పక్కదారి పట్టిస్తున్నారు. మరో వైపు ఇంగిలీషును తమ విద్యా వ్యాపార సాధనంగా చేసుకున్న వారికి సమస్త సదుపాయాలూ కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నారు.

ఇంగిలీషు మాధ్యమంలో చదువుకున్న వారు కూడా ఉద్యోగాలు దొరకక అటు కన్న తల్లిదండ్రులకూ, ఇటు సమాజానికీ భారంగా మారుతున్నారన్న వాస్తవాన్ని చర్చనీయాంశం కాకుండా చూస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల చదువులను మరింత సృజనాత్మకంగా మెరుగు పరచవలసింది పోయి పాఠశాలల్నే కాక బోధనా పద్ధతులను, పరీక్షా విధానాలను కూడా కృతకంగా తయారు చేస్తున్నారు. ఇదంతా ఒక సాంస్కృతిక విధ్వంస ప్రక్రియలో భాగంగా సాగుతున్న ప్రపంచీకరణ మార్కెట్ శక్తుల ఆదేశాలకు లోబడిపోయిన పరాధీన రాజకీయాల పర్యవసానాలు . ఆ దొరికే కొద్దిపాటి మంచి అనుకునే ఉద్యోగాలకూ ఇంగిలీషు పరిజ్ఞానం అవసరమయినప్పుడు ఇంగిలీషు లాంటి పరాయి భాషలు ఇంగిలీషు ద్వారా నేర్పుతామనే తల్లక్రిందుల బోధనా మాధ్యమమే వేలంవెర్రిగా ఆకర్షిస్తున్నపుడు చివరకు అది కూడా సరిగా రాని బొట్లేరు ఇంగిలీషు చదువులు తప్ప మన పిల్లలకు మరేమి మిగులుతాయి? తెలుగులో చదువుకుంటే కడుపుకింత కూడు దొరకకుంటే ఎందుకు చదువుతారు? పాలకులు కూడా మాతృభాష ద్వారానే పరాయి భాషలు సులువుగా, బాగా వస్తాయనే ప్రపంచదేశాల అనుభవాన్ని విప్పి చెప్పటం లేదు.

ఇప్పుడు మనం పోరాడాల్సింది ఇంగిలీషుకు వ్యతిరేకంగా కాదు. ఇంగిలీషు బాగా నేర్చుకోవటమన్నది తెలుగులాంటి దేశీయ భాషలద్వారానే సులువు అనే విషయాన్ని ప్రజలకు, వారికంటే ముందు తెలుగు భాషాభిమానులమని భావించే వారికి తెలియ పరచటం తక్షణ కర్తవ్యం.

– దివికుమార్

కుష్ఠువ్యాధి నిర్మూలన సాధ్యమేనా?

1980వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం 2000 సంవత్సరం నాటికి కుష్ఠు వ్యాధిని నిర్మూలిస్తామని లక్ష్యాన్ని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగానే బహుళ ఔషధ చికిత్సను 1982వ సంవత్సరంలో ప్రవేశపెట్టడం జరిగింది. దీనివల్ల ప్రజలలో సాంక్రమికత వ్యాధులను తగ్గించడం, వ్యాధి కారకాలను, వాటి ప్రయాణ మార్గాలను పూర్తిగా నిర్మూలించడం మొదలగునవి చేశారు.

అయితే 1955లో ప్రారంభించబడిన కార్యక్రమం కేవలం కుష్ఠు నియంత్రణ కార్యక్రమం మాత్రమే. దీనిని 1983 సంవత్సరం నుండి భారత కేంద్రప్రభుత్వం ''ఈ కార్యక్రమాన్ని జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలనా పథకంగా మార్పు చేయడం జరిగింది నేషనల్ లెప్రసీ ఎరాడికేషన్ ప్రోగ్రామ్(ఎన్‌ఎల్‌ఇపి) అనేది భారీ స్థాయిలో ప్రారంభించబడిన కార్యక్రమమే. కాని దేశంలో నేటికీ, 1.2నుండి 1.3 వేల కేసులు నమోదవుతున్నాయి.

ఇంకా ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, పిల్లలలో కూడా ఎక్కువ స్థాయిలో ఈ వ్యాధి గుర్తించడం గమనార్హం. మన ప్రభుత్వాలు తక్షణమే కేవలం కుష్ఠువ్యాధి విషయంలోనే కాదు. గ్రామీణ భారతం ఆరోగ్య అంశాలలో చాలా నిర్దిష్టమైన ప్రణాళికలు వేసి వాటిని కేవలం పేపర్‌ల వరకే అంకితం చేయకుండా క్షేత్రస్థాయిలో అకుంఠిత దీక్ష దక్షతలను కలిగి యుండి, అవినీతికి తావు లేకుండా, ఖచ్చితమైన ఆచరణను చూపగలిగితేనే, ప్రజారోగ్యం కుదుటపడుతుంది.

– సూరం అనిల్

పదవ తరగతి పరీక్షా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండ ల కేంద్రానికి వివిధ గ్రామాల పాఠశాలల విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయడానికి వస్తుంటారు.

ఇప్పుడున్న పరీక్ష కేంద్రాలలో కొన్ని రకాల మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్)లో విశాలమైన తరగతి గదులు, పరీక్షా కేంద్రానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యాశాఖ ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని, యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేస్తే మండలంలోని వందల సంఖ్యలో వున్న పదవ తరగతి విద్యార్థుల సమస్య పరిష్కరించి నట్లవుతుంది.

– గుండమల్ల సతీష్‌కుమార్

పులకించిన వనం తన్మయత్వంలో జనం



సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి



మనతెలంగాణ/ మేడారం: మేడారం జాతరకు భక్తుల సంఖ్య గణనీయంగా పెరగనున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి అధికారులను ఆదేశించారు. దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డితో కలిసి ఆయన గురువారం ఉదయం ఐటిడిఎ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో ప్రధానంగా తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి దేవాలయ ప్రాంగణంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. జాతర పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. అనంతరం జాతర పరిసరాల్లో తాగునీటిని సరఫరా చేస్తున్న సంబంధిత డిప్యూటీ ఇంజనీర్లను తాగునీటి సరఫరా విషయంపై అడిగి తెలుసుకున్నారు. రెండురోజుల పాటు భక్తులు అధిక సంఖ్యలో రానున్న నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జంపన్నవాగు నుంచి దేవాలయ ప్రాంగణం వరకు ఎలాంటి వాహనాలను అనుమతించరాదని ఎస్‌పి భాస్కరన్‌కు సూచించారు. ఈ నెల 2న ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సిఎం కెసిఆర్, కేంద్ర గిరిజన శాఖ మంత్రి జ్యుయల్ ఓరమ్ జాతరకు రానున్న సందర్భంగా వారి పర్యటన ఏర్పాట్లలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎంపి అజ్మీరా సీతారాం నాయక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ కర్ణన్, సబ్ కలెక్టర్ విపి గౌతమ్, జాతర ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎస్‌పి భాస్కరన్, జాయింట్ కలెక్టర్ అమయ్‌కుమార్, ఐటిడిఎ పిఒ చక్రాధర్‌రావు, పలువురు ట్రేయిని కలెక్టర్లు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు. ఈ మహాజాతరకు సుమారుగా తెలంగాణ, ఎం.పి. మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున మన దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారని వివరించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 4,200 బస్సులను, 11,000 వేల ఆర్టీసీ సిబ్బందిని జాతరకు నియమించినట్టు తెలిపారు.నాలుగు వందల సి.సి కెమెరాలను ఏర్పాటు చేసి భద్రతా పరంగా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

మేడారంలో చత్తీస్‌గఢ్ సీఎం



మనతెలంగాణ/ మేడారం: మేడారం మహాజాతరకు వచ్చిన ఛత్తీస్‌ఘడ్ సీఎం రమణ్ సింగ్ గురువారం కేవలం సమ్మక్క,సారలమ్మ గద్దెలను దర్శించుకుని తిరిగి వెళ్లిపోయారు. ఛత్తీస్‌ఘడ్ నుంచి నేరుగా హెలికాప్టర్‌లో మేడారానికి చేరుకుని సిఎం రమణ్ సింగ్ నేషనల్ సెక్యూరిటీ సిబ్బంది(ఎన్‌ఎస్‌జీ) పర్యవేక్షణలో సీఎం స్థానిక అధికారులు, నాయకులను కలువకుండానే నేరుగా సమ్మక్క గద్దెలపైకి చేరుకుని తల్లిని దర్శించుకున్నారు. అనంతరం సారలమ్మలను దర్శించుకోకుండానే వెనుదిరిగి వచ్చేశారు. ఈ సందర్భంగా ఛత్తీస్‌ఘడ్ సీఎం రమణ్‌సింగ్‌ను తెలంగాణ ఉపముఖ్య మంత్రి కడియం శ్రీహరి, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి, మహబూబాద్ ఎంపీ ఆజ్మీరా సీతారాం నాయక్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందించి శాలువాలతో సన్మానించారు. అనంతరం తిరిగి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం చతీస్‌ఘడ్‌కు వెళ్లి పోయారు. ఈ విషయంపై ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి మాట్లాడుతూ ఎన్‌ఎస్‌జీ అధికారుల అవగాహన రాహిత్యంతో చిత్తీస్‌ఘడ్ సీఎం రమణ్‌సింగ్ సారలమ్మలను దర్శించుకోకుండా వెనుదిరిగారని తెలిపారు.

ఆందోళనకు దిగిన బీజేపీ నాయకులు

మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు వచ్చిన ఛత్తీస్‌ఘడ్ సీఎం రమణ్‌సింగ్‌ను కలిసేందుకు స్థానిక ప్రభుత్వం అనుమతించలేదని బీజేపీ నాయకులు గద్దెల ప్రాంగణంలో ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతు బిజెపి సిఎం రమణ్‌సింగ్‌ను తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధులు నిర్లక్ష్యం చేయడంతో సమ్మక్కను మాత్రమే దర్శించుకుని వెనుదిరిగారని ఆందోళనకు దిగారు. దీంతో పోలీసులకు, నాయకులకు కొద్దిసేపు వాగ్వాదం జరిగింది.

భక్త జన సాగరం మేడారం

● ఎటుచూసినా జనమే.. జనం ● భక్తులతో కిటకిటలాడిన రహదారులు
● 15 కిలోమీటర్ల వరకు జన గుడారాలు



మనతెలంగాణ/ మేడారం: మేడారం భక్త జన సాగరంగా మారింది. సమ్మక్క, సారలమ్మలు గద్దెలపై కొలువుదీరడంతో తల్లులను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా ఆర్‌టిసి, ప్రయివేటు వాహనాలు పోటిపడుతూ మేడారం చేరుకుంటున్నాయి. వరంగల్ నుంచి మేడారం వరకు, కరీంనగర్ నుంచి మేడారం వరకు, ఖమ్మం, భద్రా చలం నుంచి మేడారం వరకు రహదారులన్ని భక్తుల వాహనాలు బారులు తీరాయి. తల్లులను దర్శించుకునేందుకు వచ్చే భక్తులు బస్‌ల కోసం క్యూలైన్‌ల వద్ద పడిగాపులు గాస్తున్నారు. మేడారం కుగ్రామం మహానగరంగా మారిపోయింది. మేడారం నుంచి ఏటుచూసినా భక్త జనమే దర్శనమిస్తున్నారు. చుట్టూ 10 కిలోమీటర్ల మేర భక్తుల గుడారాలతో నిండిపోయాయి. బుధవారం పోటెత్తిన ప్రయివేటు వాహనాలతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నార్లాపూర్ వద్దనే పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించారు. నార్లాపూర్, చింతల్, కాల్వపల్లి క్రాస్ రోడ్డులోని పార్కింగ్ ప్రదేశాలు నిండిన తరువాత గురువారం ఉదయం కొత్తూరు మీదుగా ఊరట్టం పార్కింగ్ ప్రదేశాలకు, కొత్తూరు మీదుగా కన్నెపల్లి పార్కింగ్ ప్రదేశాలకు మళ్లించారు. ఎటుచూసినా భక్తులు ప్రవాహలా నడుచుకుంటూ తల్లిని దర్శించుకునేందుకు తరలివస్తున్నారు. గ్రామాలకు, గ్రామాలే జాతరకు తరలివచ్చారు. దారుల వెంట నడుస్తుంటే కాటకలువకుండా గుర్తుపట్టేందుకు వీలుగా భక్తులు జెండా కర్రలను పట్టుకొని ముందు నడుస్తుండగా వారిని తమ తోటివారు అనుకరిస్తూ తల్లుల దర్శనానికి తరలివెళ్లారు.

ఉప్పొంగిన భక్తి పారవశ్యం...



మనతెలంగాణ/మేడారం: భక్తికి, విశ్వాసాలకు ప్రతీక అయిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో భక్తి పారవశ్యం ఉప్పొంగింది. తల్లులను దర్శించుకునేందుకు భక్తులు భక్తిభావంతో తరలివస్తున్నారు. సమ్మక్క వంశీకులుగా చెప్పుకునే లక్ష్మి దేవరలు, గట్టమ్మలు, నాగులమ్మ తరలివస్తున్నారు. ఆదివాసి, గిరిజన సంప్రదాయాలతో డప్పు, డోలు వాయిద్యాలతో జాతరకు తరలివచ్చారు. తల్లులను దర్శించుకోవడానికి ముందు గా జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తూ జంపన్నా.. నాకొడుకా..సంపెంగ వాగుల్లో.. జంపన్నవాగుల్లో నా కొడుకా జంపన్న అంటూ శివసత్తులు శివాలు ఊగారు. సమ్మవ్వా నాతల్లి..సారవ్వా నాతల్లి అంటూ శివసత్తులు శివాలేత్తారు. జంపన్నవాగులో శివసత్తులు శివాలు ఊగుతుంటే సమస్యలతో సతమతమయ్యేవారు తల్లులతో తమ సమస్యలను చెప్పుకున్నారు. వారికి సమస్యల పరిష్కారానికి మార్గాలు చెబుతుండగా వారితోపాటు భక్తులు కూడా శివాలు ఊగారు. అక్కడి నుంచి శివాలు ఊగుతూనే తల్లులను దర్శించుకునేందుకు గద్దెలకు చేరుకున్నారు. శివసత్తులు వస్తుండగా దారిపొడవునా భక్తులు వారి పదాలకు పదాలు కలుపుతూ, అడుగులకు అడుగులు వేస్తూ జంపన్నవాగు నుంచి మేడారం గద్దెల వరకు వచ్చి తల్లులను దర్శించుకున్నారు.

ఆర్టీసీ సేవలు భేష్

మనతెలంగాణ/మేడారం: మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వస్తున్న భక్తులను తరలించడంలో ఆర్టీసీ సేవలు మెరుగ్గా ఉన్నాయని భక్తులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. జాతరను విజయవంతం చేయడంలో భాగంగా భక్తులకు మెరుగైన సేవలను అందించడంతో పాటుగా సురక్షితమైన ప్రయాణాన్ని అందించాలనే సదుద్దేశంతో పాటుగా భక్తులకు సేవలు చేయాలని ఆర్టీసి నిర్ణయించింది. ప్రయాణికులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం భక్తులు వివరిస్తున్నారు. జాతరనుంచి ఇంటికి వెళ్ళే భక్తులకు సైతం బస్టాండ్ ఆవరణలో స్క్రీన్‌లను ఏర్పాటు చేసి బస్సులు ఆగే స్థలాలను సూచిస్తున్నారు. దీంతో భక్తులు ఆర్టీసీ బస్‌లలోనే ఎక్కువగా ప్రయాణం చేస్తున్నారు.











మహిళల్ని విస్మరించిన కేంద్రం : అన్నీ రాజా

మన తెలంగాణ / హైదరాబాద్ : దేశ జనాభాలో సగంగా ఉన్న మహిళల గురించి కేంద్రానికి పట్టలేదని, తాజా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులో తీవ్ర నిర్లక్ష్యం జరిగిందని భారతీయ మహిళల జాతీయ సమాఖ్య ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా వ్యాఖ్యానించారు. మహిళా హక్కులు, సాధికారత, న్యాయం గురించి గొప్పగా చెప్పుకునే ఎన్డీఏ ప్రభుత్వం మహిళల గురించి గానీ, అసంఘటిత రంగంలోని మహిళల గురించిగానీ పట్టించుకోలేదని, కనీసం పౌరులుగా గుర్తించలేదని వ్యాఖ్యానించారు. బాధితుల కోసం ఉద్దేశించిన 'నిర్భయ నిధి' డబ్బుల్ని ఇతర అవసరాలకు మళ్ళించకుండా నిలువరించే ప్రయత్నం కూడా బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. బేటీ బచావో బేటీ పఢావో నినాదాన్ని మర్చిపోయిందని, ప్రాథమిక స్థాయిలో నాణ్యమైన విద్య గురించి బడ్జెట్‌లో ప్రస్తావనే లేదని ఉదహరించారు. అసంఘటిత రంగంలో 96% మహిళలకు ఇది వర్తించకుండా ఉంటే పట్టించుకోలేదని పేర్కొన్నారు.


బడ్జెట్ 2018

బడ్జెట్ హైలెట్స్

2018–19 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన దేశ బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టారు.

- పన్నుల విధానంలో జిఎస్‌టిలో సులభతరమైంది. పెద్దనోట్ల రద్దులో భారీగా ధనం వినియోగంలోకి వచ్చింది.
- సులభతర వాణిజ్యం విధానంలో ఆర్థికవృద్ధి వేగంగా జరుగుతుంది.
- ప్రపంచంలో ఏడో ఆర్థికశక్తిగా ఎదిగాం. త్వరలోనే ఐదవ ఆర్థిక శక్తిగా భారత్ అవతరించనుంది. 7.2–7.5 జిడిపి ఎదుగుదల ఉంటుంది.
- సంస్థాగత సంస్కరణల్లో పేదలకు లబ్ధి. ఈ సంస్కరణలతో బలీయమైన ఆర్థికశక్తిగా భారత్.
- సహజ వనరులను పారదర్శక విధానంలో కేటాయిస్తున్నాం. నిజమైన లబ్ధిదారులకు సబ్సిడీలు అందిస్తున్నాం.
- డిబిటి విజయవంతమైంది. లబ్ధిదారునికి వీలుగా రాయితీలు.
- ఈ ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 15 శాతం పెరుగుతాయి.
- వ్యవసాయం, మౌలిక సౌకర్యాలు, ఆరోగ్య సంరక్షణలకు ప్రాధాన్యం.
- వ్యవసాయం దేశంలో ప్రధాన రంగం. క్లస్టర్ విధానంలో భాగంగా వ్యవసాయాభివృద్ధికి చర్యలు. హార్టికల్చర్‌కు ప్రాధాన్యం.
- గ్రామీణ వ్యవసాయ మార్కెట్లకు రూ.2000 కోట్లు. సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం.
- పర్‌ఫ్యూమ్స్, ఆయిల్స్ కోసం రూ.200 కోట్లు.
- ఆపరేషన్ గ్రీన్ కోసం రూ.500 కోట్లు.
- 42 మెగాఫుడ్ పార్కులను పటిష్టం చేస్తాం. ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.1400 కోట్లు.
- కిసాన్ క్రెడిట్ కార్డులను ఇక నుంచి చేపలు, పశు పెంపకం దారులకు విస్తరిస్తాం.
- మత్స్య శాఖ, పశుసంవర్ధక శాఖలకు రూ.10,000 కోట్లు. జాతీయ వెదురు పరిశ్రమల కోసం రూ.1,290 కోట్ల కేటాయింపు.
- ఢిల్లీలో కాలుష్య నివారణకు ప్రత్యేక చర్యలు.
- ఉజ్వల యోజనలో భాగంగా 8 కోట్ల మంది గ్రామీణ మహిళలకు గ్యాస్ కనెక్షన్లు.
- ప్రధానమంత్రి గ్రామసడక్ యోజనతో మరిన్ని గ్రామీణ రోడ్ల అనుసంధానం. 2022 నాటికి అన్ని గ్రామాల్లో పక్కా రోడ్ల నిర్మాణం.
- గృహ నిర్మాణానికి ప్రత్యేక గృహనిర్మాణ నిధి. దేశవ్యాప్తంగా 55 లక్షల గృహాల నిర్మాణానికి చర్యలు.
- జాతీయ జీవనోపాధి కార్యక్రమానికి రూ.5,750 కోట్లు.
- వ్యవసాయ రుణాలకు రూ.11 లక్షల కోట్లు.
- బ్లాక్‌బోర్డు నుంచి డిజిటల్ బోర్డు: కార్యక్రమంలో భాగంగా డిజిటల్ విద్యా కేంద్రాలు.
- ఆదివాసీ బాలలకు ఏకలవ్య పాఠశాలలు. వడోదరలో రైల్వే వర్శిటీ.
- 2017 జాతీయ ఆరోగ్య పథకంలో భాగంగా ఆయుష్మాన్ భారత్. ఆరోగ్య కేంద్రాలకు రూ.1200 కోట్లు.
- విద్యారంగంలో మౌలిక సౌకర్యాలకు రూ.లక్ష కోట్లు.
- రూ.330 ప్రీమియం చెల్లింపుతో 10 కోట్ల పేద కుటుంబాలకు రూ.5 లక్షల వరకు ఆరోగ్యబీమా. 50కోట్ల మంది వినియోగదారులకు లబ్ధి.
- క్షయ రోగుల సంక్షేమం కోసం రూ.600కోట్లు. మూడు పార్లమెంట్ నియోజకవర్గాలకు ఒక కళాశాల ఏర్పాటు. 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆస్పత్రులు.
- ప్రతీ పౌరునికి సమీపంలో వెల్‌నెస్ సెంటర్లు. వాటి ఏర్పాటుకు రూ.1200 కోట్లు.
- మహిళా స్వయం సహాయక బృందాలకు రూ.75వేల కోట్లు.
- అన్ని పంటలకు ప్రభుత్వం కనీస మద్దతు ధర.
- ప్రధాని సౌభాగ్య పథకంలో భాగంగా నాలుగు కోట్ల గృహాలకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు. సౌభాగ్య పథకానికి రూ.16వేల కోట్లు.
- గ్రామీణ పారిశుధ్య పథకానికి రూ.16,713 కోట్లు.
- ఆరోగ్య రంగానికి 1.38 లక్షల కోట్లు.
- చిన్న, సూక్ష్మ తరహా పరిశ్రమల కోసం రూ.3,790 కోట్లు.
- దళిత సంక్షేమానికి కోసం రూ.52,719 కోట్లు. ఆదివాసీల సంక్షేమానికి రూ.32,508 కోట్లు.
- జన్‌ధన్ యోజనలో భాగంగా 60వేల కోట్ల బ్యాంకు ఖాతాలకు బీమా సౌకర్యం వర్తింపు.
- పిఎం జీవన్ బీమా యోజన ద్వారా రెండు కోట్ల కుటుంబాలకు లబ్ధి. ముద్ర యోజన కింద చిన్న పరిశ్రమలకు రుణాలు ఇచ్చే యోచన. రుణాల్లో 75శాతం మహిళలకు కేటాయింపు.
- వస్త్రపరిశ్రమ కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు. టెక్స్‌టైల్ రంగానికి రూ.7,148 కోట్లు.
- గత మూడు సంవత్సరాల్లో ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యత.
- కొత్త ఉద్యోగాలు కల్పించే రంగాల్లో ప్రభుత్వం చెల్లించే ఇపిఎఫ్ 8.33 నుంచి 12 శాతానికి పెంపు. పెంచినది మూడేళ్ల పాటు అమలు.
- నమామి గంగ పథకం కింద 187 ప్రాజెక్టులు. 10 పర్యాటక కేంద్రాల అభివృద్ధి. పురావస్తుశాఖ కింద ఉన్న 110 కేంద్రాల అభివృద్ధికి కృషి.
- ఆకర్షణీయ నగరాల పథకం కింద 99 నగరాల ఎంపిక, వాటి అభివృద్ధికి రూ.2.04 లక్షల కోట్లు.
- రైల్వేలకు రూ.1.48లక్షల కోట్లు.
- రోడ్లు, మౌలిక వసతులకు రూ.9.64లక్షల కోట్లు.
- ఇంటింటి తాగునీటి పథకానికి రూ.77,500కోట్లు.
- రైల్వేల్లో 18 వేల కి.మీ. డబ్లింగ్. రైలు పట్టాల నిర్వహణకు పెద్ద పీట. 4 వేలకు పైగా కాపలాదారులు లేని గేట్ల తొలగింపు.
- అన్ని రైల్వే జోన్‌లు, రైళ్లలో సిసిటివిలు, వైఫై సౌకర్యం. పెరంబూర్‌లో అధునాతన కోచ్‌ల నిర్మాణం.
- 3600 కి.మీ. మేర రైల్వేలైన్ల పునరుద్ధరణ. 600 రైల్వేస్టేషన్ల అభివృద్ధి.
- జీవన ప్రమాణాల మెరుగుదలకు పైలట్ ప్రాజెక్టు కింద 115 జిల్లాలు.
- క్రియాశీలకంగా లేని 56 ఎయిర్‌పోర్టులు 'ఉడాన్' కింద అభివృద్ధి.
- 2020 నాటికి 50 లక్షల మంది యువతకు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ.
- టోల్ ప్లాజాలో సులభతర ప్రయాణానికి ఎలక్ట్రానిక్ చెల్లింపులు.
- 900 కొత్త విమానాల కొనుగోలు. వంద కోట్ల ప్రయాణాలకు వీలుగా విమానాశ్రయాలు విస్తరణ.
- భారత్ నెట్‌వర్క్ కార్యక్రమం కోసం రూ.10వేల కోట్లు. గ్రామాల్లో 5 లక్షల వైఫై రూటర్ల సదుపాయం.
- 14 ప్రభుత్వ రంగ సంస్థలను స్టాక్‌మార్కెట్‌లో లిస్ట్ చేస్తాం.
- పెట్టుబడుల ఉపసంహరణ లక్ష్యం రూ.80వేల కోట్లు.
- క్రిప్టో కరెన్సీని ప్రభుత్వం అంగీకరించదు.
- స్టాంప్ డ్యూటీల విషయంలో కొత్త విధానం.
- ప్రతి వ్యాపార సంస్థకు యూనిక్ ఐడి. సులభతర వాణిజ్యంలో పారదర్శకత కోసం ప్రతి వ్యాపార సంస్థకు గుర్తింపు.
- ద్రవ్యోల్బణం ఆధారంగా ఐదేళ్లకొకసారి ఎంపి వేతనాల్లో మార్పు.
- 2017–18 సవరించిన బడ్జెట్ రూ.21.54లక్షల కోట్లు.
- 2017–18లో ద్రవ్యలోటు అంచనా జిడిపిలో 3.5శాతం.
- వ్యక్తిగత ఆదాయపు పన్ను చెల్లింపుల కింద అదనంగా రూ.90వేల కోట్ల సేకరణ.
- దేశంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య 85.51 కోట్లు. 40 శాతానికి పెరిగిన పన్ను రిటర్నులు దాఖలు చేసే వారి సంఖ్య.
- అమృత్ పథకం కింద రూ.19,428 కోట్లతో 494 ప్రాజెక్టులు.
- 2018–19 బడ్జెట్ అంచనా రూ.21.57లక్షల కోట్లు. ద్రవ్యలోటు 3.3 శాతంగా ఉంటుందని అంచనా.
- వయోధిక పౌరుల బ్యాంకు డిపాజిట్ల ఆదాయంపై పన్ను పరిమితి పెంపు. రూ.50వేల వరకూ వర్తించని పన్ను.
- వయోధిక పౌరుల ఎఫ్‌డి, పోస్టాఫీస్ డిపాజిట్లపై టిడిఎస్ ఉండదు. రూ.50వేల వరకూ వర్తింపు.
- వైద్య, విద్య సెస్సు 4 శాతానికి పెంపు.

మోడీ సంతకం సుస్పష్టం



న్యూఢిల్లీ: అనేక మంది ఆశించిన విధంగానే ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నికల ఏడాది దృష్టిలో పెట్టుకుని బడ్జెట్‌ను సమర్పించారు. వచ్చే ఏడాది, ఈ ఏడాది మొదట్లో జరగనున్న ఎన్నికల పర్వం తరుణంలో నిరాశ, నిస్పృహల నుంచి రైతు లోకాన్ని బయటపడవేసే విధమైన బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి జైట్లీ సమర్పించారు. ఈ బడ్జెట్‌లో భారత దేశపు రైతులు, గ్రామీణులు, కంపెనీలు వ్యవసాయ సంస్కృతిని అలవర్చుకొని పెద్ద విజేతలుగా వస్తారని చెప్పవచ్చు. బాండ్ల పెట్టుబడిదార్లు భారీగా నష్టపోయే బడ్జెట్ ఇది. దేశ వ్యాప్తంగా రైతులు ఆందోళన బాటపట్టారు. రైతుల పంటలకు ఇచ్చే కనీస ధరను పెంచడానికి బడ్జెట్ కంకణం కట్టుకొంది. దేశవ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్‌లలో భారీగా పెట్టుబడులు పెట్టే వాతావరణం నెలకొంటుంది. దీనితో గ్రామీణ ప్రాంతాలకు అధికంగా నిధులు అందుబాటులో ఉంటాయి. సాగు పథకాలు, వ్యవసాయ కార్యక్రమాలకు నిధులు సమృద్ధిగా అందే అవకాశం ఉంది. రైతులు అదనంగా ఉత్పత్తి చేసే సౌర ఇంధనాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా కొనే అవకాశం కల్పించారు. దీనికి రైతులు సోలార్ విద్యుత్ పంపులు వాడుతారు. శక్తి పంప్స్ ఇండియా లిమిటెడ్, జెయిన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్, కెఎస్‌బి పంప్స్ లిమిటెడ్, కిర్లోస్కర్ బ్రదర్స్ లిమిటెడ్, అవంతి ఫీడ్స్ లిమిటెడ్, వాటర్ బేస్ లిమిటెడ్, జెకె అగ్రి జెనిటెక్ లిమిటెడ్స్, పిఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ వంటి వ్యవసాయ ఆధార బడా కంపెనీలకు ప్రయోజనాలు బాగా చేకూరుతాయి. మౌలిక సౌకర్యాల కల్పనకు (రోడ్లు, రైల్వేలు, ఇంజనీరింగ్ సంస్థలు, ఇతర మౌలిక సౌకర్యాల నిర్మాణం) కోసం జైట్లీ రికార్డు స్థాయిలో కేటాయింపులు అందిస్తున్నారు. ఇది రైల్ వేగన్ ఉత్పత్తిదార్లకు లాభించే అంశం. వారిలో లార్సన్ అండ్ టుబ్రో లిమిటెడ్, హిందూస్థాన్ కన్‌స్ట్రక్షన్ లిమిటెడ్, ఎన్‌సిసి లిమిటెడ్, ఐఆర్‌బి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్ లిమిటెడ్ , దిలీప్ బుల్డ్‌కాన్ లిమిటెడ్, టైటాగర్ వేగన్స్ లిమిటెడ్, సిమ్ కో లిమిటెడ్ వంటి కంపెనీలకు ప్రయోజనాలు చేకూర్చే చర్య ఇది. దేశపు ప్రధాన భూభాగంలో భారీ పథకాల అమలు వల్ల రోజు కూలీలకు ఉపాధి పెరుగుతుంది. హిందూస్థాన్ లీవర్, బ్రిటానియా ఇండస్ట్రీస్, మారికో లిమిటెడ్ వంటి కంపెనీల కార్యకలాపాలు విస్తరిస్తాయి. బంగారానికి గిరాకీ 60శాతం గ్రామీణ ప్రాంతాల నుంచి వస్తున్నందున గ్రామీణ, వ్యవసాయ ఆదాయాలు పెంచడంపై దృష్టి పెట్టడంతో ఈ రంగం వృద్ధికి నోచుకోనుంది. ప్రాంతీయ విమానాశ్రయాల విస్తరణకు ప్రభుత్వం ప్రతిన బూనడంతో జీఎమ్‌ఆర్, జివికె వంటి సంస్థలకు అధిక ప్రయోజనాలు సిద్ధించవచ్చు. దేశీయ ఉత్పత్తిని పెంచడానికి మొబైల్ ఫోన్లపై కస్టమ్స్ సుంకాన్ని 15 శాతం నుంచి 20 శాతానికి పెంచారు. దీని వల్ల ఆపిల్, సామ్‌సంగ్ సంస్థల లాభాలు తరిగి అవి నాణ్యత పెంచుకోవడమో, స్థానిక ఫ్యాక్టరీలు నిర్మించడమో చేస్తాయి. రుణ సేకరణ కార్యక్రమం ఆశించినంత లేకుండా తగ్గించడంతో బాండ్ మదుపర్లకు కొంత ఊరట లభిస్తుంది.


పంట పొలాలు కళకళలాడాలి..

'గ్రామాలను అభివృద్ధి చేయడం, గ్రామీణులకు కొత్త అవకాశాను తెచ్చి పెట్టడం మా లక్ష్యం. పంటపొలాలు కళకళలాలి. రైతు ముఖంలో చిరునవ్వులు చిందించేలా చేయాలనుకుంటున్నాం. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తికి కూడా చక్కటి జీవితాన్ని అందించేందుకే 'ఈజ్ ఆఫ్ లివింగ్' నినాదంతో బడ్జెట్ తీసుకొచ్చాం. వ్యవసాయం నుంచి మౌలిక రంగాల వరకు అన్నింటిని బడెట్‌లో స్పృశించాం. 201819 వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చాం. ఇది రైతులకు, సాధారణ పౌరులకు మేలు చేసే బడ్జెట్. వ్యాపారవేత్తలకు కూడా అనువైనదే. బడ్జెట్‌లో గ్రామీణ రంగాలకు పెద్దపీట వేసిన అరుణ్ జైట్లీకి అభినందనలు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కల్పన కోసం గరిష్టంగా రూ.14.34 లక్షల కోట్లు కేటాయించడం సంతోషం. పంటలకు కనీస మద్దతు ధరను ఒకటిన్నర రెట్లు పెంచాం. అన్ని రాష్ట్రాలతో నీతి ఆయోగ్ చర్చల అనంతరం మద్దతు ధర అమలు కోసం యంత్రాంగాన్ని రూపొందిస్తాం. జిల్లాలను క్లస్టర్లుగా విభజించి సమీకృత వ్యవసాయ విధానాన్ని అమలు చేయబోతున్నాం. రైతు సంఘాలను ఏర్పాటు చేసి, సాగుకు సంబంధించిన అన్ని వివరాలను చేరవేస్తాం. దేశవ్యాప్తంగా 22 వేల గ్రామీణ అగ్రి కల్చరల్ సెంటర్లను ఏర్పాటుచేయనున్నాం. కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నడిచే ఈ సెంటర్లను వాణిజ్య శాఖకు అనుసంధానం చేస్తాం. మొత్తం 2వేల కోట్ల మూలధనంతో ఈ అగ్రి మార్కెట్లను ప్రారంభించనున్నాం. పండ్లు, కూరగాయల రైతుల ప్రయోజనాల కోసం రూ.500 కోట్లతో 'ఆపరేషన్ గ్రీన్స్' పథకం. మత్స్య, పాడి రైతులకు కూడా కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేసి, స్వల్పకాలిక రుణాలు అందజేస్తాం. గ్రామీణ ప్రాంతంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణాన్ని చేపట్టి తద్వారా పంట ధాన్యాల రవాణా వేగవంతమై, రైతుకు మేలు జరుగుతుంది. 'ఆయుష్మాన్ భవ' పథకం కింద ఒక్కో పేద కుటుంబానికి రూ.5లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పిస్తాం. రూ.330 చెల్లిస్తే కుటుంబానికి ఆరోగ్య బీమా అందుతుంది''

— అరుణ్ జైట్లీ బడ్జెట్ ప్రసంగం తర్వాత ప్రధాని మోడీ స్పందన

నల్లధనంపై చర్యలు ఆగవు: జైట్లీ

న్యూఢిల్లీ : నల్లధనాన్ని అరికట్టడానికి భవిష్యత్తులో కూడా చర్యలు చేపడతామని ఆర్థిక మంత్రి జైట్లీ హామీ ఇచ్చారు. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో అదనంగా రూ. 90,000 కోట్ల మొత్తాన్ని ప్రభుత్వం వసూలు చేసినట్లు ఆర్థిక మంత్రి చెప్పారు. పన్నుల ఎగవేత అరికట్టడానికి తీసుకున్న చర్యలవల్ల వచ్చిన అదనపు ఆదాయం అది అని వివరించారు. 2016 లో ప్రకటించిన పెద్ద నోట్ల రద్దును 'ఈమాందారీకా ఉత్సవ్' అన్నట్టుగా ఘనంగా స్వాగతించారని ఆయన చెప్పారు. అటువంటి చర్యలు ఇంకా కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. 2016–17, 2017–18 ఆర్థిక సంవత్సరాల్లో ప్రత్యక్ష పన్నుల ఆదాయం వృద్ధి చెప్పుకోదగ్గట్టుగా ఉందని చెప్పారు.





బడ్జెట్ ప్రవేశపెట్టడానికి ముందు రాష్ట్రపతి భవనలో గురువారం నాడు రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్‌తో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బృందం, పార్లమెంటు ఆవరణలో డాగ్ స్క్వాడ్‌తో బడ్జెట్ ప్రతుల తనిఖీలు

ఆయుష్మాన్ భారత్

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నానని జైట్లీ తెలిపారు. ఈ మొత్తం 1.5 లక్షల ఆరోగ్య, వెల్‌నెస్ కేంద్రాలకు వెళుతుందని ఆయన చెప్పారు. దీని వల్ల ప్రజల ఇళ్ల దగ్గరలోనే ఆరోగ్య కేంద్రాలు రాగలవన్నారు. 'ఆయుష్మాన్ భారత్' కార్యక్రమం కింద రెండు వినూత్నమైన పథకాలను తెచ్చామని పేర్కొన్నారు. వీటి వల్ల 2022 నాటికి నవభారత నిర్మాణం జరుగుతుందని, ప్రజల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. 'ఈ పథకాల కారణంగా లక్షలాది ఉద్యోగాలు, ముఖ్యంగా మహిళలకు దొరుకుతాయి. అందరికీ ఆరోగ్య సేవలు అనే లక్ష్యం దిశగా ప్రభుత్వం పనిచేస్తుంది' అన్నారు. అన్ని సాంక్రామిక వ్యాధుల్లో క్షయ(టిబి) ప్రతి ఏడాది ఎక్కువ మంది ప్రాణాలు బలిగొంటోంది, ముఖ్యంగా అది పేద, పౌష్టికాహార లోపంతో బాధపడేవారినే ఎక్కువ బాధిస్తోంది. అందుకే ప్రభుత్వం టిబి వ్యాధిగ్రస్తులందరికీ పౌష్టికాహారం సాయం అందించేందుకు అదనంగా రూ. 600 కోట్లు కేటాయిస్తోందని, వారు చికిత్స పొందుతున్న సమయంలో నెలకు రూ. 500 చొప్పున అందిస్తుంది' అని ఆయన వివరించారు.

ఆరోగ్యకరమైన భారత్(స్వస్థ్ భారత్) ద్వారానే సౌభాగ్య భారత్(సమృద్ధ భారత్) సాధ్యమవుతుందని జైట్లీ పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్యంగా లేనప్పుడు ఫలాలు కూడా బాగుండవని ఆయన తెలిపారు. 'మేము జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకాన్ని ఆవిష్కరిస్తున్నాము. ఇది 10 కోట్ల పేద కుటుంబాలు(దాదాపు 50 కోట్ల మందికి) లబ్ధి చేకూరుస్తుంది. ప్రతి ఏడాది ఈ పథకం కింద ప్రతీ ఒక్కో కుటుంబానికి రూ. 5 లక్షల వరకు బీమా కల్పిస్తాం. ఇది ప్రభుత్వ నిధులతో అందిస్తున్న ప్రపంచంలోనే అతి పెద్ద ఆరోగ్య సంరక్షణ పథకం' అన్నారు.

లోక్‌సభలో వరుసగా ఐదోసారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆయన 'నాణ్యమైన వైద్య విద్యను, మెరుగైన వైద్య సేవలను అందించేందుకు కొత్తగా 24 ప్రభుత్వ వైద్య కళాశాలలు, ఆసుపత్రులను ఏర్పాటు చేయనున్నాం. దేశవ్యాప్తంగా ఇప్పుడున్న జిల్లా ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తాం' అన్నారు. దీనివల్ల ప్రతి రాష్ట్రంలోని మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు కనీసం ఓ ప్రభుత్వ వైద్య కళాశాల ఉండగలదన్నారు.

ప్రస్తుతమున్న రాష్ట్రీయ స్వస్థ్య బీమా యోజన(ఆర్‌ఎస్‌బివై) పేద కుటుంబాలకు రూ. 30,000 మేరకే వార్షిక వైద్య సదుపాయాన్ని అందిస్తోంది. ఆసుపత్రుల్లో చేరి చికిత్స పొందేందుకు లక్షలాది కుటుంబాలు అప్పు చేయడమో లేక తమ ఆస్తులు అమ్ముకోవడమో చేస్తున్నారు. ఇలాంటి పేద కుటుంబాల విషయంలో ప్రభుత్వం ఆందోళన చెందుతున్నట్లు ఆయన తెలిపారు.

బడ్జెట్ అనంతరం ఆరోగ్య శాఖ మంత్రి జె.పి.నడ్డా తన ట్వీట్‌లో ' వ్యవసాయ, ఉపాధికల్పన, మెరుగైన ఆరోగ్యం, మౌలికవసతుల కల్పనాభివృద్ధి వంటి వాటిపై దార్శనిక బడ్జెట్‌ను అందించినందుకు ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీకి నేను కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. ఇది నవభారత బడ్జెట్ ' అని రాశారు.

తెలంగాణ వాటా రూ.19, 207 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

సంవత్సరానికి రూ. 33,929.84 కోట్లు దక్కనున్నాయి. కేంద్ర పన్నుల రాబడిలో కార్పొరేట్ పన్ను మొత్తం రూ. 9526 కోట్లు కాగా, ఆదాయపన్ను మొత్తం రూ. 8430 కోట్లు, కేంద్ర జీఎస్టీ మొత్తం రూ. 10,919 కోట్లు, సుంకాల మొత్తం 1671 కోట్లు, కేంద్ర ఎక్సైజ్ పన్నులు 1628 కోట్లు.. ఇందులో 201617 సంవత్సరం అంచనాలతో పోలిస్తే.. రూ. 849 కోట్లు లోటు కనిపిస్తున్నది. ప్రతి ఏడాది రాష్ట్రాల నుంచి వసూలైన కేంద్ర పన్నుల మొత్తంలో ఆయా రాష్ట్రాల వాటాను కేంద్ర ప్రభుత్వం తిరిగి ఇవ్వనున్న సంగతి తెలిసిందే. ఈ మేరకు రాష్ట్రాలకు దక్కనున్న కేంద్ర పన్నుల వాటా మొత్తం జాబితాను వెల్లడించారు. 14వ ఆర్థిక సంఘం సూచలన మేరకు రాష్ట్రాల నుంచి వసూలైన కేంద్ర పన్నుల రాబడిలో 42శాతం వాటాను ఆయా రాష్ట్రాలకు తిరిగి ఇవ్వనున్న సంగతి తెలిసిందే.

రైల్వేకు రూ.1.48 లక్షల కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

బెంగళూరు సబర్బన్ రైల్వే నెట్‌వర్క్‌పై దృష్టిసారిస్తున్నామని చెప్పారు. భారతీయ రైల్వే రోడ్‌మ్యాప్‌ను ఆవిష్కరిస్తూ సిగ్నలింగ్ ఆధునీకరణ, పొగమంచు భద్రతా పరికరాల ఉపయోగం, ప్రయాణికులకు మరిన్ని సౌఖ్యాలు,భద్రతపై దృష్టిపెడతామన్నారు.12000 వ్యాగన్లు, 5160 బోగీలు, 700 లోకోమోటివ్‌లు సేకరిస్తున్నామన్నారు. రైల్వేలక్ష్యాల్లో గణనీయ అభివృద్ధి సాధిస్తామని చెప్పారు.2017సెప్టెంబర్‌లో బులెట్ రైలుకు శంకుస్థాపన చేశామన్నారు. హైస్పీడు రైల్వే ప్రాజెక్టులకు అవసరమైన సిబ్బంది శిక్షణ కోసం వడోదరలో సంస్థను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 'రాష్ట్రీయ రైల్ సంరక్ష కోశ్ కింద తగినన్ని నిధులు కేటాయిస్తామన్నారు.'భద్రత ముందు' విధానాన్ని జైట్లీ ప్రకటించారు. 92ఏళ్లుగా వేరుగా ప్రవేశపెట్టే రైల్వే బడ్జెట్ విధానాన్ని రద్దు చేసి గత ఏడాది సాధారణ బడ్జెట్‌లో కలిపేశారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుంది : 'డిక్కీ'

మన తెలంగాణ / హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్ చిన్న మధ్య తరహా పరిశ్రమల రంగానికి, వ్యవసాయ రంగానికి చాలా దోహదపడుతుందని, 'ముద్రా' బ్యాంకు ద్వారా మూడు కోట్ల రూపాయల మేరకు రుణం లభించనుందని దళిత ఛాంబర్ ఆఫ్ కామర్స్ విభాగం (ఏపీ) అధ్యక్షుడుమన్నెం మధుసూదనరావు వ్యాఖ్యానించారు. రూ. 50 కోట్ల టర్నోవర్‌కు లోబడి ఉన్న పరిశ్రమలకు అమలవుతున్న 25% కార్పొరేట్ పన్ను విధానాన్ని ఇకపై రూ. 250కోట్ల టర్నోవర్ సంస్థలకు కూడా వర్తింపజేయడం ద్వారా ప్రయోజనం కలుగుతుందన్నారు.

కమలానికి ఉపషాక్

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయింది. అజ్మేర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి రఘు శర్మ బిజెపి అభ్యర్థి రామ్ స్వరూప్ లాంబాపై విజయం సాధించారు. అల్వార్ లోకసభ స్థానానికి పోటీ చేసిన బిజెపి అభ్యర్థి జశ్వంత్ యాదవ్‌పై కాంగ్రెస్ అభ్యర్థికరణ్‌సింగ్ 1,56,319 ఓట్ల తేడాతో గెలుపొందారు. మండల్‌గఢ్ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి వివేక్ ధకద్ గెలిచారు. ఆయన తన బిజెపి ప్రత్యర్థిపై 13వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. అయితే, మూడు స్థానాల్లో జరిగిన ఈ ఉప ఎన్నికల్లో మొత్తం 42 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

సిఎం రాజీనామా చేయాలి : సచిన్ పైలట్

రాజస్థాన్ ముఖ్యమంత్రి వసుంధర ఉప ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహించి వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ రాజస్థాన్ అధ్యక్షులు సచిన్ పైలట్ డిమాండ్ చేశారు. విభజన రాజకీయాలు పనిచేయవని దేశంలోని యువత తెలుసుకుంటున్నారని ఆయన అన్నారు. దాడులు చేసే, దురహంకార బిజెపిని ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సంబరాల్లో పాల్గొన్న కర్ణిసేన నాయకులు మాట్లాడుతూ ఈ ఓటమి వసుంధర రాజె ప్రభుత్వానికి ప్రజల తిరస్కారంగా అభివర్ణించారు.

బెంగాల్‌లో టిఎంసి జయకేతనం

బెంగాల్‌లో జరిగిన రెండు ఉప ఎన్నికల్లోనూ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అభ్యర్థులు విజయం కేతనం ఎగురవేశారు. రాష్ట్రంలోని హౌరా జిల్లాలో ఉన్న ఉల్బేరియా లోక్‌సభ స్థానంలో టిఎంసి అభ్యర్థి సజ్దా అహ్మద్ (టిఎంసి ఎంపి సుల్తాన్ అహ్మద్ భార్య) భారీ మెజార్టీతో విజయం సాధించారు. టిఎంసి అభ్యర్థికి 7,67,219 ఓట్లు వచ్చాయి, బిజెపి అభ్యర్థి అనుపమ్ మాలిక్‌కు 2,93,018 ఓట్లు పోలయ్యాయి. సిపిఎం అభ్యర్థికి 71,300 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇక ఉత్తర 24 పరిగణాల జిల్లాలోని నోపారా అసెంబ్లీ సెగ్మెంట్‌లోనూ టిఎంసి విజ యం సాధించింది. టిఎంసి అభ్యర్థి సునీల్ సింగ్ 1,01,729 ఓట్లు సాధించి, భారీ మెజారిటీతో విజయం సాధించారు. బిజెపి అభ్యర్థి సందీప్ బెనర్జీకి 38,711 ఓట్లు, సిపిఎం అభ్యర్థికి 35,497, కాంగ్రెస్ అభ్యర్థికి 10,527 ఓట్లు లభించాయి.

డాబాపై శిశువు తల

(మొదటిపేజీ తరువాయి)

అతని భర్తకు ఫోన్ చేసింది. దీంతో ఇంటికి వచ్చిన రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ సిఐ వెంకటేశ్వర్లు సంఘటన వివరాలను పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందజేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న రాచకొండ జాయింట్ సిపి తరుణ్ జోషి, మల్కాజ్‌గిరి డిసిపి ఉమా మహేశ్వర్ శర్మ, ఎసిపిలు చేరుకుని సంఘటన స్థలంలో గుర్తు తెలియని తలను పరిశీలించారు. అనంతరం పోలీస్ అధికారులు చుట్టు ప్రక్కల వారిని అడిగి ఆరా తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. కాగా బుధవారం చంద్రగ్రహణం,పౌర్ణమి ఉన్నందున ఎవరైనా మంత్రగాల్లు ఈ పని చేసి ఉంటారా అన్న విషయంపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. పసికందు తలను డాబాపై ఉంచిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిసిపి ఉమా మహేశ్వర్‌శర్మ తెలిపారు. గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుర్తు తెలియని అగంతకులు చేశారని, ఇది చాలా బాధాకరమని, త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు. పలు కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు ఆయన విలేకరుల వివరించారు.

నిరాశ బడ్జెట్ : ఎఐబిఇఎ

మన తెలంగాణ /హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్ ఆశ్చర్యపర్చేదిగా లేదని, నిరాశాకరమైనదేనని అఖిల భారత బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటాచలం వ్యాఖ్యానించారు. వ్యవసాయ రంగానికి రూ. 11 లక్షల కోట్ల మేరకు కేటాయింపులు చేసినా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి నిర్దిష్టంగా ఈ బడ్జెట్‌లో ఎలాంటి స్పష్టతా లేదని, రైతుల్ని మరింత కుంగదీస్తుందని వ్యాఖ్యానించారు. రైతుల పంటకు కనీస మద్దతు ధర భరోసా లేదని, మార్కెట్‌కు నేరుగా అమ్ముకునే అవకాశం లేనప్పుడు వ్యవసాయ రంగం మెరుగుపడదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు 86% మంది చిన్న, సన్నకారు రైతులేనని, వారికి మార్కెటింగ్ భరోసా లేకుండా పోయిందన్నారు. రెండు వేల కోట్ల రూపాయల కార్పస్‌ఫండ్‌ను వ్యవసాయ మార్కెట్ రంగానికి కేటాయించడం ఆహ్వానించదగినదే అయినా అది ఏ విధంగా అమలవుతుందో స్పష్టత లేదన్నారు. సహకార బ్యాంకులు, సొసైటీలను ఆదాయపు పన్ను నుంచి మినహాయించాలన్నా పట్టించుకోలేదన్నారు. ఆరోగ్య భద్రత కోసం ప్రత్యేక బీమా గురించి ప్రస్తావించినా నిర్దిష్ట వివరాలేవీ లేవని, ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే కేంద్ర ప్రకటించిందని ఆరోపించారు.

కార్మికవర్గానికి అన్యాయం

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర (2018–19) బడ్జెట్ పేదలు, కార్మికవర్గాన్ని విస్మరించిందని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రేల్వేమెన్ (ఎన్‌ఎఫ్‌ఐఆర్) ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.రాఘవయ్య తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. రైల్వే ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న కొత్త పెన్షన్ పథకం (ఎన్‌పిఎస్) రద్దు గురించి ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించలేదని, రైల్వేలో ప్రస్తుతం కొనసాగుతున్న మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం, రైల్వే క్వార్టర్ల మరమ్మతులు, నిర్వహణ, ఆస్పత్రులను మెరుగుపర్చే విధంగా బడ్జెట్ ప్రతిపాదనలు లేవని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. కనీస వేతనాలపై ఎలాంటి నిర్ణయాన్ని ప్రకటించకపోవడం పట్ల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, అసంఘటితరంగ కార్మికులను తీవ్ర నిరాశకు, నిరుద్యోగ యువతను నిరుత్సాహానికి గురి చేసిందని పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్, ప్రైవేటీకరణ, దేశాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే విధంగా ప్రతిపాదనలు ఉన్నాయన్నారు.

పేద, మధ్య తరగతి ప్రజలకు నిరాశే


మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందని, సామాన్య, పేద, మధ్య తరగతి ప్రజలను నిరాశకు గురిచేసిందని, పరోక్ష పన్నులతో భారం మోపే విధంగా ఉన్నదని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉజ్జిని రత్నాకర్‌రావు విమర్శించారు. పేదలు, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న ఈ బడ్జెట్‌ను నిరసిస్తూ శుక్రవారం నిరసన కార్యక్రమాలు చేట్టాలని నిర్ణయించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. విదేశీ పెట్టుబడిదారులను ప్రోత్సహిస్తూ, స్వదేశీ పరిశ్రమలకు నష్టం కలుగజేస్తుందని, కొత్త ఉద్యోగాల కల్పనకు స్పష్టమైన హామీ లేదని, మూతబడిన పరిశ్రమలను తెరిపించేందుకు, అసంఘటితరంగంలో పనిచేస్తున్న కోట్లాది మంది కార్మికులకు సామాజిక భద్రత, కనీస వేతనాలు కల్పించేందుకు ఎలాంటి ప్రస్తావనా లేదని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మివేయటం ఈ బడ్జెట్ ఉద్దేశంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. దేశ పారిశ్రామికాభివృద్ధికి నష్టం కలుగజేస్తుందని వ్యాఖ్యానించారు. కార్పొరేట్ సంస్థలకు పన్నును 30 నుంచి 25 శాతానికి తగ్గించి కార్మికులకు, వేతన జీవులకు పన్నులో ఎలాంటి వెసులుబాటు కలిగించకపోవడం ద్వారా ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల వైఖరిని మరోసారి నిరూపించుకుందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైతులకు మార్గనిర్దేశం



మన తెలంగాణ/హైదరాబాద్: గ్రామీణ ప్రాంత ప్రజలకు, రైతులకు కేంద్ర బడ్జెట్ మార్గనిర్దేశం చేసేదిగా ఉందని బిజెపి జాతీయ నాయ కులు నల్లు ఇంద్రసేనారెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు కౌలురైతుల గురించి కేవలం మాటలకే పరిమితమైతే, మోడి ప్రభుత్వం వారికి పంట రుణాలతో పాటు పంటల బీమా పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకున్నదని చెప్పారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో బిజెపి నేతలు రాకేష్‌రెడ్డి, ఆచారి, సుధాకరశర్మతో కలిసి ఇంద్రసేనారెడ్డి గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్మికులకు బడ్జెట్‌లో ఇపిఎఫ్ పథకాన్ని ప్రవేశపెట్టిందని, గ్రామీణ వ్యవసాయ మార్కెట్ కోసం నిధులను కేటాయించిందన్నారు. ఆయుష్మాన్‌భవ పథకం ద్వారా పేదలకు రూ. 5లక్షల వరకు ఉచిత వైద్యం అందించేందుకు కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. సంస్కరణలతో పాటు పేద, గ్రామీణ ప్రజలు, రైతాంగాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్షేమ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని కొనియాడారు. కొత్త పరిశ్రమలను ప్రోత్సహించేలా ఇపిఎఫ్‌ను మూడేళ్ల వరకు భరించాలని నిర్ణయించిందన్నారు. పరిశ్రమలలో పనిచేసే మహిళలకు ఆరు నెలల వరకు ప్రసూతి సెలవులను అమలు చేయనుందన్నారు.

కేటాయింపులు అంతంత మాత్రమే



మన తెలంగాణ/హైదరాబాద్ : కేంద్ర బడ్జెట్ వేతన జీవులను నిరాశ పరిచిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్) వ్యాఖ్యానించింది. విద్యకు సంబంధించిన కేటాయింపులు అంతంత మాత్రంగానే ఉన్నాయని, గణనీయమైన ఫలితాలు ఇచ్చే తరహాలో ఈ బడ్జెట్ లేదని రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.కొండల్‌రెడ్డి, మైస శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని వేతన జీవులకు ఊరట కలిగించే విధంగా ఆదాయ పన్ను పరిమితిని సవరించాలని ఆయన డిమాండ్ చేశారు.

బిసిలకు మొండిచేయి: కృష్ణయ్య

మన తెలంగాణ/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో బిసిలకు మొండిచెయ్యి చూపిందని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎంఎల్‌ఎ ఆర్.కృష్ణయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలకు 60శాతం మ్యాచింగ్ గ్రాంట్స్‌ను ఇవ్వాలని ప్రధానిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినా బడ్జెట్‌లో మాత్రం కేటాయింపులు జరగలేదన్నారు.

మరోసారి అన్యాయం: జాజుల శ్రీనివాస్‌గౌడ్

కేంద్ర బడ్జెట్‌లో బిసిలకు మరోసారి అన్యాయం జరిగిందని తెలంగాణ రాష్ట్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బిసి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి ప్రధాని అయినప్పటికీ బిసిలకు నిరాశే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు.

అడిగినవన్నీ ఇవ్వాలె

రాష్ట్రానికి రూ.40వేల కోట్లు కోరాం

- తెలంగాణకు బడ్జెట్‌లో భరోసా లేదు
- ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్



మన తెలంగాణ/హైదరాబాద్: 'కేంద్ర ఆర్థిక మంత్రి గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రత్యేకంగా 'గొప్ప'గా చెప్పుకునే అంశాలేవీ లేవు. కనీసం పార్టీ పరంగా తనదైన ముద్ర వేసుకునే అంశాలు కూడా కనిపించలేదు' అని రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యా రంగానికి నిధులు ఇలా తెలంగాణకు మొత్తం సుమారు రూ. 40వేల కోట్లు అడిగితే ఒక్కటి కూడా కేంద్ర బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు నీతి ఆయోగ్ సిఫారసుల మేరకు నిధుల్ని కేటాయించాలని 'ప్రీ బడ్జెట్' సమావేశంలోనే కేంద్ర మంత్రికి విన్నవించామని, అయినా ఇవ్వలేదన్నారు. ఎయిమ్స్‌కు కూడా ఎలాంటి కేటాయింపులు లేవని పేర్కొన్నారు. ప్రగతిశీల నిర్ణయాలు తీసుకుంటూ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తూ ఉన్న తెలంగాణను ప్రోత్సహించడానికి ఈ బడ్జెట్‌లో ఎలాంటి భరోసా లేదన్నారు. ఐదేళ్ల తర్వాత తొలిసారిగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై ప్రత్యేక దృష్టి పెట్టినా గొప్ప బడ్జెట్ అనే భావన ప్రజల్లో కలగలేదన్నారు. ధనిక, పేద వర్గాల మధ్యగానీ, పట్టణ, గ్రామీణ ప్రజల మధ్యగానీ ఉన్న అంతరాలను రూపుమాపడానికి, నిరుద్యోగానికి పరిష్కారం చూపే దిశగా ఈ బడ్జెట్ లేదని వ్యాఖ్యానించారు. భూగర్భ జలాలు, పర్యావరణం, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై ఈ బడ్జెట్‌లో చెప్పుకోదగిన అంశాలు లేవని అన్నారు. కానీ తెలంగాణ మాత్రం మిషన్ కాకతీయతో భూగర్భ జలాల పెంచిందని, హరితహారంతో పచ్చదనాన్ని పెంచిందని, ఎక్కడెక్కడి నుంచో పక్షులు వస్తున్నాయని గుర్తుచేశారు. కేంద్ర బడ్జెట్‌పై అడిగిన పలు అంశాలపై మంత్రి ఈటల రాజేందర్ మీడియా సమావేశంలో స్పందించారు.

తెలంగాణ పథకాల తీరులోనే...

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తెలంగాణ అనుసరిస్తున్న విధానాలు కేంద్ర బడ్జెట్‌లో ప్రతిబింబించాయని ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. రైతులకు రూ. 17 వేల కోట్ల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, నిరంతరరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోందని, రానున్న వర్షాకాలం నుంచి ఎకరానికి రూ. 4 వేల చొప్పున సాయం చేయనుందని, పండిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ ఉందన్నారు. ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు గోదాముల సామర్థ్యాన్ని 18 లక్షల టన్నులకు పెంచిందని గుర్తుచేశారు. ఇలా వ్యవసాయ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఇదే తరహా ఎన్డీఏ ప్రభుత్వం ఐదేళ్లలో తొలిసారిగా ఈ రంగంపై దృష్టి పెట్టడం గమనార్హమని వ్యాఖ్యానించారు. విద్యారంగంలో ఏకలవ్య పాఠశాలలను ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని, రాష్ట్ర ప్రభుత్వం సుమారు 500 గురుకుల విద్యా సంస్థలను నెలకొల్పిందని, ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు పెంచడం సంతోషకరమన్నారు. ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్, ఆరోగ్యశ్రీ, కెసిఆర్ కిట్ వంటి పథకాలతో తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని, ఇప్పుడు కేంద్ర బడ్జెట్‌లో ఈరంగానికి నిధుల్ని పెంచడం సంతృప్తిగా ఉందన్నారు. వైద్యం పేదవారికి భారం కాకూడదన్న తెలంగాణ స్ఫూర్తి కేంద్ర బడ్జెట్‌లో కనిపించడం విశేషమని అన్నారు. అయితే ఈ నిధుల కేటాయింపులు కాగితాలకే పరిమితం కారాదని, చిత్తశుద్ధితో సంపూర్ణంగా అమలుకావాలని రాజేందర్ వ్యాఖ్యానించారు.

రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదు : జోగు రామన్న



తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవని, ఈ బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని బిసి సంక్షేమ శాఖ మంత్రి జోగు రామన్న వ్యాఖ్యానించారు. బడ్జెట్‌లో పారదర్శకత లోపించిందని, రాష్ట్రం ఆశలు వమ్ము చేసిందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమాలకు నిధుల ఊసే ఈ బడ్జెట్‌లో లేకుండా పోయిందన్నారు. రాష్ట్ర ఆశలపై నీళ్లు చల్లడమే కాకుండా సహకార సమాఖ్య స్ఫూర్తి ప్రతిబింబించలేదని మంత్రి ఒక ప్రకటనలో విమర్శించారు.

ప్రజా అభివృద్ధికి కేటాయింపుల్లేవు

- కేంద్రం ప్రవేశపెట్టింది ఎన్నికల బడ్జెట్
- టిఆర్‌ఎస్ ఎంపిలు





మన తెలంగాణ/న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై టిఆర్‌ఎస్ ఎంపిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టిఆర్‌ఎస్ ఎంపిలు కవిత, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, జితేందర్ రెడ్డి మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టింది ఎన్నికల బడ్జెట్ అని, పేదల పక్షాన ఉండి ఉంటే బాగుండేదని ఎంపి కవిత అభిప్రాయపడ్డారు. గ్రామీణ ప్రజల అభివృద్ధికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవని, విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టామని చెప్పినా పెద్దగా కేటాయింపులు లేవన్నారు. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విషయంలో మొదటి నుంచీ కేంద్రం వైఖరి విచిత్రంగా ఉంది. మహిళా శిశు సంక్షేమానికి సంబంధించి బడ్జెట్ ప్రసంగంలో లేకపోవడం బాధాకరమన్నారు. పేదలకు రూ. 5 లక్షల ఆరోగ్య బీమా ఇస్తామనడం హర్షించదగ్గ విషయం అన్న ఆమె జన్‌ధన్ అకౌంటులో రూ. 60 కోట్లు ఉన్నాయని చెబుతూ, 10 కోట్ల మందికే ఈ స్కీం వర్తిస్తుందని చెబుతున్నారని దీనిపై కేంద్రం క్లారిటీ ఇవ్వాలని కోరారు. ఈజ్ ఆఫ్ బిజినెస్‌లో దేశం అభివృద్ధి చెందిందని చెబుతున్నారు కానీ, ఇందులో రాష్ట్రాల పని తీరును చెప్పకపోవడం బాధాకరం అన్నారు. అనంతరం ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్పందిస్తూ గ్రామీణాభివృద్ధి, రైతాంగానికి పెద్దపీట వేశారని, అయితే కొన్ని అంశాలను విస్మరించారని అన్నారు. పశు సంవర్ధక శాఖకు కేవలం 11 వేల కోట్లు, హార్టీ కల్చర్‌కు 2 వేల కోట్లే కేటాయించారని, ఈ రంగాలు అభివృద్ధి చెందాలంటే ఈ కేటాయింపులు సరిపోవన్నారు. కేంద్ర బడ్జెట్ తో పోలిస్తే తెలంగాణ రాష్ట్రమే ముందుందని, ఒక్క గొర్రెల పెంపకానికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 4వేల కోట్లు కేటాయించిందని తెలిపారు. నిరుద్యోగుల శిక్షణకు నిధులు కేటాయించడం హర్షించదగ్గ పరిణామం అన్నారు. గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు నెలకొల్పే ఆలోచన స్వాగతించదగ్గ విషయం అన్నారు. అనంతరం ఎంపి జితేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కెసిఆర్ రూపొందించిన తరహా బడ్జెట్‌ను భారత ప్రభుత్వమే కాదు ఏ దేశమూ ప్రవేశపెట్టలేదన్నారు. తెలంగాణ బడ్జెట్ ప్రసంగం చిన్న పిల్లగాడు చదివినా అర్థమవుతుందని, కేంద్రం ప్రవేశ పెట్టిన ఈ బడ్జెట్ గందరగోళంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల పరంగా కాకుండా మంత్రిత్వ శాఖల పరంగా బడ్జెట్ కేటాయించిందన్నారు. గతేడాది నుంచి ఈ కొత్త విధానాన్ని అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర అవసరాలను బట్టి కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రాష్ట్రానికి దక్కాల్సిన నిధులను సాధిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎఐబిపి ప్రాజెక్టులకు రూ.6,000 కోట్లు

- రాష్ట్రంలోని 11 ప్రాజెక్టులకు లబ్ధి

మన తెలంగాణ/హైదరాబాద్: ఏఐబిపి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి కేంద్రం తాజా బడ్జెట్‌లో రూ.6,000 కోట్లు కేటాయించగా ఇందులో రాష్ట్రంలోని 11 ప్రాజెక్టులకు సుమారు రూ. 540 కోట్లు అందనున్నాయి. రాష్ట్రానికి చెందిన 11 ప్రాజెక్టుల్లో ఏడు మధ్యతరహా ప్రాజెక్టులుకాగా 4 మేజర్ ప్రాజెక్టులు. బడ్జెట్‌లోని పేర్కొన్న కేటాయింపులను నాబార్డు నుంచి రుణం ద్వారా తీసుకుని రాష్ట్రాలకు అందజేస్తుంది. వచ్చే ఏడాది డిసెంబరులోపు దేశంలోని మొత్తం 99 ఏఐబిపి ప్రాజెక్టులను 'ప్రధానమంత్రి కృషి సించాయి యోజన' పథకం కింద పూర్తి చేయాల్సి ఉంది. చిన్న నీటి వనరులు, మైనర్ ఇరిగేషన్, ట్రిపుల్ ఆర్ (రిపేర్, రినోవేషన్, రీస్టోరేషన్)లో వాటర్ షెడ్‌ల పునరుద్ధరణ తదితరాలకు కేంద్రం ఈ బడ్జెట్‌లో రూ.2,600 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద వచ్చే నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ అవసరాలకు వినియోగించుకునే వెసులుబాటు లభిస్తుంది.

బేసిన్ మేనేజ్‌మెంట్‌కు.. : నదుల అనుసంధాన భవిష్యత్ ప్రణాళికలు ఖరారు చేసేందుకు బడ్జెట్‌లో రూ.225 కోట్లు కేటాయింపు ఉంది. 8 అంతర్రాష్ట్ర నదుల అనుసంధానం, 4 అంతర్గత నదుల అనుసంధాన ప్రణాళికలు తయారైతే దానికి అనుగుణంగా రాష్ట్రాలకు నిధుల కేటాయింపుపై స్పష్టత వస్తుంది. నీటి వనరుల సమాచార వ్యవస్థ అభివృద్ధికి రూ.211.27 కోట్లుగా కేంద్రం అంచనా వేసింది. టెలీమెట్రీ వంటి వ్యవస్థలు ఏర్పాటు చేసి, నీటి ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లోల వాస్తవ లెక్కలను గణించే ఏర్పాట్లకు ఈ నిధులు వినియోగపడనున్నాయి.

మౌలిక రంగానికి మహర్దశ

వార్షిక వ్యయం రూ.6 లక్షల కోట్లకు పెంపు



న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తిగా ఉన్న మౌలిక రంగానికి వార్షిక వ్యయం కింద రూ. 1 లక్ష కోట్లను పెంచి బడ్జెట్‌లో రూ. 5.97 లక్షల కోట్లు కేటాయించారు. దేశంలో మౌలిక రంగం పెట్టుబడికి రూ. 50 లక్షల కోట్లు కావలసి ఉందని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. రోడ్లు, వైమానిక, రైలు, జల మార్గాలకు పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరమని ఆయన తన బడ్జెట్ ప్రసంగంలో అన్నారు. ఆ మొత్తాన్ని మార్కెట్ నుంచి ఈక్విటీ ద్వారా పొందనున్నామని ఆయన సూచించారు. మౌలిక ప్రాజెక్టుల లక్ష్యాలు, సాధనలను ప్రధాని నరేంద్ర మోడీ ఆన్‌లైన్ ప్రగతి విధానం ద్వారా స్వయంగా పర్యవేక్షిస్తున్నందున మౌలిక రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు జైట్లీ తెలిపారు. ఉపాధికల్పనకు, సాయ వృద్ధికి బడ్జెట్‌లో మౌలిక రంగానికి అదనంగా కేటాయింపులు పెంచారు. 2017–18లో మౌలికరంగానికి రూ. 4.94 లక్షల కోట్లు ఉండగా 2018–19లో రూ. 5.97 లక్షల కోట్లకు దాన్ని పెంచారు. రవాణా, హైవేలు, నావికా, జలవనరులు, గంగ పునరుద్ధరణ శాఖ మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ 'ఎప్పటిలానే మౌలిక రంగానికి ప్రాధాన్యత లభించింది. బడ్జెట్‌లో హైవేలకు కేటాయింపును రూ. 7000 కోట్లకు పెంచారు' అన్నారు. జైట్లీ సీప్లేన్లను కూడా ప్రోత్సాహిస్తామని ప్రకటించినందుకు గడ్కరీ సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2018–19లో 9000కుపైగా కిమీ. జాతీయ హైవేలను పూర్తి చేస్తామన్నారు. దేశ సరిహద్దు, మారుమూల ప్రాంతాలను కూడా రోడ్లతో అనుసంధానిస్తామన్నారు. ఉడాన్ పథకం కింద ఇప్పటికే 16 కొత్త విమానాశ్రయాలను అనుసంధానించడం జరిగిందని, త్వరలో మరి 56 విమానాశ్రయాలు, 31 హెలిపాడ్లను అనుసంధానిస్తామని జైట్లీ చెప్పారు.

భారత రక్షణ కోసం సరిహద్దు ప్రాంతాల్లో కూడా మౌలికవసతుల కల్పనను అనుసంధానిస్తున్నామని చెప్పారు. రొహతంగ్ సొరంగ మార్గం, జోజిల్లా సొరంగ మార్గం పనులు కొనసాగుతున్నాయని వివరించారు. పర్యాటక రంగాన్ని, ఎమర్జెన్సీ వైద్య సేవలను ప్రోత్సహించేందుకు సీప్లేన్ కార్యకలాపాల్లో పెట్టుబడి అవసరమన్నారు. ప్రభుత్వం ఇప్పటికే స్మార్ట్ సిటీ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. రూ. 2.04 లక్షల కోట్ల వ్యయంతో 99 నగరాలను స్మార్ట్ సిటీ కేటాయింపుల కింద ఎంపిక చేశారు. ఇప్పటికే వీటి కోసం రూ. 2350 కోట్ల ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇంకా రూ. 20850 కోట్ల పనులు కొనసాగుతున్నాయి అని జైట్లీ వివరించారు. మరింత మంది పర్యాటకులను ఆకర్షించడానికి 10 పర్యాటక గమ్యాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు.

కార్పొరేట్ అనుకూలం..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలుగు రాష్ట్రాలకు అన్యాయం జరిగింది. ఈ బడ్జెట్ పేదలకు మాట మూటలు, పెద్దలకు నిధుల మూటలు అన్న చందంగా ఉంది. కార్పొరేట్ కంపెనీలకు పన్ను తగ్గించిన ఆర్థిక మంత్రి, ప్రజలపై పన్నుల భారం తగ్గించలేదు. రైతులు, పేదలు, విద్యార్థులకు ఉపయోగకరంగా బడ్జెట్ లేదు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకుండా కేంద్రం ఎపికి అన్యాయం చేస్తోంది. గత నెలలో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో వ్యవసాయం, విద్య, ఉపాధి రంగాలకు కేంద్రం పెద్దపీట వేస్తామని తెలిపిందని, కాని అలాంటి ప్రస్తావన చేయలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో 70లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న ఆర్థికమంత్రి హామీ కలగానే మిగిలిపోతుంది. వ్యవసాయరంగానికి కేటాయించిన నిధులు ఏమాత్రం ఉపయోగపడవు. 'అచ్చే దిన్ అంటే ఇదేనా?'

– నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శి


వాస్తవాలు దాచారు..



ఆరోగ్య భద్రత పథకంపై ఆర్థిక మంత్రి తన ప్రసంగంలో వాస్తవాలు దాచారు. బడ్జెట్‌లో సుదీర్ఘ ఉపన్యాసం తప్ప, విషయమేమీ లేదు. ఆరోగ్య పథకాన్ని అమెరికాలోని ఒబామా కేర్‌తో పోల్చుతూ మోడీ కేర్‌గా మంత్రులు అభివర్ణించుకుంటున్నారు. ఇలాంటి పథకాలను ప్రవేశపెట్టే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను అడగకుండా కేంద్రం నిర్ణయం తీసుకోవడం సరికాదు. రాష్ట్రానికో మెడికల్ కాలేజీ అంటే 29 రాష్ట్రాలకు గాను కేవలం 24 కాలేజీలను ఎలా కేటాయిస్తారు? మూడు పార్లమెంటు నియోజకవర్గాలకు ఒక మెడికల్ కాలేజీ అని మరో మాట చెప్పారు. అంటే 17 పార్లమెంట్ నియోజకవర్గాలున్న తెలంగాణకు 6 మెడికల్ కాలేజీలు కేటాయిస్తారా? నిరుద్యోగ యువత, గ్రామీణ భారతానికి బడ్జెట్‌లో అదనపు కేటాయింపులేమీ లేవు.

– బి.వినోద్‌కుమార్, ఎంపి


వ్యవసాయానికి పెద్దపీట..



గత మూడు బడ్జెట్లతో పాటు ఈ బడ్జెట్ ద్వారా సంస్కరణలు, అభివృద్ధితో దేశాన్ని మోడీ ముందుకు తీసుకెళ్తున్నారు. రాష్ట్రంలో కోచ్ ఏర్పాటుకు, ఎయిమ్స్ స్థాపనకు కేంద్రం సిద్ధంగా ఉన్న తెలంగాణ ప్రభుత్వం స్థలాలను కేటాయించడం లేదు. బడ్జెట్‌లో వ్యవసాయం, పేదల సంక్షేమానికి పెద్ద పీట వేశారు. పేదలకు ప్రత్యక్ష పన్నుల ప్రయోజనం అందనుంది. రైతులకు మద్దతు ధర పెంచారు. గ్రామీణ రోడ్లను అభివృద్ధి చేస్తున్నారు. కిసాన్ క్రెడిట్ కార్డులు, 8 కోట్ల మహిళలకు ఉచిత గ్యాస్, ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నారు. ఇవే సంక్షేమ బడ్జెట్ అనడానికి నిదర్శనం. 10 కోట్ల నిరుపేద కుటుంబాలకు రూ. 5 లక్షల వైద్య సదుపాయాన్ని కల్పిస్తూ చేసిన ప్రకటన చరిత్రాత్మకం, ప్రపంచంలో ఎక్కడా లేని పథకమిది.

– డా.లక్ష్మణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు

ప్రధాని ప్రకటనలు వట్టివే..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ శక్తుల అనుకూల బడ్జెట్. యేటా 2కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని ప్రధాని మోడీ చేసిన ప్రకటనలు వట్టి మాటలే. బడ్జెట్ మేడిపండు మాదిరిగా ఉంది. ఒక వైపు కార్పొరేట్ పన్ను తగ్గించిన ప్రభుత్వం మధ్య తరగతి, ఉద్యోగులకు ఊరటనిచ్చే విధంగా వ్యక్తిగత ఆదాయ పన్ను స్లాబుల్లో మార్పు తీసుకురాకపోవడం అన్యాయం. అధికారంలోకి వచ్చి ఇన్నేళ్లయినా ప్రజలు, రైతులు, ఉద్యోగులకు కనీసం భరోసా ఇచ్చే ప్యాకేజీని ప్రకటించలేదు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్న హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం నిజంగా విచారకరం. తెలంగాణ రాష్ట్రంలో ఒక్క సాగు నీటి ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా కల్పించలేదు. ప్రత్యేకంగా రైల్వేకు ఎలాంటి కేటాయింపులు లేకపోవడం అన్యాయం.

– చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నా

వ్యక్తిగత, వృత్తిగత జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాల్ని చవిచూశానని, ఈ ప్రయాణంలో ఎన్నో జీవన సత్యాల్ని తెలుసుకున్నానని చెప్పింది మలయాళ సుందరి నయనతార. ప్రస్తుతం స్క్రిప్టులను ఎంచుకునే విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నానని ఈ అందాలతార తెలియజేసింది. గతంలో ప్రేమలో విఫలమైన తర్వాత నయనతార కెరీర్ ముగిసిపోయిందని అందరూ అనుకున్నారు. అయితే అందరి అంచనాల్ని తలక్రిందలు చేస్తూ తిరిగి విజయాల బాటపట్టింది ఈ సొగసరి. ప్రస్తుతం ఆమె పలు భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. ఈ సందర్భంగా నయనతార మాట్లాడుతూ ''ప్రస్తుతం బాధలన్నీ మర్చిపోయి ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నాను. మనం సక్సెస్‌లో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ పొగడ్తలతో ముంచెత్తుతుంటారు. మీడియా వారు కూడా పాజిటివ్‌గా వార్తలు రాస్తారు. ఫెయిల్యూర్స్ మొదలవగానే అంతకాలం పక్కనున్న వాళ్లందరూ తప్పుకునే ప్రయత్నం చేస్తారు. బాగా తెలిసిన వారు కూడా మనమెవరో తెలియనట్టే నటిస్తారు. పరిశ్రమలో అలాంటి అవకాశవాదుల్ని చాలా మందిని చూశాను. తమ ప్రయోజనాలకు అనుగుణంగా మనుషులు ఎలా మారిపోతారో స్వయంగా తెలుసుకోగలిగాను. అందుకే గత కొన్నేళ్లుగా మీడియాకు దూరం, ఎటువంటి ఇంటర్వ్యూలు ఇవ్వడం లేదని చెప్పింది.



తిక్కను సంతృప్తిపరిచే 'అ!'

నాని సమర్పణలో వాల్ పోస్టర్ సినిమా బ్యానర్‌పై రూపొందుతున్న చిత్రం 'అ'. కాజల్ అగర్వాల్, రెజీనా, ఈషా రెబ్బా, శ్రీనివాస్ అవసరాల, నిత్యామీనన్, మురళీశర్మ, ప్రియదర్శి తదితరులు నటించిన ఈ చిత్రానికి ప్రశాంత్ వర్మ దర్శకుడు. ప్రశాంతి త్రిపిరినేని నిర్మాత. ఈ సినిమా ఈనెల 16న విడుదలకానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటైన ప్రీ రిలీజ్ వేడుకలో ఎస్.ఎస్.రాజమౌళి మాట్లాడుతూ ''ట్రైలర్ చూసిన వెంటనే సినిమా చూడాలనే ఆసక్తి కలిగింది. సినిమా సూపర్‌హిట్ అవుతుందనే ఫీలింగ్ కలిగింది. నాని వరుసగా హిట్స్ మీద హిట్స్ కొట్టేస్తున్నాడు. నాని సినిమా అంటే తప్పకుండా హిట్టేనని అందరికీ ఫీలింగ్ కలిగింది. దీన్ని దాటి మరో స్టెప్ పైకి వెళ్లాలని కోరుకుంటున్నాను. సినిమాలో రెజీనా లుక్ చూడగానే ఆమె అందం, ఆకర్షణ, బోల్డ్‌నెస్ ఆకట్టుకుంది. ఈ సినిమా ట్రెండ్ సెట్టర్ అవుతుందని భావిస్తున్నాను'' అని అన్నారు. నాని మాట్లాడుతూ ''ఇదొక తిక్క సినిమా. మన అందరిలో కాస్త తిక్క ఉంటుంది. ఆ తిక్కను సంతృప్తిపరిచే సినిమా ఇది. దర్శకుడు ప్రశాంత్ కథ చెప్పగానే నాకు కొత్తగా అనిపించింది. అయితే నాకు కథ నచ్చింది కాబట్టే ఈ సినిమాను నేను ప్రొడ్యూస్ చేస్తాను అని చెప్పాను. ఇలాంటి ఐడియాను నేను ప్రోత్సహించకపోతే మంచి కథలు తెలుగులో రావనిపించి నేనే నిర్మాతగా మారాను. సినిమాకు 'అ!' టైటిల్ కరెక్ట్‌గా సరిపోతుంది. ఈ చిత్రంలో నిత్యామీనన్ నటించడం ఆనందంగా ఉంది. తన పాత్ర చాలా ఆశ్చర్యకరంగా ఉంటుంది. ప్రియదర్శిలో యూనిక్ స్టైల్ ఉంది. చెఫ్ రోల్‌లో అతను అద్భుతంగా నటించాడు. తన పాత్ర కోసం రెజీనా హెయిర్‌స్టైల్ మార్చేసింది. ఈషా ఇందులో బ్యూటిఫుల్ రోల్ చేసింది. రవితేజ కథ విని వాయిస్ ఓవర్ ఇవ్వడానికి ఒప్పుకున్నారు. కాజల్ ఈ సినిమాలో చేస్తానని చెప్పి నటించింది. ఇక అవసరాల శ్రీనివాస్ నేను అనుకున్న రోల్‌కు పర్‌ఫెక్ట్‌గా సరిపోయాడు. నా ఫేవరేట్ కోస్టార్ మురళీశర్మ కూడా ఇందులో చాలా మంచి పాత్ర చేశాడు. ప్రశాంత్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తున్నందుకు గర్వంగా ఉంది'' అని అన్నారు. దర్శకుడు ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ ''ముందుగా నానీకి థాంక్స్. ఆయన నిర్మాతగా మారగానే ఈ సినిమా చాలా పెద్దదైంది. నిత్యా, ఈషా, కాజల్, రెజీనా, ప్రియదర్శి, మురళీశర్మలు చక్కగా నటించారు. ఈ సినిమాను తెరకెక్కించడం గొప్ప అనుభూతినిచ్చింది. ఇదొక సిన్సియర్, నిజాయితీతో కూడిన ప్రయత్నం. ఈ చిత్రాన్ని ఈనెల 16న విడుదల చేస్తున్నాం'' అని చెప్పారు. అనుష్క మాట్లాడుతూ ''ఇందులోని 11 క్యారెక్టర్స్ అన్నీ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి. సినిమా అందరికీ తప్పకుండా నచ్చుతుంది'' అని అన్నారు. కాజల్ అగర్వాల్ మాట్లాడుతూ ''చాలా కొత్త కథ ఇది. నా కెరీర్‌లో చేసిన కొత్త పాత్ర ఇది. వినోదంతో పాటు సినిమాలో మంచి సందేశం కూడా ఉంది'' అని పేర్కొన్నారు. నిత్యామీనన్ మాట్లాడుతూ ''రొమాన్స్, సైన్స్ ఫిక్షన్, లవ్, హార్రర్, థ్రిల్లర్ సహా అన్ని ఎలిమెంట్స్ ఉన్న చిత్రమిది. యూనిట్ కాన్సెప్ట్ మూవీ ఇది. ప్రశాంత్ వండర్‌ఫుల్ స్టోరీతో సినిమాను తెరకెక్కించాడు'' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.ఎం.కీరవాణి, శ్రీనివాస్ అవసరాల, ఈషా రెబ్బా, ప్రియదర్శితో పాటు చిత్ర బృందం పాల్గొంది.


'అ' ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో రాజమౌళి, నాని, అనుష్క, కాజల్, రెజీనా, నిత్యామీనన్, ప్రియదర్శి, ప్రశాంత్ వర్మ తదితరులు

'గాయత్రి' సెన్సార్ పూర్తి


డా.మోహన్‌బాబు

డా.మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటించిన 'గాయత్రి' చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తిచేసుకొని ఈనెల 9న విడుదలకు సిద్ధమైంది. శ్రీ లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్‌పై మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రాన్ని అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. మోహన్‌బాబు ఇంటెన్స్ లుక్, పవర్‌ఫుల్ డైలాగుతో కూడిన ట్రైలర్ చిత్రంపై ఆసక్తిని భారీగా పెంచేశాయి. ఎస్.ఎస్.తమన్ స్వరపరిచిన పాటలకు విశేష స్పందన వస్తోంది. ఈ చిత్రంలో మంచు విష్ణు ఓ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుండటం చిత్రానికి మరో హైలైట్. ఆయన సరసన శ్రియా జంటగా నటించారు. మదన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో నిఖిల విమల్, అనసూయ భరద్వాజ్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రానికి కథ, మాటలుః డైమండ్ రత్నబాబు, సంగీతంః ఎస్.ఎస్.తమన్, ఛాయాగ్రాహకుడుః సర్వేశ్ మురారి, ఎడిటర్ః ఎం.ఆర్.వర్మ, ఫైట్స్ః కనల్ కణ్ణన్, కొరియోగ్రఫీః ప్రేమ్‌రక్షిత్, గణేష్ ఆచార్య, ఆర్ట్ః చిన్న.

ఫిట్‌నెస్ సీక్రెట్ చెప్పిన తాప్సీ

నచ్చిన ఆహార పదార్థాలను శుభ్రంగా తినేయమని చెబుతోంది అందాల తార తాప్సీ. ఆవిధంగా తింటే లావై పోతారు కదా అని అంటే ఈ భామ ఏం చెబుతోందంటే... ''ఇష్టమైన ఫుడ్‌ను చూడగానే తినాలనిపిస్తే ఆలస్యం చేయకూడదు. నచ్చినవి తినేయాలి. కాకపోతే రోజులో కాస్త ఎక్కువ సమయాన్ని వ్యాయామం కోసం కేటాయించాలి'' అని తాప్సీ చెబుతోంది. తన ఫిట్‌నెస్ సీక్రెట్‌ని ఈ భామ వివరిస్తూ... ''నేను తెల్లవారుజామునే లేవను కాబట్టి మార్నింగ్ ఎక్సర్‌సైజులు నాకు సూట్ కావు. రెగ్యులర్‌గా జిమ్‌కు కూడా వెళ్లను. కానీ స్విమ్మింగ్ చేస్తాను. కొన్నేళ్ల ముందు వరకు నాకు స్విమ్మింగ్ కూడా రాదు. కానీ స్విమ్మింగ్ నేర్చుకున్న తర్వాత ఇప్పుడు ఎక్కువ సమయం నీళ్లలోనే గడుపుతున్నాను. చిన్నప్పుడు జిమ్నాస్టిక్స్ ప్రాక్టీస్ చేసేదాన్ని. ప్రస్తుతం డ్యాన్స్ చేస్తున్నాను. డ్యాన్స్ చేయడం వల్ల నాకు రెండు రకాల లాభాలున్నాయి. వ్యాయామం చేసినట్టు ఉంటుంది, ప్రాక్టీస్ చేసినట్టు కూడా ఉంటుంది. వీటన్నింటికీ తోడు నిద్ర లేవగానే గోరువెచ్చటి నీరు తాగుతాను. గ్రీన్ టీ తీసుకుంటాను. సలాడ్లు, ఉడకబెట్టిన కూరగాయల్ని తింటాను. మనసులో చికాకులు పెట్టుకోకుండా నిద్రపోతాను'' అని వివరించింది ఈ సుందరి.


తాప్సీ


వరుణ్‌తేజ్, రాశీఖన్నా

10న వస్తున్న 'తొలిప్రేమ'

సాయిధరమ్‌తేజ్ హీరోగా వి.వి.వినాయక్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'ఇంటిలిజెంట్'. వరుణ్‌తేజ్ హీరోగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో బివిఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన చిత్రం 'తొలిప్రేమ'. ఈ రెండు చిత్రాలు ఈనెల 9న విడుదలవుతాయని ముందుగా ప్రకటించారు. దీంతో మెగా అభిమానుల మధ్య చిన్నపాటి గందరగోళం ఏర్పడింది. దీన్ని దూరం చేయడానికి ఇరు చిత్రాల నిర్మాతలు చర్చించి 'తొలిప్రేమ' చిత్రాన్ని ఫిబ్రవరి 10న విడుదల చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన విలేకరుల సమావేశంలో దిల్‌రాజు మాట్లాడుతూ ''ఇంటిలిజెంట్, తొలిప్రేమ సినిమాలు ఒకే రోజున విడుదలవుతాయని తెలియగానే అందరిలో చిన్నపాటి గందరగోళం ఏర్పడింది. సినిమాను ఎంత కష్టపడి చేసినా... దాని ద్వారా రెవెన్యూ తీసుకురావడమే ముఖ్యం. ఈమధ్యన బాక్సాఫీస్ వద్ద పోటీ పడే సినిమాల సంఖ్య ఎక్కువైపోయాయి. దీంతో నిర్మాత బివిఎస్ఎన్ ప్రసాద్‌తో నేనే మాట్లాడి 'తొలిప్రేమ' చిత్రాన్ని ఈనెల 10న విడుదల చేద్దామని చెప్పాను. ఈ విషయాన్ని నిర్మాత సి.కళ్యాణ్‌కు చెప్పాం. ఇక 'ఇంటిలిజెంట్' ఈనెల 9న వస్తుంది'' అని అన్నారు. బి.వి.ఎస్.ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ ''తొలిప్రేమ చిత్రాన్ని ఈనెల 9న విడుదల చేస్తామని ముందుగా ప్రకటించాం. అందుకు కారణం ఈనెల 14న వాలెంటైన్స్ డే కావడం. అయితే 'ఇంటిలిజెంట్' సినిమా కూడా అదే రోజున వస్తుందని ప్రకటించారు. చిన్న కమ్యునికేషన్ గ్యాప్‌తో ఇలా జరిగింది. అయితే మెగా అభిమానుల మధ్య గందరగోళం ఏర్పడకూడదని మా 'తొలిప్రేమ' చిత్రాన్ని ఈనెల 10న విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నాం'' అని చెప్పారు.

పారా అథ్లెట్‌కు ఆర్థిక సాయం

ఓ పారా అథ్లెట్‌కు లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి తన మానవతా దృకృథాన్ని చాటుకున్నాడు యంగ్ హీరో సాయిధరమ్‌తేజ్. పూర్తి వివరాల్లోకి వెళ్తే.... సూర్యాపేట జిల్లాకు చెందిన రంగుల నరేష్ యాదవ్ దివ్యాంగుడు. అంతర్జాతీయ వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టుకు ఎంపికైనా అక్కడికి వెళ్లేందుకు డబ్బులు లేక పారా అథ్లెట్ నరేష్ అనేక ఇక్కట్లు పడుతున్నాడు. తాజాగా ఓ ప్రముఖ పత్రికలో అతని గురించి వచ్చిన కథనం చదివిన హీరో సాయిధరమ్‌తేజ్ వెంటనే స్పందించాడు. గురువారం నరేష్ యాదవ్‌కు లక్ష రూపాయల చెక్కును స్వయంగా అందజేశాడు. అనంతరం నరేష్ గురించిన వివరాలు, వాలీబాల్ ప్రాక్టీస్‌కు సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నాడు. వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌లో విజయం సాధించాలని నరేష్‌కు శుభాకాంక్షలు తెలిపాడు.


పారా అథ్లెట్ నరేష్ యాదవ్‌కు లక్ష రూపాయల చెక్కును అందజేస్తున్న సాయిధరమ్‌తేజ్


ఫిలిం ఛాంబర్ల సమావేశంలో మాట్లాడుతున్న డి. సురేశ్‌బాబు. చిత్రంలో పి.కిరణ్, శ్యాంప్రసాద్ రెడ్డి, కె.మురళీమోహన్ తదితరులు

డిజిటల్ ప్రొవైడర్ల సమస్యపై ఫిలిం ఛాంబర్ల సమావేశం

డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల గురించి చర్చించేందుకు తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అత్యవసరంగా సమావేశమైంది. హైదరాబాద్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు పి.కిరణ్, కార్యదర్శులు ఎం.రామదాసు, కె.శివప్రసాదరావు, తెలంగాణ రాష్ట్ర ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు కె.మురళీమోహన్, కార్యదర్శి సునీల్ నారంగ్, దక్షిణాది ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ఎల్.సురేష్, సంయుక్త కార్యదర్శి రవి కొట్టరాక, తమిళ సినిమా నిర్మాతల సంఘం అధ్యక్షుడు విశాల్ కృష్ణ, కర్నాటక ఫిలిం ఛాంబర్ కార్యదర్శి కె.ఎం.సురేష్, కేరళ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు కె.విజయ్ కుమార్, డి.సురేష్‌బాబు, శ్యాంప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు వసూలు చేస్తున్న ఛార్జీల గురించి అందరూ చర్చించారు. మన సినిమా ప్రతిఫలం మనం అందుకోకుండా ఎక్కడినుంచో వచ్చిన డిజిటల్ ప్రొవైడర్లు అన్యాయంగా దోచుకుంటున్నారని అందరూ అభిప్రాయపడ్డారు. ఈస్ట్ ఇండియా కంపెనీలా తయారై ఈ సర్వీస్ ప్రొవైడర్లు డబ్బు గుంజుతున్నారని అందరూ ఆరోపించారు. తక్కువ ధరకు వస్తున్న డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లను రాకుండా ఆపేస్తున్నారని అందరూ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సర్వీస్ ప్రొవైడర్ల వారితో వారంలోగా సమావేశం ఏర్పాటుచేసి ధరల తగ్గింపు, ఇతరత్రా విషయాలపై చర్చించేందుకు సమావేశంలో నిర్ణయించడం జరిగింది. ఈ వారంలోపున ఈ సమస్యకు పరిష్కారం లభించని పక్షంలో మార్చి 1 నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని థియేటర్లను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు.

అవన్నీ చూసుకొని ఓకె చెబుతా

''నా మనసు ఓకే చెబితేనే ఏ సినిమా అయినా చేసేందుకు ఒప్పుకుంటాను'' అని అంటోంది అందాల తార కాజల్ అగర్వాల్. ప్రస్తుతం వరుస విజయాలతో ఆమె టాప్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. మహేష్‌బాబు, పవన్‌కళ్యాణ్, ఎన్టీఆర్, రామ్‌చరణ్ వంటి స్టార్ల సినిమాలో నటించి హీరోయిన్‌గా తిరుగులేని క్రేజ్‌ను సంపాదించుకుంది. ఇక నటిగా తన సుదీర్ఘ పయనం గురించి కాజల్ మాట్లాడుతూ ''నటిగా నా వయసు దశాబ్దం దాటింది. ఇంత కాలం హీరోయిన్‌గా మనగలుగుతున్నానంటే కారణం అందుకు మంచి కథల ఎంపికే. నటిగా రంగ ప్రవేశం చేసిన తొలి రోజుల్లో వచ్చిన అవకాశాలన్నీ అంగీకరించేదాన్ని. అది ఒకరకంగా మంచి అనుభవాన్నే ఇచ్చింది. నాలో పరిణితి పెరిగింది. ఇప్పుడు మాత్రం మంచి కథలను ఎంపిక చేసుకొని సినిమాలు చేస్తున్నాను. దర్శకులు కథలు చెప్పినప్పుడు నా రోల్ బలమైనదా? అభిమానులకు నచ్చుతుందా? అందులో బాగా నటించగలనా? అని ఆలోచిస్తాను. చివరికి నా మనసు... మంచి కథే ఒప్పుకో అని చెబితే ఆ చిత్రాన్ని అంగీకరిస్తాను. అలా ఒప్పుకొని నటించిన మంచి కథలే నన్ను ఉన్నత స్థాయిలో నిలబెట్టాయి. ఇక్కడ నిత్యం భిన్న మనస్తత్వాల మనుషులు కలుస్తుంటారు. వారితో ఎలా ప్రవర్తించాలన్న పరిపక్వత నాలో పెరిగింది'' అని కాజల్ పేర్కొంది.


కాజల్



3.3 శాతం ద్రవ్య లోటు సాధించగల్గిందే..




ముంబై: వచ్చే ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటు అంచనా 3.3 శాతం సాధించగల్గినదేనని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ మూడీస్ పేర్కొంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ద్రవ్య లోటు అంచనాలను బడ్జెట్‌లో ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ సవరించారు. జిడిపి(స్థూల దేశీయోత్పత్తి)లో ద్రవ్య లోటు 3.3 శాతాన్ని 3.5 శాతానికి సవరించారు. 2019 ఆర్థిక సంవత్సరానికి గాను 3.3 శాతంగా అంచనా వేశారు. 'బడ్జెట్‌లో ప్రకటించిన ద్రవ్య లోటు అంచనాల మేరకు ఉంది. ద్రవ్యలోటు లక్ష్యాలు సాధించగల్గినవే' అని మూడీస్ వెల్లడించింది. నోట్ల రద్దు, జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) అమలు కారణంగా వృద్ధి రేటు మందగించింది. పన్నులు తగ్గుముఖం పట్టాయి. పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగడంతో పన్నులు పెరిగేందుకు అవకాశం ఏర్పడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో దేశీయ వృద్ధి రేటు 7.2 నుంచి 7.5 శాతంగా అంచనా అని ఆర్థికమంత్రి జైట్లీ బడ్జెట్‌లో పేర్కొన్నారు.

బడ్జెట్‌పై స్పందనలు

తెలుగు రాష్ట్రాలను విస్మరించారు : వాణిజ్యమండలి

మన తెలంగాణ / హైదరాబాద్ : పారిశ్రామికవర్గాలుపెట్టుకున్న ఆశల్ని కేంద్ర బడ్జెట్ నెరవేర్చలేకపోయిందని, ఎన్నికల బడ్జెట్‌గానే రూపొందించిందని తెలంగాణ, ఏపీ రాష్ట్రాల పారిశ్రామిక, ఆర్థిక, వాణిజ్య మండలి సమాఖ్య అధ్యక్షులు గౌరా శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు మేలు కలిగించేదిగా ఉన్నా పారిశ్రామికవర్గాన్ని మాత్రం విస్మరించినట్లుగా భావించక తప్పదన్నారు. వ్యవసాయం, విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి పారిశ్రామికరంగాన్ని మాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు.

లక్ష్యం నుంచి పారిపోతున్న ప్రభుత్వం : వైద్యులు



సార్వత్రిక ఆరోగ్య రక్షణ నినాదాన్ని నెత్తికెత్తుకున్న కేంద్ర ప్రభుత్వం ఆరోగ్య బీమా పేరుతో కొత్త హామీని ఇచ్చిందని, అంతిమంగా ఇది బీమా సంస్థలకు, ప్రైవేటు, కార్పొరేటు ఆసుపత్రకులకు ప్రయోజనం చేకూర్చేదేనని ఇండియన్ డాక్టర్స్ ఫర్ పీస్ అండ్ డెవలప్‌మెంట్ ఉపాధ్యక్షుడు డాక్టర్ అరుణ్ మిత్రా వ్యాఖ్యానించారు. ప్రజలకు నిజంగా వైద్య సేవలు అందించాలన్న ఉద్దేశం ఉన్నట్లయితే ప్రత్యక్షంగా ఇచ్చి ఉండాల్సిందని, దానికి బదులుగా ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో బీమా పథకాన్ని తీసుకురావడం అసలు లక్ష్యం నుంచి పారిపోవడమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రీయ స్వాస్థ్య బీమా యోజన ద్వారా ఈ సౌకర్యం అమలవుతున్నప్పటికీ కొత్తగా ఇప్పుడు బడ్జెట్‌లో ప్రస్తావించడం మభ్యపెట్టడమేనని వ్యాఖ్యానించారు.

బడ్జెట్ అద్భుతం : ఐసిఐసిఐ బ్యాంకు ఎండి చందా కొచ్చర్



సామాజిక, ఆరోగ్య, గ్రామీణ రంగాలకు తగిన ప్రాధాన్యత ఇచ్చిన ఈ బడ్జెట్ ఆదాయ వనరులను పెంపొందిస్తుందని ఐసిఐసిఐ బ్యాంకు ఎండి చందాకొచ్చర్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అతి గొప్పదైన జాతీయ ఆరోగ్య పరిరక్షణ పథకం ప్రకటించిందని పేర్కొన్నారు.ఆర్థిక వృద్ధి రేటు పెరగడానికి, సామాజిక స్వావలంబనకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

వ్యవసాయానుకూల బడ్జెట్ : ఎరువుల సంస్థ అధినేత



వ్యవసాయ రంగానికి ఊతమిచ్చేలా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పలు చర్యలు తీసుకోవడం ఆహ్వానించదగినదని, రైతులకు చాలా ప్రయోజనం ఉంటుందని దీపక్ ఫెర్టిలైజర్ పెట్రోకెమికల్స్ కార్పొరేషన్ అధ్యక్షులు అమితాబ్ భార్గవ వ్యాఖ్యానించారు. దేశంలోని వ్యవసాయ రంగం వృద్ధికి, మనుగడకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

ఆర్థికరంగంలో సమూల మార్పు : ఎస్‌బిఐ ఛైర్మన్



రైతులు, కౌలురైతులు, వయోవృద్ధులు, పేదలు.. ఇలా వివిధ సెక్షన్ల ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ బడ్జెట్ అనేక రంగాల్లో వృద్ధికి కారణమవుతుందని, విద్యారంగంలో భారీ మార్పులకు దోహదపడుతుందని, రానున్నా కాలంలో ఆర్థిక వృద్ధికి నాంది పలుకుతుందని ఎస్‌బిఐ ఛైర్మన్ రజనీష్ కుమార్ వ్యాఖ్యానించారు.

జౌళి రంగానికి మంచి రోజులు : 'ఫియో'



స్మార్ట్‌సిటీ, లఘు మధ్య తరహా పరిశ్రమలకు రాయితీలు, మహిళా ఉద్యోగులకు పిఎఫ్ రాయితీలు, వ్యవసాయ రంగంతో పాటు అనుబంధ రంగాలకు చేసిన కేటాయింపులు, జౌళి రంగానికి చేసిన కేటాయింపులు సమూల మార్పుకు దారితీస్తుందని కేంద్ర బడ్జెట్‌ను ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషనస్ దక్షిణ ప్రాంత చైర్మన్ శక్తివేల్ ప్రశంసించారు. గత బడ్జెట్‌తో పోలిస్తే ఈసారి జౌళి రంగానికి నిధుల కేటాయింపు పెరిగిందని, ఉత్పత్తులు కూడా ఎగుమతి కావడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	35906.66	-58.36	-0.16%
నిఫ్టీ	11016.90	-10.80	-0.10%

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	29000	31016.04	0.28%
ముంబై	29820	31893.05	0.13%
ఢిల్లీ	29200	31229.95	–0.34%
కోల్‌కతా	29830.99	31904.80	0%
కేరళ	28000	29946.52	0%
బెంగళూరు	28400	30374.33	0%
హైదరాబాద్	29000	31016.04	0.49%
గల్ఫ్	1430.55	1530.00	0.66%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	గురువారం	బుధవారం	మార్పు (%)
చెన్నై	42200.00	42000.00	0.48
ముంబై	42200.00	42000.00	0.48
ఢిల్లీ	42200.00	42000.00	0.48
కోల్‌కతా	42200.00	42000.00	0.48
హైదరాబాద్	42200.00	42000.00	0.48

'ఎల్‌టిసిజి' బాంబ్

- రూ. లక్ష దాటిన లాభాలపై 10 శాతం పన్ను
- 12 ఏళ్ల తర్వాత మళ్లీ ప్రతిపాదించిన ప్రభుత్వం





ముంబై: ఇన్వెస్టర్లు ఏదైతే వద్దనుకున్నారో అదే జరిగింది. ఈక్విటీలలో దీర్ఘకాలిక పెట్టుబడులపై పన్ను పడుద్ది అంటూ గత కొంతకాలంగా భయపెడుతున్న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ.. అన్నంత పని చేశారు. గురువారం కేంద్ర బడ్జెట్–2018లో ఎల్‌టిసిజి(లాంగ్ టర్మ్ క్యాపిటల్ గెయిన్) పన్నును మళ్లీ ప్రవేశపెట్టారు. ఈక్విటీ షేర్ల అమ్మకం నుంచి లాభాలు రూ.1 లక్షల దాటితే 10 శాతం ఎల్‌టిసిజి పన్నును ప్రతిపాదించారు. ఈమేరకు లోక్‌సభలో బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ ప్రకటించారు. 'షేర్ల విక్రయంతో లాభం రూ.1 లక్ష మించితే పది శాతం పన్ను విధించాం' అని జైట్లీ తెలిపారు. అయితే 2018 జనవరి 31వరకు అన్ని రకాల లాభాలపై ఎలాంటి పన్ను ఉండదని స్పష్టం చేశారు. స్వల్పకాలిక మూలధన లాభాలపై 15 శాతం పన్ను రేటులో ఎలాంటి మార్పు చేయలేదు. అయితే 2005 సంవత్సరంలో దీర్ఘకాలిక లాభాలపై పన్నును ప్రభుత్వం తొలగించింది. ప్రస్తుతం సెక్యూరిటీల లావాదేవీల ద్వారా పన్ను(ఎస్‌టిటి) ఆదాయం రూ. 9,000 కోట్లుమాత్రమే లభిస్తున్నట్లు వెల్లడించారు. కొత్త రూపంలో ప్రవేశపెట్టిన లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ అంశాన్ని జైట్లీ ఉదాహరణతో వివరించారు. ఇది స్టాక్‌మార్కెట్‌కు సంబంధించినది కావడంతో జైట్లీ ఎటువంటి అపోహలకు తావు లేకుండా వివరించారు. 2018 జనవరి 31కి ఆరు నెలల ముందు ఒక షేరును రూ. 100కు కొనుగోలు చేశారనుకుందాం. ఆ షేర్ ధర జనవరి 31న గరిష్ఠంగా రూ.120 మార్కును చేరింది. అంటే అప్పటికి వచ్చిన లాభం రూ. 20 అవుతుంది. ఈ మొత్తంపై ఎటువంటి క్యాపిటల్ గెయిన్స్ లేదు. అయితే జనవరి 31 తరవాత ఆ షేరు ధర రూ. 120 నుంచి రూ. 200 వెళ్లితే.. ఇప్పుడు వచ్చిన మొత్తం లాభం రూ. 100 అవుతుంది. కానీ ఇందులో జనవరి 31 తరవాత వచ్చిన లాభం రూ. 80 పైనే క్యాపిటల్ గెయిన్ పన్ను విధిస్తారు. అదీ షేరు కొన్న ఏడాది పూర్తయ్యాక (అంటే జులై 31) తరవాత విక్రయిస్తేనే ఇది వర్తిస్తుంది. డొల్ల కంపెనీల్లో పెట్టుబడులను నిరోధించి పన్ను ఆదాయం పెంచేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

ద్వితీయార్థంలో 7.5 శాతం వృద్ధి రేటు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో దేశీయ వృద్ధి రేటు 7.2 నుంచి 7.5 శాతం మధ్య ఉంటుందని అంచనా వేసినట్టు ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదుగుతోందని అన్నారు. తొలి మూడేళ్లలో ప్రభుత్వం సగటున 7.5 శాతంగా వృద్ధిని సాధించ, దేశీయ ఆర్థిక వ్యవస్థ రూ.2.5 లక్షల కోట్లుగా ఉంది. లోక్‌సభలో జైట్లీ మాట్లాడుతూ, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో భాగంగా వృద్ధి రేటు 7.5 శాతంగా అంచనా వేశామని అన్నారు. ఇప్పటికే భారత్ ప్రపంచంలోనే ఏడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందని, త్వరలో ఐదో ఆర్థిక వ్యవస్థగా దేశంగా వృద్ధిని సాధించనుందని జైట్లీ విశ్వాసం వ్యక్తం చేశారు. కేంద్ర గణాంకాల శాఖ(సిఎస్‌ఒ) అంచనా ప్రకారం, మార్చి 31 ముగింపునాటి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ వృద్ధి 6.5 శాతంగా ఉండనుందని అంచనా.. 2018–19 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 7 నుంచి 7.5 శాతంగా ఉంటుందని మూడు రోజుల ముందు ఆర్థిక సర్వే పేర్కొంది. 2017–18 తొలి త్రైమాసికంలో జిడిపి(స్థూల దేశీయోత్పత్తి) 5.7 శాతంగా.. అంటే మూడేళ్ల కనిష్ఠానికి పడిపోయింది. రెండో త్రైమాసికంలో పుంజుకుని 6.3 శాతానికి చేరుకుంది.

ఎఫ్ఎంసిజికే సానుకూలం

బడ్జెట్‌లో ఎఫ్ఎంసిజి రంగానికి సానుకూలంగా ఉంది. గ్రామీణాభివృద్ధి, మౌలికసదుపాయాలపై బడ్జెట్ దృష్టితో ఎఫ్ఎంసిజికి ఎక్కువ బూస్ట్ లభించిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలపై దృష్టిపెట్టి, లాభపడుతున్న కన్స్యూమర్, ఎఫ్ఎంసిజి కంపెనీలు ప్రస్తుత బడ్జెట్‌తో మరింత భారీగా లాభపడనున్నాయి.



భారీ నష్టాల నుంచి కోలుకున్న మార్కెట్లు

దీర్ఘకాలిక పెట్టుబడులపై పన్ను ప్రతిపాదనతో ఈక్విటీ మార్కెట్లు నిరాశ చెందాయి. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌లో ఎల్‌టిసిజి పన్ను ప్రతిపాదించడంతో మార్కెట్లు ఖంగుతిన్నాయి. ఓ దశలో సెన్సెక్స్ 400 పాయింట్ల వరకు నష్టపోయింది. తొలుత లాభాలతో జోష్‌గా సాగిన సూచీలు దీర్ఘకాలిక లాభాలపై పన్నుతో తీవ్ర నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తర్వాత తేరుకుని స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఈక్విటీలలో దీర్ఘకాలిక పెట్టుబడులపై రూ. లక్షకు మించి ఆర్జించిన పక్షంలో 10 శాతం ఆదాయపన్ను చెల్లించాల్సి ఉంటుందని బడ్జెట్‌లో జైట్లీ స్పష్టం చేశారు. సెన్సెక్స్ 58 పాయింట్ల నష్టంలో 35,906 వద్ద ముగిసింది. నిఫ్టీ11 పాయింట్ల నష్టంతో 11,016 వద్ద స్థిరపడింది. నిఫ్టీ బ్యాంకు ఇండెక్స్ కూడా 159 పాయింట్లు పడిపోగా, నిఫ్టీ ఐటీ కూడా నష్టాలను చూసింది. ప్రధానంగా ఎం అండ్ ఎం, ఐషర్ మోటార్స్, లార్సెన్, ఇండస్‌ఇండ్ బ్యాంకు లాభపడ్డాయి. ఇక ఒఎన్‌జిసి, సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్ నష్టపోయాయి.

యథాతథంగా పన్ను శ్లాబ్‌లు

వేతన ఉద్యోగులకు స్టాండర్డ్ డిడక్షన్‌గా రూ.40 వేలు



న్యూఢిల్లీ: దేశంలోని వేతన జీవులకు ఈ బడ్జెట్ తీవ్ర నిరాశను కల్గించింది. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిని పెంచవచ్చనే ఆశలు అడియాసలు చేసింది. బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ.. వ్యక్తిగత ఆదాయ పన్ను పరిమితిలో ఎలాంటి మార్పు చేయలేదు. 'గత మూడేళ్లలో వేతన తరగతికి ప్రభుత్వం చాలా వరకు పన్ను ఉపశమనాన్ని ఇచ్చింది. ఈసారి ఆదాయ పన్నును యథాతథంగా కొనసాగించాను' అని మంత్రి అన్నారు.

వేతన ఉద్యోగులకు రవాణా, వైద్య రియింబర్స్‌మెంట్ కోసం వార్షికంగా రూ.40 వేల విలువ స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. సామాన్య మానవుడికి పన్ను విషయంలో ఎలాంటి భరోసా ఇవ్వలేదు. పన్ను మినహాయింపు ఇవ్వకపోవడంలో ద్రవ్య లోటు, చమురు ధరలు ప్రతిబంధకంగా మారాయని నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. గత బడ్జెట్‌లో జైట్లీ ఆదాయం పన్ను రేటు తగ్గింపు 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. వార్షికంగా రూ. 2.5 లక్షల నుంచి రూ.5 లక్షల మధ్య ఈ తగ్గింపును ప్రకటించిన విషయం తెలిసిందే.వేతన జీవులకు 2006–07 సంవత్సరం నుంచి స్టాండర్డ్ డిడక్షన్ ఆపేశారు. తాజాగా దీని కొనసాగింపు ఉద్యోగులకు చాలా స్వల్ప ప్రయోజనాన్ని కల్గిస్తుందని నిపుణులు అంటున్నారు. వేతన జీవులతో పోలిస్తే వ్యక్తిగత వ్యాపారవేత్తలు మెరుగైన ఆదాయాన్ని పొందుతున్నారని జైట్లీ గుర్తుచేశారు. 2017–18 సంవత్సరం ప్రత్యక్ష పన్ను వసూళ్లు 12.6 శాతం పెరిగాయని, పరోక్ష పన్ను వసూళ్లు 18.7 శాతం పెరిగాయని జైట్లీ తెలిపారు. పన్ను పరిధిలోకి కొత్తగా చాలామంది వచ్చి చేరినా.. టర్నోవర్ ఆశించినంతగా లేదని ఆయన అన్నారు.

వృద్ధుల డిపాజిట్లపై రూ.50 వేల వరకు పన్ను మినహాయింపు

సీనియర్ సిటిజన్స్‌కు ఫిక్సెడ్ డిపాజిట్లపై పొందే వడ్డీ రూ.50 వేల వరకు టిడిఎస్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇంతకుముందు రూ.10 వేలు మాత్రమే ఉంది. సీనియర్ సిటిజన్ల వైద్య బీమాకు రూ.50 వేల వరకు మినహాయింపును ప్రకటించారు.

కార్పొరేట్ పన్ను ఊరట

రూ.250 కోట్ల టర్నోవర్‌ను కల్గివున్న కంపెనీలకు కార్పొరేట్ పన్ను 25 శాతానికి తగ్గించారు.

క్రిప్టోకరెన్సీ చట్టబద్ధం కాదు

వీటి వినియోగం నియంత్రణకు చర్యలు: జైట్లీ



న్యూఢిల్లీ: బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలు దేశంలో వ్యాపించినా ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన నిర్ణయం తీసుకోలేదు. అటు ఆర్‌బిఐ, ఇటు ప్రభుత్వం రెండూ కూడా క్రిప్టోకరెన్సీతో జాగ్రత్త.. లావాదేవీలు నిర్వహించవద్దని హెచ్చరిస్తూనే ఉన్నాయి. అయినప్పటికీ వీటి ట్రేడింగ్ మాత్రం ఆగలేదు. ఇక ప్రభుత్వమే దిగివచ్చింది. బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ.. క్రిప్టోకరెన్సీ చట్టబద్ధం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం క్రిప్టో కరెన్సీల వినియోగాన్ని ఏమాత్రం అంగీకరించదని అన్నారు. వీటి వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టనుందని అన్నారు. దీంతో బిట్‌కాయిన్ల వినియోగంపై నిషేధం విధించినట్లయింది. అదే సమయంలో డిజిటల్ పేమెంట్లకు మాత్రం బ్లాక్ చెయిన్ టెక్నాలజీని ఉపయోగించుకుంటామని ఆర్థిక మంత్రి తెలిపారు. వర్చువల్ కరెన్సీ గురించి జైట్లీ గతేడాది జరిగిన పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రస్తావించారు. భారత్‌లో క్రిప్టో కరెన్సీ చెల్లుబాటు అవుతుందని చెప్పేందుకు ఎలాంటి చట్టాలు లేవు, ఇందుకోసం ఆర్‌బిఐ ఏ కంపెనీలకు లైసెన్సులు ఇవ్వలేదని పేర్కొన్నారు. తాజాగా బడ్జెట్ ప్రసంగంలో దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. దేశంలో బిట్‌కాయిన్ల ట్రేడింగ్ విపరీతంగా పెరిగిపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుందని గమనించిన ఆదాయం పన్ను శాఖ అనేకమంది నోటీసులు కూడా జారీ చేసింది. బిట్‌కాయిన్ల కొనుగోళ్లకు ప్రత్యేక ట్రేడర్లు తయారయ్యారు. బిట్‌కాయిన్లను కొనుగోలు చేస్తే రోజుల్లో కుబేరులైపోవచ్చు అనే భ్రమలను ఈ ట్రేడర్లు కల్పిస్తున్నారు. ఏడాది కాలంలోనే భారత్‌లో బిట్‌కాయిన్ల మార్కెట్ 2,000 రెట్లు పెరగ్గా, దీంతో దండిగా డబ్బులు ఆర్జించిన వారు కూడా ఉన్నారు. క్రిప్టో కరెన్సీ మార్కెట్ ఒక్కసారిగా కుప్పకూలితే పెట్టుబడి దారులు విపరీతంగా నష్టపోయే ప్రమాదముంది. ఐటీశాఖ దాదాపు 5లక్షల బిట్‌కాయిన్ కొనుగోలుదార్లను గుర్తించి నోటీసులు జారీ చేసింది.

- **వర్చువల్ కరెన్సీలకు దేశంలో ఎలాంటి చట్టాలు లేవు, వీటి లావాదేవీలకు ఆర్‌బిఐ అనుమతి కూడా లేదు.**
- **క్రిప్టో కరెన్సీ వాడకం పెరగడం ప్రభుత్వానికి సమస్యగా మారింది. రెగ్యులేటరీ సవాళ్లు తలెత్తాయి.**
- **ఆర్థిక వ్యవహారాల శాఖ(డిఇఎ) ఒక కమిటీని ఏర్పాటు చేసింది. డిఇ ఎ, ఆర్థిక సేవల శాఖ(డిఎఫ్ఎస్), హోం మంత్రిత్వశాఖ, ఆర్‌బిఐ, నీతి ఆయో గ్, ఎస్‌బిఐల నుంచి ప్రతినిధులతో కమిటీని ఏర్పాటు చేయగా, ఈ కమిటీ నివేదికను సమర్పించనుంది.**

హెల్త్ ఇన్సూరెన్స్ స్వాగతించదగింది



బ్యాంకింగ్ సేవల విస్తరణ, సులభతర రుణ ప్రక్రియ, జాతీయ ఆరోగ్య సంరక్షణ పథకం కింద హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజ్‌ను పెంచేందుకు బడ్జెట్‌లో తీసుకున్న నిర్ణయాలు స్వాగతించదగినవి. ప్రజలకు ఇంటర్నెట్, టెక్నాలజీ సేవలను అందించేందుకు వైఫై స్పాట్‌లతో పాటు మౌలికసదుపాయాల పెంపు బాగున్నాయి. వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి, డిజిటైజేషన్ రైతులను అధికారిక ఆర్థిక వ్యవస్థలోకి తీసుకెళ్లనున్నాయి.

–పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ ఎండి, సిఇఒ రేణు సత్తి


కార్పొరేట్ పన్ను తగ్గింపు సానుకూలం



కంపెనీలకు రూ.250 కోట్ల టర్నోవర్ వరకు కార్పొరేట్ పన్ను 25 శాతానికి తగ్గించడం సానుకూల చర్య. ఆన్‌లైన్ రుణాల ప్రోత్సహం దిశగా ప్రభుత్వం చర్యలు బాగనున్నాయి.

– ఇండియామార్ట్.కామ్ వ్యవస్థాపకుడు, సిఇఒ దినేష్ అగర్వాల్

రైతు ఆదాయం పెంచడంపై దృష్టి



గ్రామీణాభివృద్ధి, రైతుల ఆదాయం పెంచడంపై బడ్జెట్ దృష్టి పెట్టింది. గ్రామాల్లో మౌలిక సదుపాయాల పెంపు, ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీ వృద్ధి కోసం చర్యలు వంటివి బాగున్నాయి. యువ, కొత్త వ్యాపారులకు ముద్ర సులభంగా ముద్రా రుణాలు ఉత్తమం.

–హిమాలయ ఫుడ్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు మన్ మోహన్ మాలిక్

మళ్లీ స్టాండర్డ్ డిడక్షన్



స్టాండర్డ్ డిడక్షన్ మళ్లీ పరిచయం చేశారు. వేతన ఉద్యోగులకు రవాణా, వైద్య రీయింబర్స్‌మెంట్ కోసం వార్షికంగా రూ.40 వేల విలువ స్టాండర్డ్ డిడక్షన్‌ను ప్రభు త్వం ప్రవేశపెట్టింది. చిన్న వ్యాపారులకు కా ర్పొరేట్ టాక్స్ 25 శాతానికి తగ్గించారు.

– క్లియర్ టాక్స్ సిఇఒ అర్చితా గుప్తా

ఆరోగ్య భద్రతా పథకం భేష్



విద్యా, వైద్యం, ఆరోగ్యం రంగాల్లో చెప్పుకోదగ్గ రీతిలో కేటాయింపులు ఉన్నాయి. ముఖ్యంగా జాతీయ ఆరోగ్య భద్రతా పథకం భేష్. ఈ పథకం ద్వారా దేశంలో 10 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. ఇదో పెద్ద ముందడుగు. అదే విధంగా ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంచడం సంతోషాన్నిస్తుంది. ఇది రైతాంగాన్ని మరింత బలోపేతం చేస్తుందనడంలో సందేహం లేదు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వానికి అభినందనలు తెలియజేస్తున్నా. ఆర్థిక మంత్రి జైట్లీకి కృతజ్ఞతలు.

– నితీశ్ కుమార్, బీహార్ సిఎం

నిరాశ పరిచింది



కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎలాంటి ప్రత్యేకత లేదు. చాలా నిరాశగా ఉంది. రెవిన్యూ లోటు, అమరావతికి నిధులు వంటి అంశాల ప్రస్తావన లేకపోవడం విచారకరం. పోలవరం ప్రాజెక్ట్‌కి నిధుల సమీకరణ నాబార్డు ద్వారా ఏర్పాటు చేశారు. విజయవాడ, విశాఖపట్నం నగరాలకు మెట్రో ప్రస్తావన లేదు. రైల్వే జోన్ గురించి చెప్పక్కర్లేదు. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి ఇంకా ఒత్తిడి చేయాల్సి బాధ్యత మాపై ఉంది.


–సుజనా చౌదరి, కేంద్ర మంత్రి

బడ్జెట్ 2018

ఓటు బడ్జెట్

ఆదాయం పన్ను రేట్లు, శ్లాబులు యథాతథం

పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టిన జైట్లీ



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల ముందు తన ప్రస్తుత హయాంలో ఆఖరిదయిన పూర్తి స్థాయి బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, గ్రామీణ వ్యవస్థకు ఊతం ఇచ్చే అనేక చర్యలను ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ గురువారం నాడు ప్రకటించారు. పేదలకు కొత్త ఆరోగ్య బీమా పథకాన్ని, వేతన జీవులకు – సీనియర్ సిటిజన్లకు ఆదాయం పన్ను ఊరట చర్యలను కూడా ప్రకటించారు. లోక్‌సభలో అరుణ్ జైట్లీ తన ఐదవ పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఆరోగ్యం, విద్య సుంకాన్ని జైట్లీ పెంచారు. పన్ను విధించదగ్గ అన్ని ఆదాయాలపై ఆ సుంకాన్ని 3 శాతం నుంచి 4 శాతానికి పెంచారు. సాంఘిక సంక్షేమ పథకాలకు నిధులు కల్పన కోసం 10 శాతం సామాజిక సంక్షేమ సర్‌చార్జిని ప్రవేశపెట్టారు. చిన్న, మధ్య తరహా సూక్ష్మ వ్యాపార సంస్థలకు కార్పొరేట్ పన్నును ఆయన తగ్గించారు. రూ. 250 కోట్ల లావాదేవీలు గల సంస్థలపై కార్పొరేట్ సుంకాన్ని 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించారు. వాటాపెట్టుబడుల అమ్మకం ద్వారా సేకరించే రూ. ఒక లక్ష దీర్ఘకాల కేపిటల్ గెయిన్స్‌పై 10 శాతం పన్నును తిరిగి ప్రవేశపెట్టారు. అయితే 31 దాకా జరిగిన లావాదేవీలపై ఈ పన్ను ఉండదు. ఆదాయం పన్ను రేట్లను, శ్లాబులను మార్చకుండా యథాతథంగా ఉంచేశారు. వేతనాలు పొందే ఉద్యోగులకు, పెన్షనర్లకు రూ. 40,000 స్టాండర్డ్ డిడక్షన్ (ప్రామాణిక జీతం కోత) ప్రవేశపెట్టారు. రవాణా, వైద్య ఖర్చుల స్థానే ఇది అమలవుతుంది. సీనియర్ సిటిజన్‌లకు బ్యాంకు డిపాజిట్లపై వడ్డీల ఆదాయంలో పన్ను మినహాయింపును ప్రస్తుతం గల రూ. 10,000 నుంచి రూ. 50,000 పెంచారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 'ఎట్ సోర్స్' పన్ను కోత ఉండదని ప్రకటించారు. అలాగే కీలక వ్యాధులకు వైద్య చికిత్సలో పన్ను మినహాయింపు మొత్తాన్ని రూ. లక్ష రూపాయలకు పెంచినట్లు 110 నిమిషాల బడ్జెట్ ప్రసంగంలో జైట్లీ తెలిపారు. ఈక్విటీ లక్ష్యంగాగల మ్యూచువల్ ఫండ్స్ పంపిణీ ఆదాయంపై 10 శాతం పన్నును ఈ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. ఎక్సైజ్ సుంకం, సేవల సుంకం జిఎస్‌టిలో కలిపివేసి నందున కేవలం కస్టమ్స్ సుంకం విషయంలోనే జైట్లీ మార్పులు చేశారు.

పేదలకు కొత్త ఆరోగ్య పథకం

సార్వజనీన ఆరోగ్య సంరక్షణ కల్పించడానికి 'జాతీయ ఆరోగ్య రక్షణ పథకం' ను ఆర్థిక మంత్రి ప్రకటించారు. 10 కోట్ల పేద కుటుంబాలలో ఏడాదికి ప్రతి ఒక్క కుటుంబానికి రూ. 5 లక్షల ఆరోగ్య ఖర్చులు ఈ పథకం కింద కవర్ చేస్తారు. అయితే ఈ పథకానికి నిధుల కోసం ఆర్థిక స్థిరీకరణ మార్గ పటాన్ని ఆయన రూపొందించారు. దీని కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిడిపిలో ద్రవ్యలోటును ఇంతకు ముందున్న 3.2 శాతం లక్ష్యానికి మించి 3.5 శాతానికి విస్తరిస్తారు. ఆర్థిక సంవత్సరం 2019లో 3.3 శాతం చేస్తారు. ఇంతకు ముందు 2019కి 3 శాతం లక్ష్యంగా పెట్టుకున్నారు. 2016 – 17లో ద్రవ్యలోటు జిడిపిలో 3.5 శాతం ఉంది. రాజకీయ మూల్యం పట్టించుకోకుండా తాము చిత్తశుద్ధితో కృషి చేశామని జైట్లీ చెప్పుకున్నారు. రూ. 100 కోట్ల లావాదేవీలు జరిపే వ్యవసాయ సంస్థలకు నూటికి నూరు శాతం పన్ను మినహాయింపును జైట్లీ ప్రకటించారు. ప్రతిపాదించిన 'స్టాండర్డ్ డిడక్షన్'ను 2.5 కోట్ల మంది జనాభాకు అందిస్తారు. పేదలకు ఉచిత ఎల్‌పిజి కనెక్షన్ కల్పించే లక్ష్యాన్ని 8 కోట్ల మందికి పెంచారు. ఇంతకు ముందు 5– 4 కోట్ల మందికే దీనిని ఉద్దేశించారు. రాష్ట్రపతి జీతభత్యాలను నెలకు రూ. 5 లక్షలకు పెంచారు. అలాగే ఉపరాష్ట్రపతి జీతభత్యాలను రూ. 4 లక్షలకు, గవర్నర్ల జీతభత్యాలను రూ. 3.5 లక్షలకు పెంచారు.


ఎంపిలకు ఆటోమేటిక్ వేతన పెంపు

పార్లమెంట్ సభ్యులకు ద్రవ్యోల్బణం ఆధారంగా ప్రతి ఐదేళ్లకు ఒకసారి జీతభత్యాలు ఆటోమేటిక్‌గా పెరిగే కొత్త నియమాన్ని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం దృష్టి వ్యవసాయ రంగం, మౌలిక సౌకర్యాలు, విద్యా రంగంపై ఉన్నట్లు జైట్లీ స్పష్టం చేశారు. ప్రీ నర్సరీ నుంచి 12 తరగతి దాకా సమగ్రంగా విద్య గరపాలని నిర్ణయించారు. బ్లాక్ బోర్డుల స్థానే డిజిటల్ బోర్డులు ప్రవేశపెడతామని చెప్పారు. రైతులకు అధిక ఆదాయం లభింపచేయడంపై ప్రాధాన్యత ఉండగలదని ఆయన చెప్పారు. రైతులు మరింతగా ఉత్పత్తి చేసి, హెచ్చు ధరలు పొందాలన్నది ప్రభుత్వ అభిమతమని వివరించారు. ఈ ఏడాది పంటల ఉత్పత్తిలో రికార్డు స్థాపించామని చెప్పారు. రైతులకు పంట ఉత్పత్తి ఖర్చులు మించి 50 శాతం ముట్టజెప్పాలని ప్రభుత్వం ప్రతిన గైకొన్నట్లు జైట్లీ తెలిపారు. ఎన్‌డిఏ ప్రభుత్వం పగ్గాలు చేపట్టినప్పుడు ప్రపంచంలోని 5 అత్యంత బలహీన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటని, మోడీ ఆ స్థాయి నుంచి ఆర్థిక వ్యవస్థను ఉరకలు పెట్టించారని వివరించారు. ఈనాడు భారత్ అత్యంత వేగంగా దూసుకుపోతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని చెప్పారు.


భారత దేశ ఆర్థిక వ్యవస్థ నేడు 2.5 ట్రిలియన్ డాలర్ల విలువ సంతరించుకొని ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 5వదిగా భాసిల్లుతున్నట్లు జైట్లీ వివరించారు. ఎగుమతుల వృద్ధి 15 శాతం అందుకోనున్నట్లు చెప్పారు. అక్టోబర్ – మార్చి రెండో అర్ధభాగంలో వృద్ధి 7.2 – 7.5 శాతం అందుకొని మొత్తం 8 శాతం వృద్ధి దిశగా ఉరకలు వేస్తుందని అంచనా ప్రకటించారు. ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతంలో వాతావరణ కాలుష్యం ఆందోళనకర స్థాయికి పెరిగిందని ఆర్థిక మంత్రి వ్యాకులత ప్రకటించారు. హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ ఎన్‌సిటిలలో రాష్ట్ర ప్రభుత్వాల కృషికి మద్దతుగా కేంద్రం ప్రత్యేక పథకాన్ని ఈ విషయంలో అమలు చేస్తుందని తెలిపారు. క్షయ వ్యాధి

పెద్ద ఆర్థిక వ్యవస్థలలో 5వ స్థానం

గ్రస్థులకు పౌష్టికాహారం కల్పించడానికి రూ. 600 కోట్ల కేటాయింపును జైట్లీ ప్రకటించారు. ప్రభుత్వం సార్వజనీన ఆరోగ్య కార్యక్రమాల వర్తింపు దిశగా అడుగులు వేస్తోందని ఆరోగ్యం, విద్య, సామాజిక భద్రతకు కేటాయింపును రూ. 1.38 లక్షల కోట్లకు 2018– 19 కి పెంచినట్లు ప్రకటించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ మొత్తం రూ. 1.22 లక్షల కోట్లు. ముద్రా పథకం కింద రూ. 4.6 లక్షల కోట్లను మంజూరు చేసినట్లు చెప్పారు. చిన్న తరహా సంస్థలలో ఎన్‌పిఎ (మొండి బకాయిలు) సమస్యను పరిష్కరించడానికి త్వరలో ఒక పథకాన్ని ప్రకటించనున్నట్లు తెలిపారు. నోట్ల రద్దు , జిఎస్‌టి తర్వాత పై పేర్కొన్న చిన్న తరహా సంస్థల క్రమబద్ధీకరణ జరుగుతున్నట్లు చెప్పారు. ముద్రా పథకం కింద రుణాల మంజూరుకు రూ. 3 లక్షల కోట్లను లక్ష్యంగా పెట్టుకొన్నట్లు చెప్పారు. ఇపిఎఫ్‌లో చేరిన కొత్త సిబ్బందికి అన్ని రంగాలకు కలిపి వచ్చే మూడేళ్లపాటు 12 శాతం వేతనాలను ప్రభుత్వం అందిస్తుందని వివరించారు. మౌలిక సౌకర్యాల నిర్మాణానికి రూ. 50 లక్షల కోట్లు అవసరమని జైట్లీ చెప్పారు.



ఢిల్లీకి రూ.790 కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం 2018–19 బడ్జెట్‌లో దేశ రాజధాని ఢిల్లీకి రూ.790 కోట్లను కేటాయించింది. కేటాయింపులు పెంచాలని ఆప్ ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నప్పటికీ ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఢిల్లీ ప్రభుత్వానికి రూ.449.99 కోట్లను కేంద్ర సాయంగా అందించనున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైటీ ప్రకటించారు. గతంలో కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ ప్రభుత్వానికి రూ.757.99 కోట్లను కేటాయించగా, రూ.412.98 కోట్లను సాయంగా అందించింది. కాగా, 2018–19 బడ్జెట్‌లో 1984 అల్లర్ల బాధితులకు పెంచిన పరిహారంగా రూ.10 కోట్లను కేటాయించింది. అయితే 2017–18 బడ్జెట్‌లో రూ.15 కోట్లు కావడం గమనార్హం. ఇదిలావుండగా, ఢిల్లీ విపత్తు స్పందన నిధి కింద గతంలో మాదిరిగానే రూ.5 కోట్ల కేటాయింపులతోనే సరిపుచ్చింది.

మహిళలకు కొత్త తాయిలాలు



న్యూఢిల్లీ : కేంద్ర బడ్జెట్‌లో మహిళలకు ఆనందాన్ని కలిగించే అంశాలు కొన్ని ఉన్నాయి. గ్రామీణ, పట్టణ, పేద, ఉద్యోగులు... ఇలా అన్ని రంగాల్లోని మహిళలకు మేలు చేసే అంశాలు కొన్ని ఇందులో కనిపిస్తున్నాయి. 76 శాతం మహిళలకు ఉన్న బ్యాంకు ఖాతాల్లో 50 శాతం ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన వారే ఉన్నారు. ఈ తరుణంలో ముద్రా యోజన క్రింద రూ.3 లక్షల కోట్ల రుణాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త వెంచర్లు ఏర్పాటు చేయాలనుకునే మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందవచ్చు. మహిళా స్వయం సహాయ బృందాలకు ఇచ్చే రుణాలను 37 శాతానికి పెంచారు. ఉద్యోగుల భవిష్య నిధికి అన్ని రంగాల్లో ఉద్యోగులకు వారి వేతనంపై 12 శాతం ప్రభుత్వం జమచేస్తుంది. రానున్న మూడేళ్ళకు ఇది వర్తిస్తుంది. దీంతో ఉద్యోగినులు చెల్లించవలసిన సొమ్ము తమ వేతనంపై 12 శాతం నుంచి 8 శాతానికి తగ్గింది. ఉద్యోగుల భవిష్య నిధికి మహిళల కంట్రిబ్యూషన్ తగ్గడంతో యజమానులు మహిళలను నియమించుకోవడం పెరుగుతుంది. ఉజ్వల యోజన క్రింద ప్రస్తుతం 5 కోట్ల వంట గ్యాస్ కనెక్షన్ల ను ఉచితంగా ఇస్తున్నారు. తాజా బడ్జెట్‌లో దీని పరిమితిని 8 కోట్లకు పెంచారు

సీనియర్ సిటిజన్లకు వరాలు

న్యూఢిల్లీ : సీనియర్ సిటిజన్లకు వడ్డీ ద్వారా వచ్చే ఆదాయంపై పన్ను మినహాయింపు పరిధిని ఏడాదికి రూ.50వేలకు పెంచుతున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. అదేవిధంగా సెక్షన్ 80డి కింద బీమా ప్రీమియం, వైద్య ఖర్చుల పరిధిని రూ.50 వేల నుంచి రూ.30 వేలకు తగ్గిస్తున్నట్టు ప్రకటించారు. సీనియర్ సిటిజన్లంతా ఏడాదికి రూ.50వేల వరకు ఏదైనా ఆరోగ్య బీమా ప్రీమియం లేదా సాధారణ వైద్య ఖర్చుల ప్రయోజనాలను పొందేందుకు క్లెయిమ్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. సీనియర్ సిటిజన్‌ల అందరి కోసం విషమ పరిస్థితుల్లో వైద్య ఖర్చుల పరిధిని తగ్గింపు కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు మరింతగా పెంచినట్టు ఆయన వెల్లడించారు. అలాగే, మార్చి 2020 వరకు ప్రధాన్ మంత్రి వయా వందన యోజన పథకాన్ని కూడా వర్తింపజేయనున్నట్టు తెలిపారు.




పల్లెకు ప్రాధాన్యత

గ్రామీణాభివృద్ధికి రూ.14.34 లక్షల కోట్లు



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ఈ ఏడాది రూ.14.34 లక్షల కోట్లను వెచ్చించనుంది. ఈ మేరకు గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులు జరిపింది. ఈ నిధులతో 2018–19 సంవత్సరంలో 321 కోట్ల ఉపాధి దినాలను కల్పించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేయనుంది. ఈ నిధులతో కల్పించే ఉపాధి పనిదినాలతో 3.17 లక్షల కిలోమీటర్ల రహదారులు, 51 లక్షల కొత్త ఇళ్లు, 1.88 కోట్ల మూత్రశాలలు, 1.75 కోట్ల కొత్త ఆవాసాలకు విద్యుత్ కనెక్షన్లు వంటి పనులు చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ తెలిపారు. దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు ఇతర రంగాలైన వ్యవసాయం, గ్రామీణ అభివృద్ధి వంటి వాటికి ప్రభుత్వం ప్రాధాన్యతను ఇచ్చి ఈ బడ్జెట్‌ను రూపొందించిందని ఆయన వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధిని పూర్తి స్థాయిలో కల్పించేందుకు వచ్చే ఏడాది ప్రభుత్వం మరింత ప్రాధాన్యతను ఇస్తుందని అన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్‌ఆర్‌ఎల్‌ఎం)కు ఈ ఏడాది రూ.5750 కోట్లు కేటాయించినట్టు వెల్లడించారు. అయితే, గత ఏడాది రూ.4500 కోట్లు మాత్రమే కేటాయించినట్టు చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు (ఎస్‌హెచ్‌జి) వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.75వేల కోట్ల రుణాలను అందజేయనున్నట్టు జైట్లీ తెలిపారు.



రక్షణకు రవ్వంత

గత ఏడాది కంటే స్వల్పంగా కేటాయింపులు పెంపుదల



న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగానికి రూ.2.95 లక్షల కోట్ల కేటాయింపులు జరిపింది. గత బడ్జెట్ 2.74 లక్షల కోట్ల కంటే ఈసారి 7.81 శాతం ఎక్కువ. పాకిస్థాన్, చైనాల నుంచి సరిహద్దుల్లో సవాళ్లు ఎదురవుతున్న నేపథ్యంలో రక్షణ రంగానికి ఈసారి బడ్జెట్‌లో కేటాయింపులు ఎక్కువగా ఉంటాయన్న అంచనాలను ప్రభుత్వం నిజం చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు, ఎంఎస్‌ఎంఇలతో కలిసి దేశీయ రక్షణ రంగాన్ని ప్రోత్సహించేందుకుగాను ప్రభుత్వం రెండు రక్షణ రంగ ఉత్పాదక కారిడార్లను ఏర్పాటు చేయబోతుందని, పరిశ్రమమైత్రి మిలటరీ ఉద్పాదక విధానాన్ని తీసుకురాబోతోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ చెప్పారు. ఈ రంగానికి ఇప్పుడు ప్రభుత్వం కేటాయించిన మొత్తం రూ. 2,95,511 కోట్లలో రూ.99,947 కోట్లు కొత్త ఆయుధాలు, విమానాలు, యుద్ధనౌకలు, ఇతర మిలటరీ హార్డ్‌వేర్ కొనుగోలుకు నిర్దేశించారు. జిడిపి 1.58 శాతంపై అంచనాతో, మొత్తం బడ్జెట్ 24,42,213 కోట్లలో 12.10 శాతంగా ఈ కేటాయింపు జరిపారు. భారత సరిహద్దుల్లో ఉత్తరాదిన చైనా, పశ్చిమాన పాకిస్థాన్‌ల దాడులు ఎక్కువైన నేపథ్యంలో భారత సాయుధ దళాలను మరింత ఆధునీకరించేందుకు ఈ కేటాయింపులు సరిపోవని మిలటరీ నిపుణులు పేర్కొంటున్నారు. 'ఈ కేటాయింపులు సైన్యాన్ని ఆధునీకరించేందుకు సరిపోవు. అంచనాలు చాలా ఉన్నాయి, వాటిని ఈ కేటాయింపులు అందుకోలేకపోయాయి' అని ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిఫెన్స్ స్టడీస్ అండ్ అనాలిసిస్‌కు చెందిన డా.లక్ష్మణ్ బెహ్రా తెలిపారు. సరిహద్దులో పొరుగుదేశాల నుంచి భారత రక్షణ సవాళ్లు ఎక్కువైపోయాయని, కాని అందుకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు జరగలేదని, గతంతో పోలిస్తే ఇప్పుడు మిలటరీ హార్డ్‌వేర్ వ్యయం బాగా పెరిగిపోయిందని మరో మిలటరీ నిపుణులు బ్రిగ్ (రిటైర్డ్) ఎస్‌కె చటర్జీ పేర్కొన్నారు. జీతాలు, వ్యవస్థాపక నిర్వహణ తదతర ఖర్చులతో కలుపుకుని రెవెన్యూ వ్యయం రూ.1,95,947 కోట్లకు పెరిగిందని అన్నారు. 2015–16తో పోలిస్తే గత ఏడాది రక్షణ రంగ బడ్జెట్‌లో 6.2 శాతం పెరుగుదల ఉందని, ఈ పెంపు 2016–17లో 9.76 శాతంగా ఉందని అన్నారు.

ఆర్థిక పటిష్టీకరణ పరీక్షలో జైట్లీ విఫలం



ఆర్థిక పటిష్టీకరణ పరీక్ష(ఫిస్కల్ కన్సాలిడేషన్ టెస్ట్)లో జైట్లీ విఫలమయ్యారు. దీని పరిణామాలు భవిష్యత్‌లో తీవ్రంగా ఉండనున్నాయి. 2017–18 లో 3.2% ద్రవ్యోల్బణం ఇప్పుడు 3.5% గా ఉంది.

– పి. చిదంబరం, మాజీ ఆర్థిక మంత్రి.

పైకి మాత్రమే గొప్పగా చెప్పుకుంటున్న బడ్జెట్!

ఇది పైకి గొప్పగా చెప్పుకుంటున బడ్జెట్ మాత్రమే. రైతులకు, అణగారిన వర్గాల కోసమని చెప్పుకుంటున్న బడ్జెట్. కానీ అకాలంలో తెచ్చిన అసంపూర్తి బడ్జెట్ అనేందుకు ఇది చక్కని ఉదాహరణ.

మనీశ్ తివారీ, కాంగ్రెస్

ఎన్నికల బడ్జెట్



వచ్చే ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే కేంద్రం చేసిన 'ఎన్నికల బడ్జెట్ 'ఇది. వస్తు,సేవల పన్ను, పెద్ద నోట్ల రద్దు, గుజరాత్ ఎన్నికల ఫలితాలపై విమర్శలు వచ్చినందున నిరాశపూరిత చర్యలు చేపట్టింది. 'ఇది ఎన్నికల బడ్జెట్. కనుకే పారిశ్రమల నుంచి రైతులు, ఆరోగ్యం, విద్య వంటి అంశాలకు మళ్లింది. నేను ఎప్పటి నుంచో ప్రమాణిక విద్య, ఆరోగ్య సేవల గురించి డిమాండ్ చేస్తున్నాను. అయితే ప్రభుత్వం ఇప్పుడే వాటి విషయం పట్టించుకుంది.

– అరవింద్ సావంత్, ఎంపి, శివసేన.

పథకాల రీ ప్యాకేజింగ్



ఇది ఎన్నికల, కుదింపుల బడ్జెట్. ప్రజానుకూలంగా ఉన్నట్టు చూపిస్తున్నప్పటికీ అంతర్జాతీయ, బడా కార్పొరేట్‌ల ప్రయోజనాల కోసం రూపొందించారు. ఈ బడ్జెట్ ఉద్యోగ ఉపాధి అవకాశాలను సామాజిక సంక్షేమ వ్యయాలను కచ్చితంగా కుదిస్తుంది. మధ్యతరగతికి ఎలాంటి ప్రత్యక్ష ప్రయోజనమేమీ లేదు. పాత ఆరోగ్య పథకాలను రీ ప్యాకేజింగ్ చేశారే తప్ప అదనపు కేటాయింపులు లేవు. ఆరోగ్య బీమా పేరుతో ప్రజల డబ్బును బీమా కంపెనీలకు కట్టబెడుతున్నారు.

–సీతారాం ఏచూరి, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి

విధ్వంసకర బడ్జెట్



ఇది విధ్వంసకర బడ్జెట్. తదుపరి సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి బడ్జెట్ ఇది. కాషాయ పార్టీ పెట్టుబడీదారులకు అనుకూలంగానే ఈ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ బడ్జెట్ వ్యాపారులకు, మహిళలకు, శ్రామికులకు, సామాన్యులకు చెంప దెబ్బ వంటిది. వారంతా నిరాశ చెందారు. ఈ విధ్వంసకర బడ్జెట్ సామాన్యుల సమస్యలను నిర్లక్ష్యం చేసింది.

– అఖిలేశ్ యాదవ్, సమాజ్‌వాదీ పార్టీ



జిఓ 111 పై హైకోర్టులో విచారణ

మన తెలంగాణ/ హైదరాబాద్: హైదరాబాద్ మహానగర దాహార్తిని తీర్చే ప్రధాన రిజర్వాయర్లు హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్‌ల పరిధిలో పది కిలోమీటర్ల మేరకు నిర్మాణాలు చేయరాదనే జిఓ 111ను సవాల్ చేస్తూ కొన్ని వ్యాజ్యాలు, ఆ జిఓను అమలు చేసి తీరాలంటూ మరికొన్ని వ్యాజ్యాలు హైకోర్టు విచారణకు వచ్చాయి. వీటిని గురువారం న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, అమర్‌నాథ్‌గౌడ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారించింది. పూర్వం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఎన్నో చెరువులు ఉండేవని, కాలక్రమంలో ఆక్రమణలకు గురయ్యాయని బెంచ్ వ్యాఖ్యానించింది. చెరువుల్ని కాపాడుకోలేకపోతే గతంలో చెన్నైని వరదలు ముంచెత్తినట్లుగానే జరిగే ప్రమాదం ఉందని బెంచ్ హెచ్చరించింది. సగానికిపైగా చెరువులు ఎక్కడున్నాయో కనబడటం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. జిఓ 111 పరిధిలోని మొత్తం 84 గ్రామాల్లో కొన్నింటిని తప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, 1996లో జారీ అయిన ఈ జిఓను అమలు చేయాల్సిందేనని పిటిషనర్ లాయర్ వాదించారు. జిఓను వెనక్కి తీసుకునే ఉద్దేశం హెచ్‌ఎండిఎకు లేదని ఆ సంస్థ లాయర్ బెంచ్‌కి విన్నవించారు. ఆ జిఓపై అధ్యయనం కోసం కమిటీ వేశామని, జిఓ పరిధిలో 84 గ్రామాలు ఉన్నాయని చెప్పారు. చెరువుల్ని కాపాడకపోతే మనిషి మనుగడకే ముప్పు ఏర్పడుతుందని వ్యాఖ్యానించిన బెంచ్ విచారణను 15కి వాయిదా వేసింది.


గద్దెపై సమ్మక్క

- భక్తుల కోలహాలం నడుమ గద్దెనెక్కిన తల్లి
- సమ్మక్క రాకను తెలియజేస్తూ నాలుగుసార్లు తుపాకి కాల్చిన ఎస్‌పి
- దారి పోడవునా ఆదివాసీల నృత్యాలు, సంబురాలు





మన తెలంగాణ/మేడారం : ఆదిపరాశక్తి సమ్మక్క ఆగమనం ఉద్విగ్నం.. ఉద్వేగభరితంగా సాగింది. కోటి మందికిపైగా తరలివచ్చిన భక్తులను జయజయనాదాల మధ్యన చిలకలగుట్టపై నుంచి మేడారానికి తరలివచ్చింది. గురువారం సాయంత్రం తూర్పుదిక్కున ఉన్న చిలకలగుట్ట నుంచి కొక్కెర కృష్ణయ్య, సిద్దబోయిన మునీందర్, సిద్దబోయిన అరుణ్‌కుమార్‌లు సమ్మక్క తల్లిని చిలకలగుట్టపై నుంచి ఆదివాసీ సంప్రదాయలతో తీసుకరాగా మేడారం ట్రస్టుబోర్డు చైర్మన్ కాక లింగయ్య, వరంగల్ నగర మేయర్ నన్నపునేని నరేందర్, జాతర ప్రత్యేకాధికారి ప్రశాంత్ జీవన్ పాటిల్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, జాయింట్ కలెక్టర్ డి. అమయ్‌కుమార్, జిల్లా ఎస్‌పి భాస్కరన్ ఘనంగా స్వాగతం పలికారు. సమ్మక్క గుట్టపై నుంచి దిగివస్తుండగా డోలు వాయిద్యాలతో తుడుం దెబ్బ, కొమ్ముబూరలతో ఘీంకారాలు చేశారు. చిలకల గుట్ట నుంచి మేడారం గద్దెల వరకు దారిపోడవునా ఇసుకవేస్తే రాలనంతగా భక్త జనం తరలివచ్చి తమ ఆరాధ్య దైవం సమ్మక్కకు స్వాగతం పలికారు. మేడారం ఆడపడుచులు, భక్తులు చిలకలగుట్ట నుంచి మేడారం వరకు రోడ్డు నిండా ముగ్గులు వేసి సంక్రాంతి పండుగను తలపించింది. ముందుగా మేడారం గ్రామంలోని సమ్మక్క గుడి వద్ద గురువారం ఉదయం గ్రామ ఆడపడుచులు గుడిని శుద్ధిచేశారు. అందంగా ముగ్గులు వేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీ పూజ సంప్రదాయాలతో ప్రధాన పూజారి చిలకలగుట్టకు భక్తుల ఇలవేల్పు, కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం సమ్మక్కను తీసుకరావడానికి వెళ్లారు. చిలకలగుట్టపై ఉన్న నమిలినార చెట్టు వద్ద ప్రత్యేక పూజా తంతును నిర్వహించారు. కోటి మందికి పైగా వచ్చిన భక్తులు ఎదురు చూస్తుండగా ఆదిపరాశక్తి, అపరకాళి సమ్మక్క గుట్టపై నుంచి కిందకి తీసుకొస్తుండడం భక్తకోటిని ఉద్వేగానికి లోను చేసింది. సాయంత్రం 6గంటల 13 నిమిషాలకు సమ్మక్క గుట్టపై నుంచి కిందకి రాగా 6గంటల 14 నిమిషాలకు సమ్మక్క రాకను తెలియజేస్తూ ఎస్‌పి భాస్కరన్ గాలిలోకి ఎకె 47 తుపాకిని కాల్చి భక్తులకు సమ్మక్క ఆగమనాన్ని తెలియజేశారు. రెండు నిమిషాల వ్యవధిలోనే మరో రెండుసార్లు తుపాకి కాల్చారు. అక్కడి నుంచి చిలకలవాగు వద్దకు రాగానే మరోసారి గాలిలోకి కాల్పులు జరిపారు. తమ ఇలవేల్పు తరలివస్తోందని మేడారం మురిసిపోయింది. భక్తకోటికి దివెనలు ఇచ్చే సమ్మక్క తల్లి వస్తోందని భక్తులు ఎదురుకోళ్లతో స్వాగతం పలికారు. శివసత్తులు పూనకాలతో శివాలెత్తారు. సమ్మక్క నడిచి వస్తుండగా దారివెంట కోళ్లను, మేకలు, మేకపోతులు,గొర్రెలు,గొర్రె పోతులను బలిచ్చారు. భక్తులు కోళ్లను గాలిలోకి ఎగురవేస్తూ బలిచ్చారు. మరికొంత మంది భక్తులు నోటితో జంతువులను బలిచ్చారు. డప్పు చప్పులు, మేళతాళాలు, డోలువాయిద్యాలతో ఆదివాసీలు దింశా నృత్యాలు చేస్తుండగా సమ్మక్క తరలి



వస్తుండగా రెండు కళ్లు చాలలేదు. మార్గ మధ్యలో చలపయ్య వద్ద సమ్మక్క ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి గద్దెల ప్రాంగణం వైపు తల్లి వస్తుండగా భక్తులు జయ జయ ధ్వానాలతో ఎదురెళ్తుతూ తల్లీ సమ్మవ్వా అంటూ ఘనంగా స్వాగతం పలికారు. తల్లిని ముందుకు కదలకుండా అడుగడుగున ఎదురెళ్తుండగా భక్తులను దూరం చేసేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. శివసత్తులుపూనకాలు,భక్తుల జై సమ్మక్కతల్లీ.. జై జై సమ్మక్క తల్లీ అంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తుండగా రాత్రి గంటలకు సమ్మక్కను గద్దెలపై ప్రతిష్ఠింపజేశారు. గద్దెల వద్ద ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి,దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమ్మక్క తల్లికిస్వాగతం పలికారు.గద్దెలపై తల్లిబిడ్డలు కొలువు దీరి ఉండడంతో మొక్కులుచెల్లించుకునేందుకు భక్తులు పోటిపడ్డారు.

నేడు మేడారం జాతరకు ఉపరాష్ట్రపతి

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు శుక్రవారం మధ్యాహ్నం మేడారం జాతరకు హాజరవుతున్నారు.ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం ప్రత్యేక విమానంలో విజయవాడలోని గన్నవరం చేరుకుని అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో భూపాలపల్లి జిల్లాలోని మేడారం చేరుకుంటారు. కోటి మందికిపైగా ఆదివాసీలు హాజరయ్యే తెలంగాణ కుంభమేళాగా గుర్తింపు పొందిన దేశంలోనే అతి పెద్దదైన సమ్మక్క సారలమ్మ జాతరలో వనదేవతల గద్దెను సందర్శించి బెల్లం సమర్పిస్తారు. సాయంత్రానికి తిరిగి విజయవాడ చేరుకుంటారు. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరితో పాటు పలువురు రాష్ట్రమంత్రులు, జిల్లా అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు గత నాలుగు రోజులుగా మేడరంలో ఉండి భక్తులకు సకల సౌకర్యాలు అందేలా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఉపరాష్ట్రపతి రాకను పురస్కరించుకుని భారీ స్థాయిలో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. చత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్ గురువారమే జాతరకు హాజరైన వనదేవతల గద్దెను సందర్శించారు.

మహమూద్ ఆలీకి అస్వస్థత



మన తెలంగాణ /హైదరాబాద్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మహమూద్ ఆలీ అస్వస్థతకు గురికావడంతో గురువారం రాత్రి బంజారాహిల్స్‌లోని అపోలో ఆసుపత్రిలో చేరారు. గుండెకు చేరే రక్తనాళంలో ఆటంకం ఏర్పడినట్లు వైద్యులు పేర్కొన్నారు. సాధారణ చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్ళగా ఈ సమస్య బైటపడిందని, యాంజియోగ్రామ్ చేసిన అనంతరం మిగిలిన పరీక్షలు చేసినట్లు ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. ఆందోళన పడాల్సిన అవసరం లేదని, ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు.

చత్తీస్‌గఢ్ సిఎంకు తప్పిన ప్రమాదం

మన తెలంగాణ/మేడారం: సమ్మక్క సారక్క దర్శనానికి గురువారం మేడారం వచ్చిన చత్తీస్‌గఢ్ సిఎం రమణ్‌సింగ్ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. ముఖ్యమంత్రి సారక్కను దర్శించుకునే సమయంలో భక్తులను క్యూ లైన్‌లోనే నిలిపివేశారు. ఆ సమయంలో కొంత మంది భక్తులు క్యూలైన్ నుంచే కొబ్బరికాయలను అమ్మవారి వద్ద విసిరేందుకు ప్రయత్నించారు.ఈ క్రమంలో ఓ భక్తుడు వేసిన కొబ్బరికాయ ముఖ్యమంత్రి రమణ్‌సింగ్‌పైకి రాగా,అతడి సిబ్బంది స్పందించి ప్రమాదం నుంచి తప్పించారు. దీంతో రమణ్‌సింగ్ అమ్మవారిని దర్శించుకోకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. దీనిపై ఆగ్రహారం వ్యక్తం చేసిన రాష్ట్ర బిజెపి కార్యకర్తలు ఆందోళనకు దిగారు.

గ్రామాల్లో ఉండని సర్పంచ్‌లపై వేటు



మన తెలంగాణ/ సిరి సిల్ల: గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మెరుగుపడటం కోసం త్వరలోనే నూతన పంచాయతీరాజ్ చట్టం రూపొందించనున్నట్లు మంత్రి కెటిఆర్ వెల్లడించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌లో ఆయన మాట్లాడారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచులను,వార్డు సభ్యులను గ్రామా ల్లో ఉండి ప్రజల బాగోగులు చూసేలా చట్టం చేస్తున్నామన్నారు. స్థానికంగా ఉండి గ్రామ అభివృద్ధికి పనిచేయని సర్పంచులను తొలగించే అధికారం కూడా కొత్త చట్టంలో ప్రభుత్వానికి ఉండేలా మార్పులు చేస్తున్నామన్నారు.

కుంటియాతో మందకృష్ణ భేటీ



మన తెలంగాణ/హైదరాబాద్: వర్గీకరణకు మద్దతుగా పార్లమెంటు ఉభయ సభల్లో కాంగ్రెస్ ఎంపిలు ఒత్తిడి పెంచాలని, అలాగే ఎఐసిసి అధ్యక్షులు రాహుల్‌గాంధీతో కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేపట్టకపోతే బిజెపిని మాదిగ దండోర వెంటాడుతుందని హెచ్చరించారు. వర్గీకరణకు మద్దతు ఇవ్వాలని కోరుతూ గాంధీభవన్‌లో గురువారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్చ్ ఆర్.సి.కుంటియా, పిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మందకృష్ణ కలిశారు. వర్గీకరణకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతునిస్తున్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనే వర్గీకరణ సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని వారిని కోరారు. అనంతరం మందకృష్ణమాదిగ మీడియాతో మాట్లాడుతూ వర్గీకరణ అంశాన్ని బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీలోపే పార్లమెంట్ సమావేశాల్లో సమస్య పరిష్కారం కావాలన్నారు.

తెలుగు వర్శిటీ పురస్కారాలు

మనతెలంగాణ/హైదరాబాద్ :తెలుగు భాషా సాహిత్యాలు, సంస్కృతి, కళా ప్రక్రియల్లో విశిష్ట సేవలందించిన 12 మంది ప్రముఖులకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారాలను ప్రకటించింది. వర్శిటీ ఉపాధ్యక్షులు ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ అధ్యక్షతన గల ఎంపిక కమిటీ వివిధ రంగాల్లో చేసిన సేవలను పరిశీలించి ప్రతిభను పరిగణలోకి తీసుకుని పురస్కారాలను ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ ఆచార్య అలేఖ్య పుంజాల ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో వీరికి పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. పురస్కారం కింద రూ.20,116 నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేసి శాలువాతో సత్కరిస్తామని అన్నారు. 'మన తెలంగాణ' పత్రికా సంపాదకులు కె.శ్రీనివాసరెడ్డి (పత్రికారంగం), వసంతరావు దేశ్‌పాండే (కథ/నవల), వేణు సంకోజు (కవిత్వం), నియోగి (విమర్శ), మాసు రామ్ రవికాంత్ (చిత్రకళ), శివరామాచారి (శిల్పకళ), కనజా ఉదయ్(నృత్యం), కె.ఎస్.ఆర్.బాల కృష్ణశాస్త్రి (సంగీతం), అయ్యదేవర పురుషోత్తమరావు(నాటక రంగం), అంగళకుర్తి రామమూర్తి(జానపద కళారంగం),జి.ఎం. రామశర్మ (అవధానం),అయినంపూడి శ్రీలక్ష్మి (ఉత్తమ రచయిత్రి)లు పురస్కారానికి ఎంపికైనట్లు తెలిపారు.

విధుల్లో 8000 మంది కానిస్టేబుళ్లు

మన తెలంగాణ/హైదరాబాద్ :పోలీసు కానిస్టేబుళ్లుగా తొమ్మిది నెలల శిక్షణ ముగించుకున్న సుమారు 8వేల మంది కానిస్టేబుళ్లు గురువారం కొత్తగా విధుల్లో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి పోలీసురిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా వీరంతా సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వు, టిఎస్‌ఎస్‌పి తదితర విభాగాలలో ఎంపికయ్యారు.

అది టిఆర్‌ఎస్ పరాజయ యాత్ర



మన తెలంగాణ/ హైదరాబాద్ : మంత్రి కెటిఆర్ గద్వాల సభలో టిఆర్‌ఎస్ జైత్రయాత్ర ప్రారంభ మైందన్నారని, అది జైత్రయాత్ర కాదు టిఆర్‌ఎస్ పరాజయ యాత్ర అని మాజీ మంత్రి,గద్వాల ఎంఎల్‌ఏ డి.కె.అరుణ అన్నారు. చంద్ర గ్రహణం చేసిన సమయంలో కెటిఆర్ ప్రకటన చేశారని, కాబట్టి ఆ పార్టీకి గద్వాల నుండే గ్రహణం పట్టిం దన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో ఎంఎల్‌ఏ సంపత్‌కుమార్‌తో కలిసి గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమా వేశంలో ఆమె మాట్లాడుతూ టిఆర్‌ఎస్ పార్టీ తల కిందులు తపస్సు చేసినా మళ్ళీ అధికారంలోకి రాదన్నారు.

కెటిఆర్‌వి ఉత్తర్ కుమార ప్రగల్భాలు – పొంగులేటి : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాజకీయ సన్యాసం చేస్తాన్న మంత్రి కెటిఆర్‌వి ఉత్తర కుమార ప్రగ ల్భాలు అని సిఎల్‌పి ఉప నేత పొంగులేటి సుధాకర రెడ్డి అన్నారు.చిత్తశుద్ధి ఉంటే అధికార దుర్వినియోగం చెయ్య కుండా, డబ్బు ప్రభావం లేకుండా ఎన్నికల్లో గెలుస్తామని కెటిఆర్ ప్రమాణం చెయ్యాలన్నారు.

సూకీ ఇంటిపై పెట్రో బాంబ్

రంగూన్: మయన్మార్‌లోని యంగోన్‌లో ప్రభుత్వ సలహాదారు అంగ్ సాన్ సూకీ ఇంటిపై దుండగుడు పెట్రోల్ బాంబు విసిరాడు. బాంబ్ ఇంటి ఆవరణలో పడిందని, ఘటన జరిగినప్పుడు ఆమె ఇంట్లో లేరని గురువారం సీనియర్ అధికారులు తెలిపారు.

గాంధీభవన్‌లో మల్‌రెడ్డి అనుచరుల ఆందోళన



మన తెలంగాణ/ హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా డిసిసి అధ్యక్షుడు క్యామమల్లేశ్‌ను ప్రకటించినందుకు నిరసనగా మాజీ ఎంఎల్‌ఏ మల్‌రెడ్డి రంగారెడ్డి అనుచరులు గురువారం గాంధీభవన్ ఎదుట ఆందోళనకు దిగారు. తొలుత వారంతా గాంధీభవన్ వెలపలే ఉండి పెద్దపెట్టున నినాదాలు చేశారు. అదే సమయంలో రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ ఆర్.సి. కుంటి యా కూడా లోపలే ఉన్నారు.దీంతో వారు నినాదాల జోరు పెంచారు. ఒక దశలో అధ్యక్షున్ని కలుస్తామంటూ కార్యకర్తలంతా లోపలికి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు. పిసిసి ఛీఫ్ ఛాంబర్ వద్దకు వెళ్ళే గేటు ను సిబ్బంది మూసి వేశారు. అనంతరం నాయకులు వారిని సముదాయించి బైటికి పంపారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి అనుచరులు మాట్లాడుతూ గత ఎన్నికల్లో క్యామ మల్లేశ్‌కు ఇబ్రహీంపట్నం టిక్కెట్ ఇవ్వడం వల్లే భువనగిరి పార్లమెంటు స్థానంలో ఓడిపోయామన్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డికి ఈసారి టిక్కెట్ ఇస్తే ఎంఎల్‌ఏ, ఎంపి రెండూ గెలుస్తామన్నారు.ఇటీవల ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన ఒక గ్రామ సర్పంచ్ టిఆర్‌ఎస్ నుండి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో జరిగిన సభలో ఉత్తమ్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం నుండి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అదే టిక్కెట్ ఆశిసున్న మల్‌రెడ్డి రంగారెడ్డి దీనిపై ఆగ్ర హం వ్యక్తం చేస్తూ అనుచరులతో సహా గాంధీభవన్‌కు వచ్చారు.

వచ్చే నెల నుండి అభ్యర్థులపై సర్వే – ఉత్తమ్ : కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గుర్తించేందుకు వచ్చే నెల నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సర్వే ప్రారంభం కాబోతుందని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. మల్‌రెడ్డి రంగారెడ్డి అనుచరు లను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఎవరైనా గెలిచే వారికే టికెట్ ఇవ్వాలనుకుంటారని, ఎఐసిసి, పిసిసి సర్వేల ఆధారంగానే అభ్యర్థులను గుర్తిస్తామన్నారు. తాము పిసిసి నుండి పంపే జాబితా, ఎఐసిసి సర్వే జాబి తా ఆధారంగా అభ్యర్థులపై కాంగ్రెస్ అధ్యక్షులు రాహుల్ గాంధీదే తుది నిర్ణయమని చెప్పారు.

గుర్రుగా ఉన్న భట్టి విక్రమార్క : అధిష్ఠానం ప్రమేయం లేకుండా ఎవరైనా ముందుగా అభ్యర్థులను ప్రకటించడం తప్పు అని టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క అన్నారు. గాంధీ భవన్‌లో ఆయన జర్నలిస్టులతో మాట్లాడుతూ అభ్యర్థు లను ప్రకటించే అధికారం కేవలం కాంగ్రెస్ సెంట్రల్ ఎలక్షన్ కమిటీకే ఉంటుందన్నారు. అలా కాకుండా ముందుగా అభ్యర్థులను ప్రకటించడం సరైంది కాదన్నారు. ఇదిలా ఉండగా పార్టీ అనుబంధ సంఘాల బాధ్యతలు నిర్వర్తిస్తున్న తనకు తెలియకుండా ఓబిసి సాధికార కమిటీని వేయడం పట్ల భట్టి విక్రమార్క గుర్రుగా ఉన్నారు. ఇదే విషయాన్ని ఆయన కుంటియాకు ఫిర్యాదు చేశారు.

10 హైకోర్టులకు చీఫ్ జస్టిస్ సిఫారసు

తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా టిబి రాధాకృష్ణన్ పేరు

న్యూఢిల్లీ: దేశంలోని పది హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సిఫారసు చేసిన సుప్రీంకోర్టు కోలిజియం గురువారం వారి పేర్లను తన అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచింది. జస్టిస్ దీపక్ మిశ్రా, జె చలమేశ్వర్,రంజన్ గొగోయ్‌లతో కూడిన కోలిజియం జనవరి11న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను ఎంపిక చేసింది. తెలంగాణ–ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, కలకత్తా, కర్నాటక, త్రిపుర, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, మణిపూర్ హైకోర్టులకు న్యాయమూర్తులను సిఫారసు చేసింది. ఛత్తీస్‌గఢ్ ప్రధాన న్యాయమూర్తి టిబి రాధాకృష్ణన్‌ను తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు బదిలీకి ప్రతిపాదించింది. కలకత్తా హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ అనిరుధా బోస్‌ను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సిఫారసు చేసింది. ఏప్రిల్ 13న జస్టిస్ జి రోహిణి పదవీ విరమణతో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గీతా మిట్టల్ వ్యవహరిస్తున్నారు. మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దినేష్ మహేశ్వరిని కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా కోలిజియం ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ తరుణ్ అగ్రవాలాను మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిపాదించింది. కలకత్తా, కేరళ హైకోర్టులకు న్యాయమూర్తులను ఎంపిక చేయాల్సి ఉంది. గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి అభిలాష కుమారిని మణిపూర్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రతిపాదించింది. పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ కుమార్ త్రిపాఠిని ఛత్తీస్‌గఢ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఎంపిక చేసింది. జస్టిస్ సూర్యకాంత్‌ను హిమాచల్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పదోన్నతికి ప్రతిపాదించింది. రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అజయ్ రస్తోగి త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నామినేట్ చేసింది. గువాహటి హైకోర్టు న్యాయమూర్తి హృశికేశ్ రాయ్‌ను కేరళ హైకోర్టుకు బదిలీకి ప్రతిపాదించింది. అలహాబాద్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా జస్టిస్ శియో కుమార్ సింగ్‌ను శాశ్వత న్యాయమూర్తిగా పదోన్నతికి కోలిజియం సిఫారసు చేసింది.

ఫీజుల దాహానికి విద్యార్థి బలి



మన తెలంగాణ/మల్కాజిగిరి : ప్రైవేట్ పాఠశాల ఫీజు దాహానికి ఓ చిన్నారి చదువుల తల్లి తనువు చాలించింది. స్కూల్ ఫీజు చెల్లించనందుకు పరీక్ష రాయనివ్వలేదని ఓ విద్యార్థిని తీవ్ర మనస్తాపానికి గురై సూసైడ్ లెటర్ వ్రాసి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మల్కాజిగిరిలోని జయగిరి లక్ష్మీ నరసింహ స్వామి నగర్‌లో నివాసముండే బాల కృష్ణ, సునీతలకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు కె.సాయి దీప్తి (14) జ్యోతి నగర్‌లో గల జ్యోతి హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది. అయితే ఫీజు చెల్లించలేదని పాఠశాల యాజమాన్యం సాయి దీప్తిని గురువారం పరీక్ష రాయనివ్వలేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సాయి దీప్తి ఇంటికి వెళ్లాక 'నన్ను ఎగ్జామ్ రాయనీయలేదు సారీ మామ్'అని సూసైట్ లేటర్ రాసి మధ్యా హ్నం ఇంట్లో చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమా ర్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఫార్మాసిటీతో కాలుష్యం ముప్పు

అధికారుల తప్పుడు నివేదికలు : కాంగ్రెస్

మన తెలంగాణ/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీ ఏర్పాటుపై స్థానికంగా వ్యతిరేకత వ్యక్తమైనప్పటికీ అందరూ అంగీకరించినట్లుగా కేంద్ర కమిటీకి రాష్ట్ర అధికారులు తప్పుడు నివేదిక అందించారని కాంగ్రెస్ నేతలు మాజీ మంత్రి మర్రిశశిధర్ రెడ్డి, ఎంఎల్‌ఏ వంశీచంద్ రెడ్డి, మాజీ ఎంఎల్‌ఏ ఎం.కోదండరెడ్డి ఆరోపించారు. ఫార్మాసిటీతో పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయని, తద్వారా ప్రజలు ఇబ్బందులు పడుతారన్నారు. గాంధీభవన్‌లో గురువారం వారు మీడియా సమావేశంలో మాట్లాడుతూ గ్రామ సభలలో తీర్మానం చేసి అందరూ అంగీకరిస్తేనే భూసేకరణ చట్టం ప్రకారం పట్టా, అసైన్డ్ భూములకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల మేడిపల్లిలో నిర్వహించిన బహిరంగ విచారణలో స్థానిక సర్పంచ్‌ను కూడా రానివ్వకుండా నిర్బంధించారని, ప్రజలను రానివ్వలేదని ఆరోపించారు. పార్మాసిటీలోకి ఎన్ని సంస్థలు వస్తాయో, వాటి ద్వారా ఏ మేరకు కాలుష్యం వస్తుందో ప్రభుత్వానికి అంచనా కూడా లేదన్నారు. భూసేకరణ, పర్యావరణ చట్టాలను ఉల్లంఘించి 19,330 ఎకరాల స్థలాన్ని విషతుల్యం చేస్తున్నారని వంశీచంద్‌రెడ్డి ఆరోపించారు.

ఈ పాపం పోలీసులదే

పోలీసులు సకాలంలో స్పందించి ఉంటే దారుణం జరిగేది కాదు : షర్ఫుద్దీన్ బాధితులు

మన తెలంగాణ/హైదరాబాద్: ఫిర్యాదు అందిన ఐదు నిముషాలలోపే బాధితుల వద్దకు చేరుకుంటామని పదేపదే చెబుతున్న డిజిపి మాటలకు స్టేషన్ అధికారుల వైఖరి మధ్య పొంతన ఉండడం లేదనడానికి గురువారం జరిగిన సంఘటన తార్కాణం. గోల్కొండ పరిధిలోని రౌడీషీటర్ అర్షద్‌కు, ఫస్ట్‌లాన్సర్‌లోని బుల్కాపూర్ నాలా పక్కన ఉన్న కారు మెకానిక్ షెడ్ యజమాని షర్ఫుద్దీన్‌కు మధ్య గురువారం మామూళ్ల విషయంలో వాదన జరిగింది. బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌కు వెళ్లిన షర్ఫుద్దీన్ రౌడీషీటర్ అర్షద్‌పై మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఫిర్యాదు చేసి తిరిగి షెడ్‌కు చేరుకున్నారు. పోలీసులు గంట తర్వాత షెడ్‌కు వచ్చి ఈ ప్రాంతం తమ పరిధిలోకి రాదని చెప్పి చేతులు దులుపు కున్నారు. ఫిర్యాదు చేసిన విషయాన్ని తెలుసుకున్న అర్షద్ బంజారా హిల్స్‌కు చెందిన మరో రౌడీషీటర్ ఫిర్దోస్‌తో కలిసి షెడ్ దగ్గరకు మూడు గంటల ప్రాంతంలో వచ్చి షర్ఫుద్దీన్‌ను తల్వార్‌లతో నరికి చంపారు. అక్కడికక్కడే చనిపోయాడు. ఒకవేళ వారి పరిధి కాకుంటే ఏ పోలీసు స్టేషన్ పరిధిలోకి వస్తుందో సంబంధిత ఠాణా సిబ్బందిని అప్రమత్తం చేసి ఉంటే ఈ హత్య జరిగి ఉండేది కాదని హతుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

భువనగిరికి వానాకాలంకల్లా కాళేశ్వరం జలాలు

మన తెలంగాణ/హైదరాబాద్: వచ్చే వానాకాలం నాటికి యాదాద్రి భువనగిరి జిల్లాకు కాళేశ్వరం జలాలు అందుతాయని ఇరిగేషన్ శాఖ మంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. ఇందుకుగాను గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికార యంత్రాంగాన్ని, ఏజెన్సీలను ఆదేశించారు. జలసౌధలో కాళేశ్వరం ప్యాకేజీ 15, 16 పనులపై మంత్రి గురువారం సమీక్ష జరిపారు. గంధమల్ల రిజర్వాయర్ పూర్తికాక పోయినా డిస్ట్రిబ్యూటరీల పనులు పూర్తిచేయాలని, మూడు డిస్ట్రిబ్యూటరీలు పూర్తిచేస్తే సుమారు 100 చెరువుల్ని నింపవచ్చని, యాదాద్రి జిల్లాలో 21వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వచ్చని మంత్రి స్పష్టం చేశారు. మరింత కృషి చేస్తే దాదాపు 40 వేల ఎకరాలకు కూడా సాగునీరు ఇవ్వవచ్చని, ఈ డిస్ట్రిబ్యూటరీల భూసేకరణ ప్రక్రియను వారం రోజుల్లో పూర్తిచే యాలని ఆదేశించారు. వచ్చే మూడు నెలల్లో డిస్ట్రిబ్యూటరీల పనులు యుద్ధప్రాతిపదికన జరగాలని అన్నారు. గంధమల్ల ప్రాంతంలో ఉన్న గొలుసుకట్టు చెరువులు, వారి ఆయకట్టు వివరాలు ఇవ్వాలని సూచించారు.

బడ్జెట్‌లో క్రీడలకు ఎక్కువ నిధులు కేటాయించాలి: శాట్స్ చైర్మన్

మన తెలంగాణ/ హైదరాబాద్: వచ్చే రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు అత్యధిక నిధులు కేటాయించేలా చూడాలని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషికి విజ్ఞప్తి చేశారు. చీఫ్ సెక్రటరీగా నియమితులైన శైలేంద్ర కుమార్‌ను శాట్స్ చైర్మన్ గురువారం సచివాలయం మర్యాద పూర్వకంగా కలుసుకొని అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి శాట్స్ పరిధిలో తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. రాష్ట్రంలో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, అయితే దీని కోసం రాష్ట్ర బడ్జెట్‌లో అత్యధిక నిధులు విడుదల అయ్యేలా తనవంతు కృషి చేయాలని కోరారు. క్రీడల కోసం కనీసం రూ.750 కోట్లను బడ్జెట్‌లో కేటాయించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణ క్రీడాకారులు ఎంతో ప్రతిభ చాటుతున్నారని, వీరికి ప్రభుత్వ పరంగా చేయూత ఇవ్వాల్సిన అవసరం ఉందని చైర్మన్ పేర్కొన్నారు. దీని కోసం బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయిస్తే బాగుంటుందని చైర్మన్ అభిప్రాయపడ్డారు.





క్రీడలకు రూ. 1943 కోట్ల కేటాయింపు

- ఈసారి రూ.350 కోట్ల అదనపు నిధులు
- క్రీడా ప్రాధికార సంస్థకు రూ. 481కోట్లు
- బడ్జెట్‌లో క్రీడలకు పెద్ద పీట

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారు. కిందటి బడ్జెట్‌తో పోల్చితే ఈసారి అదనంగా రూ.350 కోట్ల రూపాయలను కేటాయించారు. 2018–19 సంవత్సరానికి గాను క్రీడా రంగానికి రూ.1943 కోట్ల రూపాయలను ప్రకటించారు. కిందటి ఏడాది క్రీడల బడ్జెట్ రూ.1592 కోట్లు ఉండగా ఈసారి అదనంగా మరో రూ.350 కోట్ల రూపాయలను కేటాయించారు. దేశంలో క్రీడలను అభివృద్ధి పరచాలనే ఉద్దేశంతో క్రీడా బడ్జెట్‌ను భారీగా పెంచినట్టు ఆర్థిక మంత్రి వెల్లడించారు. నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందని, ఇందు కోసం పెద్ద మొత్తంలో నిధులను ప్రకటించామని వివరించారు. భవిష్యత్తులో జరిగే ఒలింపిక్స్, ప్రపంచ చాంపియన్‌షిప్‌లలో భారత క్రీడాకారులు మెరుగైన ప్రతిభను కనబరిచేలా కింది స్థాయి నుంచి క్రీడలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఇందు కోసం భారీ మొత్తంలో నిధులను కేటాయించినట్టు ప్రకటించారు. కేంద్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాయ్)కు కేటాయించే నిధులను రూ.481 కోట్లకు పెంచినట్టు తెలిపారు. దేశంలో క్రీడాభివృద్ధికి శాయ్ చేస్తున్న కృషికి ప్రోత్సాహకంగా నిధులను పెంచినట్టు వివరించారు. కాగా, రానున్న కామన్‌వెల్త్, ఆసియా క్రీడల నేపథ్యంలో క్రీడాకారులకు ఎటువంటి లోటు లేకుండా చూసేందుకు ప్రత్యేక నిధులను కేటాయించామన్నారు. జాతీయ క్రీడా సమాఖ్యకు అందజేసే నిధులను రూ.302 కోట్లకు పెంచినట్టు జైట్లీ తెలిపారు. గతంలో ఈ నిధులు రూ.185 కోట్లు ఉండగా ఈసారి రూ. 302కు పెరిగినట్టు వివరించారు. అదే విధంగా ఉత్తర పూర్వ రాష్ట్రాల్లో క్రీడాభివృద్ధికి కేటాయించే నిధులను కూడా పెంచినట్టు తెలిపారు. ఈ ఏడాది ఈ నిధులను రూ. 148.4 కోట్లకు పెంచామని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా కార్యక్రమానికి కూడా నిధులను భారీగా పెంచారు. గతంలో ఉన్న రూ.140 కోట్ల రూపాయల నిధులను ఈసారి రూ.350 కోట్లకు పెంచినట్టు మంత్రి వివరించారు. ఇదిలావుండగా బడ్జెట్‌పై కేంద్ర క్రీడల మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ హర్షం వ్యక్తం చేశారు. దేశంలో క్రీడాభివృద్ధికి ఈ బడ్జెట్ ఎంతో దోహదం చేస్తుందని ఆయన అన్నారు.

పాకిస్థాన్‌కు మూడో స్థానం

అండర్–19 ప్రపంచకప్



జాన్ డేవిస్ ఓవల్: న్యూజిలాండ్ వేదికగా జరిగిన అండర్–19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. మూడు, నాలుగు స్థానాల కోసం గురువారం ఇక్కడ పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల మధ్య జరిగిన మ్యాచ్ వర్షం వల్ల ఒక్క బంతి పడకుండానే రద్దయ్యింది. దీంతో లీగ్ దశలో పైచేయి సాధించిన పాకిస్థాన్‌కు మూడో స్థానం దక్కింది. అఫ్గాన్ నాలుగో స్థానంతో సరిపెట్టుకోక తప్పలేదు. భారత్‌తో జరిగిన సెమీఫైనల్లో పాకిస్థాన్ 203 పరుగుల భారీ తేడాతో పరాజయం పాలైన విషయం తెలిసిందే. మరోవైపు అఫ్గానిస్థాన్ కూడా ఆస్ట్రేలియా చేతిలో పరాభవం చవిచూసింది. సెమీస్‌లో ఓడిన ఇరు జట్ల మధ్య మూడో స్థానం కోసం ప్లేఆఫ్ మ్యాచ్ నిర్వహించారు. అయితే వర్షం వల్ల మ్యాచ్ రద్దు కావడంతో పాకిస్థాన్ మూడో స్థానాన్ని దక్కించుకుంది.

లంక దీటైన జవాబు

ధనంజయ అజేయ శతకం, రాణించిన కుశాల్



చిట్టగాంగ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో శ్రీలంక దీటైన జవాబిస్తోంది. ఆతిథ్య బంగ్లాదేశ్ మొదటి ఇన్నింగ్స్‌లో 513 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక గురువారం రెండో రోజు ఆట ముగిసే ఒక వికెట్ నష్టానికి 187 పరుగులు చేసింది. ధనంజయ డిసిల్వా 104(నాటౌట్) అజేయ శతకంతో లంకను ఆదుకున్నాడు. మొదటి ఇన్నింగ్స్ చేపట్టిన లంకకు ప్రారంభంలోనే షాక్ తగిలింది. ఓపెనర్ దిముత్ కరుణరత్నె (0) ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. అయితే తర్వాత వచ్చిన ధనంజయతో కలిసి మరో ఓపెనర్ కుశాల్ మెండిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు తీసుకెళ్లాడు. ఇద్దరు బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొంటూ ఇన్నింగ్స్‌ను కుదుట పరిచారు. కుశాల్ మెండిస్ రక్షణాత్మక బ్యాటింగ్‌ను కనబరచగా ధనంజయ వేగంగా ఆడాడు. బంగ్లా బౌలర్లను హడలెత్తించిన ధనంజయ 127 బంతుల్లో 15 ఫోర్లతో 104 పరుగులు చేసి అజేయంగా ఉన్నాడు. మరోవైపు సమన్వయంతో బ్యాటింగ్ చేసిన మెండిస్ ఏడు ఫోర్లు, ఒక సిక్స్‌తో 83 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇద్దరు కలిసి రెండో వికెట్‌కు అబేధ్యంగా 187 పరుగులు జోడించారు. అయితే బంగ్లా తొలి ఇన్నింగ్స్ స్కోరును అందుకోవాలంటే లంక మరో 326 పరుగులు చేయాలి. అంతకుముందు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 513 పరుగులకు ఆలౌటైంది. రెండో రోజు లంక బౌలర్లు అద్భుతంగా రాణించడంతో బంగ్లా ఇన్నింగ్స్ ఊహించిన దానికంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. మోమినుల్ హక్ (175) రెండో రోజు త్వరగానే పెవిలియన్ చేరాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన మహ్మదుల్లా ఏడు ఫోర్లు, రెండు సిక్సర్లతో 83 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. మిగతావారిలో మెహది హసన్ (20), సున్జాముల్ ఇస్లాం (24) మాత్రమే రాణించారు. లంక బౌలర్లలో లక్మల్, హెరాత్ మూడేసి వికెట్లు పడగొట్టారు. సందకాన్‌కు రెండు వికెట్లు లభించాయి.

శ్రీకాంత్ ఔట్

కశ్యప్, సింధు, సైనా ముందుకు, ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ ఓపెన్‌లో భారత్‌కు కోలుకోలేని షాక్ తగిలింది. అగ్రశ్రేణి ఆటగాడు కిదాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లోనే ఇంటిదారి పట్టాడు. ఇప్పటికే అజయ్ జయరాం, హెచ్‌ఎస్. ప్రణయ్‌లు టోర్నమెంట్ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. తాజాగా వీరి సరసన శ్రీకాంత్ కూడా చేరాడు. మరోవైపు సమీర్ వర్మ, పారుపల్లి కశ్యప్ రెండో రౌండ్‌లో విజయం సాధించారు. మహిళల సింగిల్స్‌లో అగ్రశ్రేణి క్రీడాకారిణిలు పివి.సింధు, సైనా నెహ్వాల్‌లు క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నారు. స్పెయిన్ స్టార్ కారొలైన్ మారిన్, థాయిలాండ్ అగ్రశ్రేణి క్రీడాకారిణి ఇంటానొన్ మూడో రౌండ్‌కు చేరుకున్నారు. కాగా, పురుషుల సింగిల్స్‌లో తెలుగు తేజం శ్రీకాంత్‌కు ఊహించని షాక్ తగిలింది. మలేసియా ఆటగాడు ఇస్కాందర్ జుల్కర్నైన్ చేతిలో శ్రీకాంత్ కంగుతిన్నాడు. సొంత గడ్డపై శ్రీకాంత్ టైటిల్ గెలవడం ఖాయమని భావించిన అభిమానులకు నిరాశే మిగిలింది. హోరాహోరీగా సాగిన సమరంలో ఇస్కాందర్ 21–19, 21–17 తేడాతో శ్రీకాంత్‌ను ఓడించాడు. ప్రారంభం నుంచే మలేసియా ఆటగాడు దూకుడైన ఆటతో పైచేయి సాధించాడు. మరోవైపు తీవ్ర ఒత్తిడికి గురైన శ్రీకాంత్ ఏదశలోనూ ప్రత్యర్థిపై ఆధిపత్యం చెలాయించలేకపోయాడు. అంతేగాక కీలక సమయంలో వరుస తప్పిదాలకు పాల్పడడంతో ఓటమి తప్పలేదు.





సమీర్ ఉత్కంఠ గెలుపు..

మరోవైపు సమీర్ వర్మ హోరాహోరీ పోరులో విజయం సాధించాడు. ఇండోనేసియాకు చెందిన సుగియార్టొతో జరిగిన పోరులోసమీర్ చెమటోడ్చి విజయం సాధించాడు. నువ్వానేనా అన్నట్టు సాగిన పోరులో సౌరభ్ 21–18, 19–21, 21–17 తేడాతో జయకేతనం ఎగుర వేశాడు. మరో పోటీలో కశ్యప్ కూడా చెమటోడ్చాడు. హోరాహోరీగా సాగిన పోరులో కశ్యప్ 19–21, 21–19, 21–12 తేడాతో భారత్‌కే చెందిన జైస్వాల్‌పై విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ఓటమి పాలైన కశ్యప్ తర్వాత వరుసగా రెండు సెట్లు గెలిచి క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. మరో పోటీలో గుల్షన్ కుమార్ (భారత్) ఓటమి పాలయ్యాడు. మహిళల సింగిల్స్‌లో సింధు అలవోక విజయాన్ని అందుకుంది. బల్గేరియా క్రీడాకారిణి లిండా జెట్చిరితో జరిగిన మ్యాచ్‌లో సింధు 21–10, 21–14తో విజయం సాధించింది. మరో పోటీలో మారిన్ (స్పెయిన్) చెమటోడ్చి విజయం సాధించింది. మూడో సెట్ల సమరంలో మారిన్ చైనా క్రీడాకారిణి ఫాంగ్‌జి గావోను ఓడించింది. కాగా, భారత్‌కు చెందిన అరుషి కశ్యప్ రెండో రౌండ్‌లో ఓటమి పాలైంది. మరోవైపు అగ్రశ్రేణి క్రీడాకారిణి సైనా రెండో రౌండ్‌లో సునాయాస విజయం సాధించింది. డెన్మార్క్ క్రీడాకారిణి లినెతో జరిగిన పోరులో సైనా 21–12 21–11తో జయభేరి మోగించింది.



మేరీ కోమ్‌కు స్వర్ణం

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ మేరీ కోమ్ మహిళల 48 కిలోల విభాగంలో స్వర్ణ పతకం గెలుచుకుంది. పోటీల చివరి రోజు మేరీకోమ్ అసాధారణ ఆటతో భారత్‌కు పసిడి పతకం సాధించి పెట్టింది. జోసి గబుకోతో జరిగిన ఫైనల్లో మేరీకోమ్ 4–1 తేడాతో ఘన విజయం సాధించి స్వర్ణం దక్కించుకుంది. ప్రారంభం నుంచే మేరీకోమ్ అద్భుతంగా ఆడింది. తన మార్క్ పంచ్‌లతో ప్రత్యర్థిని హడలెత్తించింది. చివరి వరకు దూకుడును ప్రదర్శిస్తూ స్వర్ణం గెలుచుకుంది. పురుషుల 60 కిలోల విభాగంలో మనీష్ కౌశిక్ పసిడి పతకం గెలుచుకున్నాడు. అతని ప్రత్యర్థి గాయం వల్ల ఫైనల్ బరిలోకి దిగలేదు. దీంతో మనీష్‌కు వాకోవర్ లభించింది. పసిడి పతకం కూడా అతని ఖాతాలోకి వెళ్లింది. మరోవైపు సతీష్ కుమార్ రజత పతకం లభించింది. ఫైనల్లో అతను ఓటమి పాలై రజతంతో సరిపెట్టుకున్నాడు. ఈ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు పది పతకాలు గెలుచుకొని సత్తా చాటారు.

చెస్ విజేత రాహుల్

మన తెలంగాణ/ హైదరాబాద్: రెండో నిథమ్ ఓపెన్ ఫైడ్ రేటెడ్ చెస్ టోర్నమెంట్‌లో రాహుల్ శ్రీవాస్తవ్ విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లో జరిగిన ఈ పోటీల్లో పలువురు అంతర్జాతీయ, జాతీయ స్థాయి చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు. నాలుగు రోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. ఇందులో రాహుల్ అద్భుత ఆటతో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నాడు. స్పెయిన్‌కు చెందిన లియా నెజా వెగా మారూస్ రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. మరోవైపు బీహార్‌కు చెందిన అశుతోష్ కుమార్ మూడో స్థానం సాధించాడు. కాగా, గురువారం గచ్చిబౌలిలో జరిగిన కార్యదక్రమంలో నిథమ్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ చిన్నం రెడ్డి విజేతలకు ట్రోఫీలను బహూకరించారు. పోటీల నిర్వహణ కార్యదర్శి షేక్ ఫయాజ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



టీమిండియా జయకేతనం

- చెలరేగిన కోహ్లి, రహానె, డుప్లెసిస్ శతకం వృథా, దక్షిణాఫ్రికా ఓటమి

డర్బన్: దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో భారత్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కెప్టెన్ విరాట్ కోహ్లి అద్భుత సెంచరీకి, అజింక్య రహానె చిరస్మరణీయ బ్యాటింగ్ తోడు కావడంతో భారత్ అద్భుత విజయాన్ని అందుకుంది. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన కోహ్లి 119 బంతుల్లో పది ఫోర్లతో 112 పరుగులు చేశాడు. మరోవైపు రహానే 86 బంతుల్లో ఆరు ఫోర్లు, రెండు సిక్సర్లతో 79 పరుగులు చేశాడు. దీంతో భారత్ ఘన విజయం అందుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో 8వికెట్ల నష్టానికి 269 పరుగులు చేసింది. కెప్టెన్ డుప్లెసిస్ (120) అద్భుత సెంచరీతో దక్షిణాఫ్రికాను ఆదుకున్నాడు. అంతకుముందు భారీ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన భారత్‌కు ఓపెనర్లు రోహిత్ శర్మ, శిఖర్ ధావన్‌లు మెరుగైన ఆరంభాన్ని ఇచ్చారు. అయితే రెండు ఫోర్లు, ఒక సిక్స్‌తో 20 పరుగులు చేసిన రోహిత్‌ను మోర్కెల్ పెవిలియన్ పంపించాడు. దీంతో 33 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. తర్వాత వచ్చిన కెప్టెన్ విరాట్ కోహ్లితో కలిసి



మరో ఓపెనర్ శిఖర్ ధావన్ స్కోరును పరిగెత్తించాడు. ధాటిగా ఆడిన ధావన్ 29 బంతుల్లోనే ఆరు ఫోర్లతో 35 పరుగులు చేశాడు. అయితే లేని పరుగు కోసం ప్రయత్నించి రనౌటయ్యాడు.



ఆదుకున్న డుప్లెసిస్..

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికాకు ఆశించిన విధంగా శుభారంభం లభించలేదు. ఓపెనర్ హాషిం ఆమ్లా ఒక ఫోర్‌తో 16 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. అయితే మరో ఓపెనర్ డికాక్ మాత్రం కుదురుగా ఆడాడు. 4 ఫోర్లతో 34 పరుగులు చేసి వెనుదిరిగాడు. మరోవైపు మార్క్రామ్ (9) కూడా భారీ స్కోరును సాధించలేక పోయాడు. ఇదే సమయంలో డుమినీ (12), డేవిడ్ మిల్లర్ (7) వెంటవెంటనే పెవిలియన్ చేరారు. దీంతో సౌతాఫ్రికా 134 పరుగుల వద్ద ఐదో వికెట్ కోల్పోయింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా డుప్లెసిస్ పోరాటం కొనసాగించాడు. అతనికి క్రిస్ మోరిస్ అండగా నిలిచాడు. కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన డుప్లెసిస్ స్కోరును పరిగెత్తించాడు. ఒకవైపు వికెట్‌ను కాపాడుకుంటూనే చెత్త బంతులను బౌండరీలకు తరలిస్తూ స్కోరు వేగం తగ్గకుండా చూశాడు. మరోవైపు భారత స్పిన్నర్లు చాహల్, కుల్దీప్‌లు పొదుపుగా బౌలింగ్ చేస్తూ ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు చేయకుండా అడ్డుకున్నారు. కాగా, కీలక ఇన్నింగ్స్ ఆడిన మోరిస్ 4ఫోర్లు, సిక్స్‌తో 37 పరుగులు చేసి కుల్దీప్ వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఇదే క్రమంలో ఆరో వికెట్‌కు 74 పరుగుల భాగస్వామ్యంలో పాలుపంచుకున్నాడు. తర్వాత వచ్చిన ఫెలూక్వాయో (27) అండతో డుప్లెసిస్ పోరాటం కొనసాగించాడు. చిరస్మరణీయ బ్యాటింగ్‌ను కనబరిచిన డుప్లెసిస్ 112 బంతుల్లో 11 ఫోర్లు, రెండు సిక్సర్లతో 120 పరుగులు చేసి ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఔటయ్యాడు. ఫెలూక్వాయో ఒక ఫోర్, మరో సిక్స్‌తో 27 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీంతో సౌతాఫ్రికా స్కోరు 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 269 పరుగులకు చేరింది.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy**, RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.